
www.visalaandhra.com | VISALAANDHRA Regd No.VJ/042/2018-20 | పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం | వెల: రూ.5.00

SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
సంపుటి : 68, సంచిక : 201
అక్షరాక్షరం అభ్యుదయం

ఆదివారం 13-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ

Sunday Special





పండగొచ్చింది...
పల్లె పిలుస్తోంది

- ప్రపంచీకరణతో గ్రామాలకు గ్రహణం
- యువతరానికి తెలియని పల్లెటూళ్లు
- మళ్లీ పెరుగుతున్న మోజు
- వరుస సెలవులతో పల్లెబాట



సంక్రాంతి.. సూర్యుడు... మకరరాశి, ఉత్తరాయణానికి స్వాగతం.. ఇలా ఎన్ని వర్ణనలున్నప్పటికీ మనకు మాత్రం మన భాషలో తెలుగు వారి అతి పెద్ద పండుగ సంక్రాంతి. ఈ మూడు రోజులు కుటుంబమంతా కలిసి పండుగ చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఈ మధుర స్మృతులను సంవత్సరమంతా నెమరు వేసుకుంటారు. ఈ పండుగ స్మృతుల కోసం తమ మూలాలైన గ్రామాలకు ప్రతి కుటుంబం తరలి వెళ్లేందుకు సిద్ధమవుతోంది.

7 లో

3,69,33,091
ఏపీ ఓటర్ల తుది జాబితా
విడుదల చేసిన ఎన్నికల కమిషన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ శనివారం ప్రకటించింది. ఏపీలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,69,33, 091గా తేల్చింది. వారిలో పురుషులు 1,83, 24,588 మంది కాగా, మహిళా ఓటర్లు 1,86,04,742 మంది ఉన్నారు. థర్డ్ జెండర్స్ 3,761 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా 40,13,770 మంది ఓటర్లు కలిగిన జిల్లాగా తూర్పుగోదావరి నిలవగా, అత్యల్పంగా విజయ నగరంలో 17,33,667 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాల వారీగా ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే శ్రీకాకుళంలో 20,64,330, విజ యనగరం 17,33,667, విశాఖ 32,80, 028, తూర్పుగోదావరి 40,13,770, పశ్చిమ గోదావరి 30,57,922, కృష్ణా 33,03,592, గుంటూరు 37,46,072, ప్రకాశం 24,95, 383, నెల్లూరు 2,06,652, కడప 20,56, 660, కర్నూలు 28,90,884, అనంతపురం 30,58,909, చిత్తూరుజిల్లాలో 30,25,222 మంది ఓటర్లున్నారు.



స్పెషల్ దోపిడీ
ఆర్టీసీ సంక్రాంతి చార్జీల మోత

- పరాకాష్టకు 'ప్రైవేటు' బాదుడు
- బస్సుల్లోనూ వెయిటింగ్ లిస్ట్
- బస్టాండ్, రైల్వే స్టేషన్ల కిటకిట

హైదరాబాద్ -విజయవాడ బస్సు చార్జీలు

రకం	సాధారణ	ప్రత్యేకం
సూపర్ లగ్జరీ	రూ.365	రూ.575
గరుడ ప్లస్	రూ.545	రూ.795
అమరావతి	రూ.595	రూ.865

విశాఖపట్నం-విజయవాడ బస్సు చార్జీలు

రకం	సాధారణ	ప్రత్యేకం
సూపర్ లగ్జరీ	రూ.480	రూ.695
గరుడ ప్లస్	రూ.745	రూ.1090
అమరావతి	రూ.790	రూ.1155

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : సంక్రాంతి పండగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారిని తెలుగు రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలతోపాటు ప్రైవేటు ట్రావెల్స్ నిలువు దోపిడీ చేస్తున్నాయి. పండగ కోసం ప్రత్యేకంగా నడిపే ఆర్టీసీ బస్సుల్లో సాధారణ చార్జీ కంటే అదనంగా 50 శాతం వసూలు చేస్తుండగా ప్రైవేటు ఆపరేటర్లు దూరాలు, సమయాలను బట్టి చార్జీలను రెండు నుంచి మూడు రెట్లు పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ శని, ఆదివారాల్లో టికెట్లు లభించని పరిస్థితి. ఆర్టీసీకి చెందిన అన్ని బస్సుల్లో సీట్లు ఇప్పటికే నిండిపోయి

- మిగతా 2 లో



విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు



మోడీ అబద్ధాల పుట్ట

- రాఫెల్ నుంచి తప్పించుకోవడానికి వర్మకు ఉద్వాసన
- హామీల అమలులో వైఫల్యం
- నోట్లరద్దు, జీఎస్టీతో కేంద్రానికి షాక్
- నారాయణ నిశిత విమర్శ

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ : మోడీ అబద్ధాల ప్రచారానికి గోబెల్స్ బతికుంటే ఆత్మహత్య చేసుకునేవాడని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ విమర్శించారు. విదేశాల్లో మూలుగుతున్న బ్లాక్‌మనీని వెనక్కి తెచ్చి ప్రతి కుటుంబానికి పదిహేను లక్షల రూపాయల వంతున వారి ఖాతాల్లో జమచేస్తానన్న మోడీ వాగ్దానం గాలిలో కలిసిపోయిందని, పెద్ద నోట్ల రద్దుతో

- మిగతా 2 లో

ఈబీసీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



ఢిల్లీ: ఈబీసీ రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లపై గెజిట్ విడుదలైంది. విద్య, ఉద్యోగాల్లో అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు ఇటీవల లోక్‌సభ, రాజ్యసభ 2/3వంతు మెజార్టీతో ఆమోదం తెలిపాయి. దీన్ని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపగా... శనివారం ఆయన ఆమోద ముద్ర వేశారు. దీంతో అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మార్గం సుగమమైంది.

ఏప్రిల్ 20 నుంచి ఏపీ ఎంసెట్

- మూడురోజులపాటు ఇంజనీరింగ్
- ఏప్రిల్ 24న ఎంసెట్ అగ్రికల్చర్
- ఏపీ ఐసెట్ ఏప్రిల్ 26న
- ప్రవేశ పరీక్షల క్యాలెండర్ విడుదల

2 లో



ఐకానిక్‌తో సమయం ఆదా



ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనలో చంద్రబాబు, ఎంపీలు, మంత్రులు, అధికారులు

- విజయవాడ-హైదరాబాద్ హైవేకి అనుసంధానం
- రూ.1,387 కోట్లతో చేపట్టే నిర్మాణానికి సీఎం శంకుస్థాపన
- కూచిపూడి ఐకానిక్ వంతెనగా నామకరణం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం వద్ద ఐకానిక్ వంతెన నిర్మాణం చేయడం ద్వారా అమరావతికి తక్కువ సమయంలో చేరవచ్చునని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిపై రూ.1,387కోట్లతో నిర్మించే ఐకానిక్ వంతెన నిర్మాణాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అమరావతి నగరానికి ఉద్దేశించి రూ.740.65కోట్లతో నిర్మించతలపెట్టిన నీటిశుద్ధి కేంద్రానికి భూమిపూజ చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఈ ఐకానిక్ వంతెనతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తామని స్పష్టం చేశారు. దీనివలన హైదరాబాద్ నుంచి అమరావతి వచ్చే వారికి రెండుగంటల సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. దీనికి కూచిపూడి ఐకానిక్ వంతెనగా నామకరణం చేశామని స్పష్టం చేశారు. వంతెన పొడవు 3.20కిలోమీటర్లని, ఆరులైన్ల వంతెనను నిర్మిస్తారన్నారు. కేబుళ్ల ఆధారంగా ఈ వంతెన నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వంతెన కింది భాగంలో జల రవాణాకు వీలుగా నిర్మాణాలు చేస్తారన్నారు. ఐకానిక్ బ్రిడ్జి భారతదేశంలోనే అతిపెద్ద పైలాన్ కలిగినదన్నారు. రాజధాని తాగునీటి అవసరాల కోసం రూ.740.65 కోట్లతో నీటి శుద్ధి కేంద్రం

- మిగతా 2 లో

ఎన్ఐఏకు జగన్ కేసుపై మోడీకి బాబు నిరసన లేఖ

11 లో

ఇదీ లోకం!



యూపీలో ఫిఫ్టీ ఫిఫ్టీ
ఎస్పీ, బీఎస్పీ చెరో 38 చోట్ల పోటీ

9 లో

పనులు పూర్తి చేయిస్తాం..

తుంగభద్ర హై లెవెల్ మెయిన్ కెనాల్ ఆధునీకరణ పనులకు సంబంధించి ఇంతవరకు జరిగిన పనులకు మాత్రమే బిల్లులు చెల్లిస్తాం. మిగిలిన పనులను కొత్త కాంట్రాక్టర్లతో చేయించటానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం అవసరమైన చర్యలు చేపట్టడానికి ఉన్నతాధికారుల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం.

– హెచ్ఎల్‌సీ ఈఈ వెంకటరమణారెడ్డి

సాగుతూ... ఉంది..!

- నత్తనడకన హెచ్‌ఎల్ఎంసీ ఆధునీకరణ
- పనులు పూర్తి అయ్యేదెన్నడో..?
- ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రూ.450 కోట్లు
- ప్యాకేజీలు ఆరు.. అన్నీ అరకొర పనులే
- వెచ్చించిన నిధులు రూ.310 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో – అనంతపురం : రాయలసీమ కరవు జిల్లాలకు సాగు, తాగు నీరందించే తుంగభద్ర హై లెవెల్ మెయిన్ కెనాల్(హెచ్ఎల్ఎంసీ) ఆధునీకరణ పనులు మూడు అడుగులు ముందుకు... ఆరడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతూనే ఉన్నాయి. పదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో కాలువ పరిధిలోని ఆయకట్టుదారులు ఏళ్ల తరబడి నష్టపోతూనే ఉన్నారు. వాస్తవానికి తుంగభద్ర హై లెవెల్ మెయిన్ కెనాల్‌ను వెడల్పు చేసి ఆధునీకరించాలని 2009లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.450 కోట్లు నిధులను కూడా విడుదల చేసింది. హెచ్ఎల్ఎంసీ పరిధిలోని 105వ కిలోమీటరు వద్ద

- మిగతా 2 లో



ఆధునీకరణ పనులు జరుగుతున్న హెచ్ఎల్ఎంసీ కాలువ

పారిస్ బేకరీలో భారీ పేలుడు..

పలువురికి గాయాలు : ధ్వంసమైన భవనం కింది అంతస్తు

పగిలిన పక్కభవనాల కిటికీలు, దెబ్బతిన్న పార్కింగ్‌లోని కార్లు

పారిస్: సెంట్రల్ పారిస్‌ని ఓ బేకరిలో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు గాయపడగా, బేకరి చుట్టుపక్కల ఉన్న భవనాల కిటికీలు ధ్వంసమయ్యాయి. గ్యాస్ లీక్ వల్ల ఈ పేలుడు జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఉదయం 9 గంటల సమయంలో నగరంలోని 9వ జిల్లాలోని రద్దీ ప్రాంతంలో ఉన్న బేకరిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ భవనం కింది అంతస్తు పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు ధాటికి పార్కింగ్‌లోని కార్లు దెబ్బతిన్నాయి. వీధి మొత్తం శిధిలాలతో నిండిపోయింది. తీవ్రంగా గాయపడిన వారిని అగ్నిమాపక దళం తరలిస్తున్న దృశ్యాలు మీడియా కంటికి చిక్కాయి. నిచ్చెనల సహాయంతో భవనంపైకి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించడం పాటు లోపల చిక్కుకున్న వారిని రక్షించారు. గాయపడిన వారికి ఎమర్జెన్సీ సిబ్బంది అక్కడికక్కడే చికిత్స అందించారు.





2020లో అధ్యక్ష పదవికి పోటీ చేస్తా

వచ్చే వారంలో అధికారిక ప్రకటన : తులసి గబ్బార్డ్

వాషింగ్టన్ : 2020లో అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తానంటూ అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి హిందూ మహిళ, డెమోక్రటిక్ పార్టీ నాయకులు తులసి గబ్బార్డ్ (37) వెల్లడించారు. తన అభ్యర్థిత్వంపై వచ్చే వారంలో అధికారికంగా ప్రకటన ఉంటుందని తెలిపారు. సెనేటర్ ఎలిజబెత్ వార్నర్ తర్వాత డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష రేసులో పాల్గొనే రెండవ మహిళగా తులసి నిలవనున్నారు. భారత సంతతి సెనేటర్ కమలాహారిస్‌తో పాటు 12 మందికిపైగా డెమోక్రటిక్ పార్టీ నేతలు 2020లో రిపబ్లికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు త్వరలోనే ప్రకటన వెలువడనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. హవాయి నుంచి నాలుగుసార్లు డెమోక్రటిక్ పార్టీ తరపున అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికైన తులసి మాట్లాడుతూ 'అధ్యక్ష రేసులో పాల్గొనాలని నిర్ణయించుకున్నాను. ఇదే విషయాన్ని వచ్చే వారంలో అధికారికంగా ప్రకటిస్తాను' అని తెలిపారు. అమెరికన్లకు సేవచేసే ఉద్దేశంతోనే పోటీచేస్తున్నట్టు ఆమె చెప్పారు. 'అధ్యక్షురాలిగా దేశప్రజలకు హెల్త్‌కార్డులు ఇస్తాను. సమగ్ర ఇమిగ్రేషన్ సంస్కరణలు చేపడతాను. భవిష్యత్ తరాలు ఆరోగ్యవంతంగా ఉండేలా పరిశుద్ధమైన తాగునీరు, పీల్చే వాయువులు అందేలా చర్యలు తీసుకుంటాను. ఆరోగ్య పథకాలను ప్రవేశపెడతాను. అస్తవ్యస్తంగా ఉన్న క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌ను సరిదిద్దుతాను. అవినీతిపై ఉక్కుపాదం మోపుతాను.. ఇంకా చాలా చేస్తాను' అని తులసి తన మద్దతుదారులకు రాసిన ఈమెయిల్‌లో పేర్కొన్నారు.



యుద్ధాలు లేని శాంతియుత సమాజ స్థాపనే తన ప్రధాన లక్ష్యంగా తెలిపారు. దేశంలో శాంతిని, ప్రేమాభిమానాలను పెంపొందించడం కోసం చేయగలిగినంతా చేస్తానని హామీనిచ్చారు. తన ప్రచారానికి కలిసిరావాలంటూ సహచరులకు ట్విట్టర్ ద్వారా పిలుపిచ్చారు. ఐక్యంగా ఉంటే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవచ్చని.. ఇందుకోసం మీరు నా వెంట ఉంటారా? అంటూ ట్వీట్ చేశారు. కాగా, అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే ఈ పదవి దక్కించుకున్న తొలి మహిళగా, అత్యంత పిన్న వయస్కురాలిగా తులసి గబ్బార్డ్ గుర్తింపు పొందుతారు. ఇదిలావుండగా, అధ్యక్ష పదవికి 2020, ఫిబ్రవరి 3న లోవా కౌకుసెస్ నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 11న న్యూహ్యాంప్‌షైర్ ప్రైమరీ, ఫిబ్రవరి 15, 22 తేదీల్లో నవేడా కౌకస్, సౌత్ కారోలినాలో ఎన్నికలు ఉంటాయి. 2020 అధ్యక్ష ఎన్నికలపై ఆసక్తిగా ఉన్న డెమోక్రాట్లలో సెనేటర్లు క్రిస్టిన్ గిల్లీబ్రాండ్, అమీ క్లోబుచర్, టిమ్ కైనె ఉన్నారు.

ట్రంప్‌కు అమెరికా-భారత్ సంబంధాలు ముఖ్యం

నూతన దౌత్యాధికారి హర్షవర్ధన్ ష్రింగ్లా

వాషింగ్టన్ : భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక ప్రాధాన్యత ఇస్తారని అమెరికాకు భారత నూతన దౌత్యాధికారి హర్షవర్ధన్ ష్రింగ్లా తెలిపారు. 1984 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్ అధికారి అయిన ష్రింగ్లా దౌత్యాధికారిగా తన నియామకానికి సంబంధించిన అర్హత పత్రాలను శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీసులో అధ్యక్షుడికి సమర్పించారు. డిసెంబరు 31తో నవతేజ్ శర్న పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ష్రింగ్లా నియామకం పొందారు. అమెరికాకు భారత దౌత్యాధికారిగా ఎంపికైన అతి పిన్నవయస్కుడిగా నిలిచారు. వాషింగ్టన్‌కు చేరుకున్న 50 గంటల్లోపే ష్రింగ్లా తన అర్హత పత్రాలను ట్రంప్‌కు సమర్పించారు. ఇంత వేగంగా ఏదేని దేశ రాయబారి తన అర్హతపత్రాలను సమర్పించడం అమెరికా రాజధానిలో అరుదైన విషయం. కాగా, అనంతరం జరిగిన వేడుకల్లో భారత దౌత్యకార్యాలయం, స్టేట్ డిపార్ట్‌మెంట్, శ్వేతసౌధం సీనియర్ అధికారులతో ష్రింగ్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ట్రంప్ అధిక ప్రాధాన్యతను ఇస్తారని అన్నారు. భారత్, అమెరికా మధ్య సహకారాన్ని ట్రంప్ కోరుకుంటున్నారని, ద్వైపాక్షిక స్థాయిలోనే కాకుండా వ్యూహాత్మక భాగస్వాములుగా ప్రాంతీయ, ప్రపంచవ్యాప్తంగా.. ముఖ్యంగా ఇండో-పసిఫిక్ నేతల విజన్‌పై పనిచేయాలని ఆకాంక్షిస్తున్నారని ష్రింగ్లా తెలిపారు. కొన్నేళ్లుగా అమెరికా-భారత్ మధ్య సంబంధాలలో జరిగిన పురోగతిని మెచ్చుకుంటూ ఇది అద్వితీయమైనదన్నారు. వాణిజ్య, రక్షణ, ఇంధనం, శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం రంగాలతో పాటు ప్రపంచ దేశాల సమస్యలు, సంబంధిత అంశాలపై ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంపొందించేందుకు కృషిచేస్తానంటూ హామీనిచ్చారు. ష్రింగ్లా గత వారం వరకు బంగ్లాదేశ్‌కు భారత హైకమిషనర్‌గా ఉన్నారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్‌సర్ కాలేజిలో గ్రాడ్యుయేషన్ చేసిన ఆయన ఇంగ్లీషు సహా పలు భారతీయ భాషలతో పాటు ఫ్రెంచ్, వియత్నామీస్, నేపాలీలోనూ మాట్లాడగలరు. తన 35ఏళ్ల దౌత్యపరమైన కెరీర్‌లో న్యూఢిల్లీలోనే కాకుండా విదేశాల్లోనూ అనేక పదవులలో పనిచేశారు. థాయిలాండ్‌కు భారత దౌత్యాధికారిగానూ వ్యవహరించారు.




జైల్లో క్షీణించిన షరీఫ్ ఆరోగ్యం..

వైద్యులకు అనుమతి నిరాకరణ

మరియం నవాజ్ ఆందోళన

లాహోర్: పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆరోగ్యపరిస్థితిపై ఆయన కుమార్తె మరియం నవాజ్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. జైల్లో ఉన్న తండ్రి ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ఆయన వైద్యులను అధికారులు అనుమతించడం లేదని ఆమె తెలిపారు. లాహోర్‌లోని కోట్ లఖ్‌పట్ జైల్లో ఏడేళ్ల శిక్షను నవాజ్ షరీఫ్ అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. అల్-అజీజియా స్టీల్ మిల్స్‌కు సంబంధించిన అవినీతి వ్యవహారంలో ఆయనకు శిక్ష పడింది. షరీఫ్ చేయినొప్పితో బాధపడుతున్నారని, అది ఎంజినా కావచ్చునని మరియం పేర్కొన్నారు. ఈ విషయంలో జైలు అధికార ప్రతినిధి స్పందిస్తూ 'నవాజ్ షరీఫ్ ఆరోగ్యం బాగానే ఉంది. జైలు డాక్టర్లు ఆయనను పరీక్షించారు. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని తేల్చారు' అని తెలిపారు. అయితే ట్విట్టర్ ద్వారా తన తండ్రి ఆరోగ్యంపై మరియం స్పందించారు. 'షరీఫ్ కార్డియాలజిస్టులు జైల్లో ఉన్న ఆయనను కలిసేందుకు రోజు మొత్తం ప్రయత్నించినా అనుమతి లభించలేదు. 'షరీఫ్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలిసిన ఈ వైద్యులు ఆయనకు ప్రత్యేక చికిత్స అందిస్తారు. ప్రస్తుతం ఆయనకది అవసరం' అంటూ ఆమె ట్వీట్ చేశారు. షరీఫ్ ఆరోగ్యంపై ఆయన సోదరుడు, పీఎం ఎల్-ఎన్ పార్టీ అధ్యక్షుడు షాబాజ్ షరీఫ్ ఘాటుగా స్పందించారు. తన సోదరుడికి జరగరానిదేమైన జరిగితే అందుకు ప్రధాని ఇమ్రాన్, పంజాబ్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. షరీఫ్ కార్డియాలజిస్టులకు ఆయనను పరీక్షించేందుకు, అవసరమైన చికిత్సను అందజేసేందుకు అనుమతిని ఇవ్వాలంటూ షాబాజ్ డిమాండు చేశారు. నవాజ్ షరీఫ్ (69)కు మూడేళ్ల క్రితం లండన్‌లో ఓపెన్ హార్ట్ శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. అవినీతి సొమ్ముతో అల్-అజీజియా స్టీల్ మిల్స్‌ను సౌదీ అరేబియాలో నెలకొల్పారన్న కేసులో పాకిస్థాన్‌లోని అవినీతి నిరోధక కోర్టు డిసెంబరు 24న షరీఫ్‌కు ఏడేళ్ల జైలుశిక్షను విధించిన విషయం విదితమే.



మూడేళ్లలో కెనడాకు పదిలక్షల మంది ఇమిగ్రెంట్లు

కెనడా : వచ్చే మూడేళ్లలో కెనడాలో పది లక్షల మందికిపైగా దేశ శాశ్వత పౌరులుగా తమ జనాభాలో చేరబోతున్నారని కెనడా పార్లమెంటు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందుతున్నట్టు తెలిపింది. 2017లో 2,86,000 మంది వలసదారులకు శాశ్వత పౌరసత్వాన్ని కల్పించగా ఈ ఏడాది వారి సంఖ్య 3,50,000కు చేరుకోనున్నట్టు వెల్లడించింది. 'కొత్తవారికి కెనడా ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుంది.

ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన వారికి కృతజ్ఞతలు. కెనడా ఓ బలమైన, ఉత్తేజభరిత దేశంగా అభివృద్ధి చెందింది.. దీనిని మనమంతా ఆస్వాదిద్దాం' అంటూ కెనడా ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్, సిటిజన్‌షిప్ (ఐఆర్‌సీసీ) మంత్రి అహ్మద్ హుస్సేన్ అన్నారు. హుస్సేన్ కూడా సోమాలియా నుంచి కెనడాకు వలస వచ్చిన వారే. కాగా, కెనడాలో జనన నిష్పత్తి తగ్గుతుండటం, వృద్ధుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో కొత్తవారి రాక దేశానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. అమెరికాతో పాటు పలు పాశ్చాత్య దేశాలు తమ ఇమిగ్రేషన్ విధానాలను కఠినతరం చేస్తున్న క్రమంలో శరణార్థులకు కెనడా స్నేహపూర్వక ఆహ్వానం అందరి మన్ననలు పొందుతోంది. శరణార్థులకు రక్షణ విషయంలో కెనడా నిబద్ధతతో వ్యవహరిస్తోంది. కెనడా ఇప్పటికే గ్లోబల్ రీసెటిల్‌మెంట్ ఇనిషియేటివ్‌కు 5.6మిలియన్ డాలర్ల వితరణను ప్రకటించింది.

పేరు మార్చుకోనున్న మసెడోనియా

రాజ్యాంగ సవరణకు పార్లమెంటు ఆమోదం



గ్రీస్ : దేశానికి 'రిపబ్లిక్ ఆఫ్ నార్తెన్ మసెడొనియా'గా నామకరణం చేసే విధంగా రాజ్యాంగాన్ని సవరించేందుకు మసెడోనియా పార్లమెంటు అంగీకారం తెలిపింది. ఈ మేరకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టగా ప్రధాని జోరన్ జయావ్ పార్టీకి మెజారిటీ దక్కింది. దీంతో దేశ పేరు మార్పుకు పార్లమెంటు ఆమోదం లభించినట్లు అయింది. పార్లమెంటు స్పీకర్ తలద్ జాఫెరీ మాట్లాడుతూ మొత్తం 120 స్థానాలు గల చాంబర్‌లో దేశ పేరుమార్పునకు అనుకూలంగా 81 మంది ఎంపీలు ఓటు వేశారన్నారు.

స్పెషల్ దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

వెయిటింగ్ లిస్ట్ కొనసాగుతోంది. ఏసీ బస్సుల్లో మాత్రం ఒకటీ అరా టికెట్లు లభ్యమవుతున్నాయి. ప్రైవేటు కళాశాలలకు శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో పండిట్‌నెహ్రూ బస్టేషన్, రైల్వేస్టేషన్ కిటకిటలాడాయి. రద్దీని ఆసరాగా చేసుకుని ప్రైవేటు బస్సుల్లో చార్జీలు విపరీతంగా పెంచేయడంతో దోపిడీ పరాకాష్టకు చేరిందని చెప్పవచ్చు. ముఖ్యంగా హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు వంటి నగరాల నుంచి విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, భీమవరం, కడప, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు వంటి ఊళ్లకు వచ్చే అన్ని రకాల బస్సులకు డిమాండు ఏర్పడింది. తెలంగాణ ఆర్టీసీ అయితే జంట నగరాల్లో నడిపే మెట్రో డీలక్స్ బస్సులను సైతం స్పెషల్ పేరుతో విజయవాడ సహా పలు దూర ప్రాంతాలకు నడుపుతూ టికెట్ చార్జీపై అదనంగా 50 శాతం వసూలు చేస్తోంది. ఏపీఎస్‌ఆర్టీసీ రోజువారీ నడిచే అమరావతి, గరుడ, గరుడ ప్లస్, వెన్నెల వంటి బస్సులు కాకుండా సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, మెట్రో డీలక్స్ బస్సులను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 2వేలకు పైగా ప్రత్యేక బస్సులుగా నడుపుతోంది. ప్రైవేటు ఆపరేటర్లు సూపర్ లగ్జరీ, స్లీపర్, సీటర్ కం స్లీపర్, వోల్వో, స్కానియా తదితర బస్సులను ఏసీ, నాన్- ఏసీ కేటగిరిలలో నిర్వహిస్తూ ప్రయాణీకుల జేబులను కొల్లగొడుతున్నారు. పగటి వేళల్లో బయలుదేరే బస్సుల టికెట్ చార్జీలు తక్కువగానూ, సాయంత్రం, రాత్రి వేళల్లో బయలుదేరే బస్సుల చార్జీలు ఎక్కువగా ఉంటున్నాయి. రెడ్‌బస్, అభిబస్ వంటి మొబైల్ యాప్‌ల ద్వారా టికెట్లు బుక్ చేద్దాంటే ఖాళీ లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు బస్సులను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణీకులు చెబుతున్నారు.

'ప్రైవేటు' చార్జీలు రెండింతల పైనే...

సాధారణంగా తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ. 317, గరుడ ప్లస్ రూ. 497, అమరావతి రూ.544, వెన్నెల స్లీపర్ చార్జీ రూ. 724 కాస్త అటూ, ఇటూగా చార్జీలున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో చార్జీలతోపాటు సర్వీసు చార్జీ, టోల్ చార్జీ, రిజర్వేషన్ చార్జీ, లెవీ చార్జీల పేరుతో అదనంగా రూ. 50 వరకూ వసూలు చేస్తున్నారు. టీఎస్‌ఆర్టీసీ రాజధాని ఏసీ సెమీ స్లీపర్‌లో విజయవాడకు చార్జి రూ. 400లు, మెట్రో డీలక్స్ చార్జి రూ. 365 ఉంది. పండుగ సందర్భంగా అదనంగా 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారు. టీఎస్‌ఆర్టీసీకి చెందిన స్పెషల్ కేటగిరిలో సూపర్ లగ్జరీ బస్సుకు హైదరాబాద్ నుంచి విజయవాడ చార్జీ రూ. 575 ఉంటే ప్రైవేటు బస్సులో ఇదే కేటగిరిలో రూ. 950 నుంచి రూ. 1100 వరకు వసూలు చేస్తున్నారు.

స్కానియా సెమీ స్లీపర్ కేటగిరిలో రూ. 1200 నుంచి రూ. 1400 వరకూ, స్లీపర్ కేటగిరిలో రూ. 1600 మొదలుకుని రూ. 3,500 వరకూ ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. బెంగళూరు-విజయవాడ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు టికెట్ చార్జీ రూ. 791, గరుడ ఏసీ బస్సు చార్జీ రూ. 1,176, నాన్ ఏసీ (స్పెషల్) చార్జి రూ. 1,187గా ఉంది. ప్రైవేటు బస్సుల్లో ఏసీ స్లీపర్ చార్జీ రూ. 2,190 మొదలుకుని గరిష్ఠంగా రూ. 3,500 వరకూ వసూలుచేస్తున్నారు. వోల్వో సెమీ స్లీపర్ కేటగిరిలో రూ. 2,500, సూపర్ లగ్జరీ కేటగిరిలో రూ. 1,350 నుంచి రూ. 1,500 వరకూ విక్రయిస్తున్నారు. బస్సు గమ్యానికి చేరుకునే సమయాన్ని బట్టి చార్జీల్లో మార్పులు ఉన్నట్లు ప్రయాణీకులు చెబుతున్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ. 430 నుంచి రూ. 516, అమరావతి బస్సు చార్జీ రూ. 737, గరుడ బస్సు చార్జీ రూ. 695గా ఉన్నాయి. ప్రత్యేక బస్సుల్లో వీటిపై అదనంగా 50 శాతం ధరను చెల్లించాల్సి ఉంది. ప్రైవేటు ఆపరేటర్లు సూపర్ లగ్జరీ కేటగిరిలో రూ. 1500 నుంచి రూ. 1700 వరకూ, ఏసీ స్లీపర్ కేటగిరిలో రూ. 2,000 నుంచి రూ. 2,300 వరకూ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సాగుతూ...ఉంది..!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 189వ కిలోమీటరు (లింక్ చానల్) వరకు మొత్తం 84 కిలోమీటర్ల మేర కాలువను వెడల్పు చేసి కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 4,500 క్యూసెక్కుల మేర పెంచాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు డిజైన్లు రూపొందించి హెచ్‌ఎల్‌ఎంసీ ఆధునీకరణ పనులను ఆరు ప్యాకేజీలుగా విడగొట్టి, టెండర్లు పిలిచి పనులు కూడా ప్రారంభింపచేసింది.

2009లో సుమారు రూ.450 కోట్లతో ప్రారంభించిన హెచ్‌ఎల్‌ఎంసీ ఆధునీకరణ పనులను కాంట్రాక్టు సంస్థ ఇప్పటికీ చేస్తూనే ఉంది. ఇంతవరకు రూ.310 కోట్ల మేర పనులను మాత్రమే పూర్తి చేసింది. ఇంకా రూ.140 కోట్ల మేర పనులు చేయాల్సి ఉంది. వాస్తవానికి కాలువ ఆధునీకరణ పనుల టెండరును దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం, నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్ల పనులు ముందుకు సాగడం లేదన్న విమర్శ రైతుల నుంచి, ప్రజాసంఘాల నుంచి ఎదురవుతోంది. కోట్లాది రూపాయలను తుంగభద్ర హై లెవెల్ మెయిన్ కెనాల్ ఆధునీకరణ కోసం వెచ్చించినా ఆయకట్టు రైతులకు మాత్రం కడగండ్లు తప్పడం లేదు. తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ (హెచ్‌ఎల్‌ఎంసీ)కు ఏటా గండ్లు పడుతూనే ఉన్నాయి. తద్వారా వేలాది క్యూసెక్కుల నీరు వృధా అవుతోంది. పంటలకు అందకుండా పోతోంది. ఆయా గండ్లను పూడ్చడానికి ఇరిగేషన్ శాఖ లక్షలాది రూపాయలతో ఎస్టిమేట్లు తయారు చేస్తుండడం, ఆధునీకరణ పనుల చేస్తున్న కాంట్రాక్టర్లు గండ్లను పూడ్చే పనులను నెత్తికెత్తుకుంటూ అసలైన ఆధునీకరణ పనులను పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. దీంతో పనులన్నీ నత్త నడకతో పోటీ పడుతున్నాయి.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే తీవ్ర ఆలస్యం

తుంగభద్ర హై లెవెల్ మెయిన్ కెనాల్ ఆధునీకరణ పనుల్లో పూర్తి జాప్యం జరిగింది. 2009 పనులకు సంబంధించి టెండర్లు పిలిచినప్పుడు కాంట్రాక్టర్లు మొత్తం పనులను 57 నెలల గడువులోగా పూర్తి చేస్తామని ప్రభుత్వంతో అగ్రిమెంటు కుదుర్చుకున్నారు. అనంతరం పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఏడాదికేడాది కాలయాపన చేస్తూ పనులు నిదానంగా చేస్తూ పబ్బం గడుపుకున్నారు. సిమెంటు, స్టీలు, లేబర్ ధరలు పెరిగాయని, పనులు చేస్తే తమకు గిట్టుబాటు కాదని ప్రభుత్వం వద్దకు వెళ్లి పనులు చేయడానికి సమయం పెంచుకుంటూ వెళ్లారు. పెరిగిన ధరలను రాబట్టుకోవడానికి కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలు వేస్తూ వచ్చారు. ప్రభుత్వం కూడా పెరిగిన ఇనుము, స్టీలు, కూలీల ధరలు చెల్లించడానికి సంసిద్ధత వ్యక్తం చేసినా మరో మూడేళ్లపాటు కాలయాపన చేస్తూ వచ్చారు. పైగా అరకొర పనులు మాత్రమే చేస్తూ వచ్చిన కాంట్రాక్టర్లు పరోక్షంగా ఏటా కాలువకు గండ్లు పడే స్థితికి వచ్చేలా చేశారు. ఈ పదేళ్ల కాలంలో ఇప్పటి వరకు 75 శాతం పనులే జరిగాయి. ఆరు ప్యాకేజీలు విడగొట్టి చేపట్టిన ఆధునీకరణ పనుల్లో ఏ ప్యాకేజీలో కూడా పనులు పూర్తి కాలేదు. అన్ని చోట్లా అరకొరగానే జరిగాయి. ఏటా కాలువకు నీరు బంద్ అయిన వెంటనే పనులు చేపట్టకుండా ఏప్రిల్, మే మాసాల్లో ఏదో ఒక ప్యాకేజీలో చేపట్టి తూ తూ మంత్రంగా పనులు చేసి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. వివిధ ప్యాకేజీల్లోని ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న ఉప కాలువల పనులు కూడా పూర్తి కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.

కొరవడిన నాణ్యత

తుంగభద్ర హై లెవెల్ మెయిన్ కెనాల్ ఆధునీకరణ పనుల పర్యవేక్షణ విషయంలో ఇంజనీర్లు విఫలం కావడంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించాయి. కాలువ లైనింగ్ పనులు చేసే సమయంలో గట్టును సీఎన్‌ఎస్ మట్టితో పటిష్ట పర్చాలి. అయితే కాలువ గట్టు వెడల్పు చేసే సమయంలో గట్టుకే ఉన్న మట్టిని వేసి దానిపై రోలర్‌తో తిప్పి కాంపాషన్ ప్రమాణాల మేరకు లేకపోయినా వెంటనే కాలువకు లైనింగ్ వేశారు. దీంతో కాలువ గట్లు బలహీన పడి చాలా చోట్ల పగుళ్లు వచ్చాయి. ఈ సమయంలో ఇంజనీర్ల కొరత వల్లనే పర్యవేక్షణ లోపించిందని, అందువల్లే పగుళ్లు ఏర్పడ్డాయని ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు తమ తప్పును కప్పిపుచ్చుకునే యత్నం చేస్తుండడం ఇక్కడ గమనార్హం.

మోడీ అబద్ధాల పుట్ట

(మొదటిపేజీ తరువాయి)

నల్లధనం తెల్లగా మారిపోయిందని అన్నారు. జీఎస్టీ పేరుతో ఆడిన నాటకం బూమ్‌రాంగ్ అయిందని, ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఘోర వైఫల్యం తర్వాత మోడీకి జ్ఞానోదయమైందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీ అమలు కాలేదని నారాయణ ఆరోపించారు. 40 వేల మందికి ఉద్యోగాలిచ్చి, మూడు లక్షల మందిని వీధుల పాలు చేశారని గుర్తుచేశారు. అవినీతి రహిత ప్రభుత్వమని పదే పదే చెబుతున్న కేంద్రం...రాఫెల్ కుంభ కోణంలో కూరుకుపోయిందని, చివరకు ఆ కూపం నుంచి బయటపడటానికి సీబీఐని సైతం ఉపయోగించుకోవడానికి వెనుకాడలేదని అన్నారు. అందులో భాగమే అలోక్‌వర్మకు ఉద్వాసనని ఆయన వివరించారు. రాఫెల్ ఒప్పందంలో దళారులు లేనట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని, ప్రధాన మంత్రే దళారి అయినప్పుడు మధ్యవర్తులతో పనేముం దని నారాయణ ప్రశ్నించారు. అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్‌లు ఇచ్చామని చెప్పుకుంటున్న మోడీ...33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు పెండింగ్‌లో పెట్టారని సూటిగా ప్రశ్నించారు. పౌరసత్వ గుర్తింపు అంశంలో స్వయాన ప్రభుత్వమే మత విభజనకు పూనుకుం దన్నారు. ఎన్నికలకు ముందే అయోధ్యలో రామాలయం కట్టి తీరతామని అమిత్‌షా ప్రకటించడం, బాబ్రీ మసీదు కూల్చివేతపై ఈనెల్లో జరిగే విచారణను ప్రభావితం చేయడానికేనని విమర్శించారు. మోడీ, అమిత్‌షాల కుప్పిగంతులు, అబద్ధాలు గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కే అవకాశం ఉందన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం నానాతంటాలు పడుతున్నారని విమర్శించారు.

సమయం ఆదా

(మొదటిపేజీ తరువాయి)

నిర్మిస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సురక్షితమైన నీటిని రాజధాని వాసులకు అందజేస్తామని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో రూ.40వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాజధానిలో సకల వసతులు కల్పించడానికి కృషిచేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా వినూత్నంగా ఆలోచించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కూచిపూడి నాట్యం వారసత్వ సంపదగా వస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో కూచిపూడి నాట్యం ప్రతిబింబించే విధంగా వంతెన నిర్మాణం సాగుతుందన్నారు. హిందువులకు ఎంతో పవిత్రమైన వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని రాజధాని అమరావతిలో నిర్మిస్తున్నామని చెప్పారు. మసీదు, చర్చి నిర్మాణాలూ చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సేద్యానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరులక్షలమంది రైతులు ప్రకృతి సేద్యాన్ని చేస్తున్నారని వెల్లడించారు. రాజధాని అమరావతిని కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రికల్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ఐకానిక్ వంతెన, నీటిశుద్ధి కేంద్రాలను ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ సంస్థలు నిర్మాణాలు చేస్తున్నాయని వెల్లడించారు. వీటి నిర్మాణాలను 12నెలల నుంచి 15నెలలలోపు పూర్తి చేస్తాయని సీఎం వెల్లడించారు. అమరావతిని ప్రపంచంలోనే ఉన్నతశ్రేణి రాజధానిల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే అమరావతిలో ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు గృహ సముదాయాల నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. ఇతర అన్ని మౌలికవసతులను కల్పిస్తున్నామని చెప్పారు. కృష్ణానదీ తీరప్రాంతాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, క్రీడా న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీలు కేశినేని శ్రీనివాస్(నాని), గల్లా జయదేవ్, ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, బోండా ఉమా, జడ్పీచైర్‌పర్సన్ గద్దె అనురాధ, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 20 నుంచి ఏపీ ఎంసెట్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలో ఏప్రిల్ 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు ఏపీ ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో పరీక్షలు జరుగుతాయని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయవాడ డీవీ మ్యానర్‌లో శనివారం ఆయన 2019వ సంవత్సరం ప్రవేశ పరీక్షల క్యాలెండర్‌ను విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 24న ఎంసెట్ అగ్రికల్చర్ విభాగంలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఎంసెట్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. కన్వీనర్‌గా జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ సాయిబాబా వ్యవహరిస్తారని చెప్పారు. ఏపీ ఈసెట్ పరీక్షలు ఏప్రిల్ 19న జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ప్రొఫెసర్ భానుమూర్తి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఏపీ ఐసెట్ పరీక్షలు ఏప్రిల్ 26న జరుగుతాయన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. దీనికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డిని నియమించారు. అలాగే ఏపీ పీజీ సెట్‌ను మే ఒకటో తేదీన నిర్వహిస్తామని, కన్వీనర్‌గా ప్రొఫెసర్ అవధాని వ్యవహరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మే 6న ఏపీ ఈడీసెట్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కన్వీనర్‌గా ప్రొఫెసర్ కుమారస్వామి వ్యవహరిస్తారన్నారు. మే 6న మరో పరీక్ష ఏపీ లాసెట్ కూడా జరుగుతుందన్నారు. కన్వీనర్‌గా ప్రొఫెసర్ విజయకుమార్ వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. మే 8 నుంచి మే 15వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీపీ సెట్‌ను నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. కన్వీనర్‌గా ప్రొఫెసర్ పాల్‌కుమార్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని వివరాలతో కూడిన యాప్‌ను రూపొందించామని, ఏపీ సెట్స్ నేస్తం ద్వారా వివరాలను తెలుసుకోవచ్చునని అన్నారు. 2014లో ఎంసెట్ నిర్వహణ సరైన విధానంలో లేనందున రాష్ట్ర విద్యార్థులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిపోయే పరిస్థితి నెలకొందన్నారు. వీటన్నింటినీ గుర్తించి విద్యార్థులు గందరగోళానికి గురి కాకుండా సెట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 21న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలతో విజయవాడలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ విజయకుమార్‌రాజు, వైస్ చైర్మన్‌లు ప్రొఫెసర్ కుటుంబరావు, ప్రొఫెసర్ నరసింహారావు, సెక్రటరీ ప్రొఫెసర్ వరదరాజన్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ప్రచారం : ఈటీ నర్సింహ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:

ప్రజాసమస్యలపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఈటీ నర్సింహ వెల్లడించారు. బాగ్ లింగంపల్లితోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన ముషీరాబాద్ నియోజకవర్గ సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాలుగేళ్లలో కేసీఆర్ ప్రజలకిచ్చిన ఏ వాగ్దానాన్ని నెరవేర్చలేదని, డబ్బుతో ప్రజలను మభ్యపెట్టి మరోసారి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఈ సారి కూడా హామీలను నెరవేరుస్తాడన్న నమ్మకం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రజలకు కనీస సౌకర్యాలతో పాటు విద్య, వైద్యం, సామాజిక భద్రత అందనంత దూరంలో ఉన్నాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలనే ఆయుధంగా మార్చుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో మరింత ఉధృతంగా జీహెచ్‌ఎంసీ, స్థానిక ఎమ్మార్వో కార్యాలయాల ముందు ఆందోళనలు నిర్వహించాలని ఈటీ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.గెల్వయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాకేష్ సింగ్, నాయకులు పి.సురేందర్, అశోక్, అసద్, మీర్జా ఆరిఫ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో టీఆర్ఎస్ ఎన్నారై పాలసీ : కవిత

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ భవన్‌లో ఎన్నారై టీఆర్ఎస్ యూకే సెల్ 8వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ కవిత, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, బేవరేజస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, యూకే సెల్ అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం పాల్గొన్నారు. కవిత మాట్లాడుతూ రానున్న రోజుల్లో 100 దేశాల్లో శాఖలు ఏర్పాటు చేస్తామని, తెలంగాణ ఉద్యమం సమయంలో సోషల్ మీడియా కేంద్రంగా ఎన్ఆర్ఐలు అనేక అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. మన పారిశ్రామిక విధానాన్ని చూసి అమెరికాలో కూడా ఇంతమంచి విధానం లేదని అక్కడి వారు అంటున్నారని కవిత తెలిపారు. తెలంగాణప్రభుత్వ పనితీరు, అభివృద్ధి చెందుతున్న విధానం చూసి మీరు గర్వపడేలా చేస్తామన్నారు. ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం రూ.100 కోట్లు ఇప్పటికే మంజూరయ్యాయని, గల్ఫ్ దేశాల్లోనికి వారికి సహకారం చేసేలా ఉంటాయన్నారు. విదేశాల్లోని తెలంగాణ బిడ్డలు గర్వించేలా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఎన్నారై పాలసీలపై కేటీఆర్ పని చేస్తున్నారని వెల్లడించారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే..

- నవరత్నాలతో రాష్ట్రం సుభిక్షం
- ఇడుపులపాయలో జగన్మోహన్ రెడ్డి



విశాలాంధ్ర-వేంపల్లె: ' సీఎం చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే.. పింఛన్ల పెంపు నిర్ణయం ఎన్నికల స్టంటే.. ఆయన ప్రకటించిన రుణమాఫీ ఇంత వరకు పూర్తిస్థాయిలో జరగలేదు' అంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన కడప జిల్లాలోని ఇడుపులపాయ వైఎస్సార్ ఎస్టేట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆశీస్సులు, దైవసంకల్పంతో పాదయాత్రను పూర్తిచేశానన్నారు. తాను ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. ఈసారి వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్న దీమాను జగన్ వ్యక్తంచేశారు. ఎన్నికల మేనిఫెస్టో ద్వారా అందరికీ సమన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసుకున్న జగన్ శనివారం పులివెందుల పర్యటన అనంతరం ఇడుపులపాయకు చేరుకుని, తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. రుణమాఫీ, పింఛన్ పెంపు అన్ని ఎన్నికల దృష్ట్యా తీసుకున్న నిర్ణయాలే నన్నారు. రాష్ట్ర ప్రజలు ఏ మాత్రం ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఈసారి వైసీపీ అధి కారంలోకి వస్తుందని, భవిష్యత్తులో అంతా మంచే జరుగుతుందని, ప్రజల ఆకాంక్షలు నెరవేరతా యని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు అవినాష్‌రెడ్డి, మిథున్ రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మె ల్యేలు రఘురామ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్ర నాథ్‌రెడ్డి, రోజా, కొరముట్ల శ్రీనివాసులు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ జిల్లా అకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్, మండల కన్వీనరు చంద్ర ఓబుల రెడ్డి, ఎంపీపీ రవికుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ షబ్బీర్‌వలి పాల్గొన్నారు.

సంక్రాంతికి సొంతూళ్లకు..

- కిక్కిరిసిన బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు
- సరిపడా బస్సుల్లేక ప్రయాణికులకు ఇబ్బందులు
- ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల బాదుడు
- ఆర్టీసీలోనూ 50 శాతం అదనం
- టోల్‌గేట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు





కిటకిటలాడుతున్న రైళ్లు, బస్సులు

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ :
తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలోని బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో సంక్రాంతి రద్దీ మొదలైంది. వరుస సెలవులతో సొంతూళ్లకు వెళ్లేందుకు సరిపడినన్ని బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు ఇసుకవేస్తే రాలనంత జనంతో నిండిపోయాయి. స్వస్థలాలకు వెళుతున్న వారితో సంద డిగా మారాయి. వరుసగా సెలవులు రావడం, సంక్రాంతి అతిపెద్ద పండుగ కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి ప్రధానంగా హైదరాబాద్ నగరం నుండి కోస్తాంధ్రకు వెళుతున్న వారి సంఖ్య విపరీతంగా ఉంది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను, రైల్వేలు ప్రత్యేక రైళ్లను వేసినప్పటికీ అవి ఏమాత్రం చాలడం లేదు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను రెండు తెలుగు రాష్ట్రాలకు వేసింది. హైదరాబాద్ నుంచి విజయవాడ, గుంటూరు, విశాఖ, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ, కర్నూలు తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు వేసింది. ఎన్ని ప్రత్యేక బస్సులు, ఎన్ని ప్రత్యేక రైళ్లు వేసినా అవి ప్రయాణికుల రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. ఇదే అదునుగా చూసుకొని ఇష్టారాజ్యంగా టికెట్ ధరలను పెంచేసి ప్రైవేట్ బస్ ఆపరేటర్లు ప్రయాణీకులను దోచుకుంటున్నారు. రెండు, మూడు రెట్లకు పైగా ధరలను పెంచారు. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనపు చార్జీలను ముక్కుపిండి వసూలు చేస్తోంది. అటు ప్రైవేటు, ఇటు ఆర్టీసీ చార్జీలతో ప్రయాణమంటేనే జేబుకు చిల్లులు పడుతోంది. బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో టికెట్ల కోసం భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. గంటల తరబడి బస్ స్టాండ్లలో నిరీక్షిస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఏ బస్సు ఎప్పుడు వస్తుందో అధికారులు చెప్పలేని పరిస్థితి. టికెట్ల కోసం ప్రయాణీకులు ఇక్కట్లు పడుతున్నారు. ఇక రైళ్ల పరిస్థితి అలాగే ఉంది. రైళ్లలో బోగీలన్నీ కిక్కిరిసిపోవడంతో ఊపిరాడని పరిస్థితి ఏర్పడుతోంది. బోగిలోకి ఎక్కడమే అతికష్టంగా మారింది. తీవ్ర తోపులాట జరుగుతోంది. ఒకసారి లోనికి ప్రవేశించిన అనంతరం ఇక కదలడానికి కూడా వీలులేని పరిస్థితి. వృద్ధులు, పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌బోర్డ్ ప్రయాణం కూడా తప్పడం లేదు. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణీకుల టికెట్లు కన్‌ఫర్మ్ కావడం లేదు. మంత్రులు, వీఐపీలు జారీ చేసే ఈక్యూ సిఫార్సు లేఖలకు కూడా దిక్కులేకుండా పోతోంది. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు రైళ్లల్లో కూడా టికెట్ దొరకని ప్రయాణీకులు అప్పో సొప్పో చేసి ట్రావెల్ ఏజెంట్ల ద్వారా కార్లల్లో ప్రయాణించేందుకు సిద్ధపడుతుండగా, అద్దె కారుల ధరలు కూడా ఒక్కసారిగా పెంచేశారు.

టోల్‌గేట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు

సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు పయనం అయిన జనాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ కావడంతో రోడ్లపై నరకం చూస్తున్నారు. ముందుకి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. రోడ్లపై గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. వాహనదారులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా టోల్ ప్లాజ్ దగ్గర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నుంచి ఎక్కువగా సొంత వాహనాల్లో స్వగ్రామాలకు పయనమవడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం భారీ సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద టోల్ చార్జీలు చెల్లించేందుకు వాహన చోదకులు గంటలకొద్దీ వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో టోల్‌గేట్ నుంచి లింగోజీ గూడెం సమీపంలోని దివిస్ పరిశ్రమ వరకు 3 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాధారణంగా 5 గంటల్లో విజయవాడ వెళ్లాల్సిన ప్రయాణం 10 గంటలు పట్టే పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. అద్దాకుల టోల్ ప్లాజా వద్ద కూడా వాహనాల రద్దీ భారీగా ఉంది. తెల్లవారుజాము నుంచి కార్లతో హైవేలో రష్ నెలకొంది. టోల్ ఫీజు వసూలు చేయడానికి ఒక్కో వాహనానికి 2-3 నిమిషాల సమయం పడుతోంది. దీంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. హైదరాబాద్-విజయవాడ హైవే దిగ్బంధంలో చిక్కుకుంది. టోల్ గేట్ల దగ్గర వాహనాలను ఫ్రీగా వదిలిపెట్టాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పండగ మొదలు కాసుండటంతో మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. రెండురోజుల నుంచి ప్రారంభమైన సంక్రాంతి హడావుడి వారాంతంలో మరింత పెరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలతో రహదారులు కిక్కిరిసి పోయాయి.

ఎన్ఐఏ విచారణకు భయమెందుకు?

చంద్రబాబుకు బొత్స సూటిప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రతిపక్ష నాయకులు జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీ చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయం పట్టుకుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. పార్టీ కేంద్రకార్యాలయం లోటస్‌పాండ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును ఎన్ఐఏకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ చంద్రబాబు లేఖ రాయడాన్ని తప్పుబట్టారు. భయంతోనే చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారన్నారు. ఎన్ఐఏ విచారణ చేయాలని కోర్టే తీర్పు ఇచ్చిందని, ఏపీ పోలీసుల నివేదికలోనూ వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిందని స్పష్టంగా ఉందన్నారు. ఈ హత్యాయత్నం కేసును ఎన్ఐఏకు ఇస్తే చంద్రబాబుకు ఎందుకు భయమని ప్రశ్నించారు. చంద్రబాబు జీవితమంతా హత్యారాజకీయాలేనని దుయ్యబట్టారు. ప్రతిపక్షనేతపై జరిగిన హత్యాయత్నం కేసును ఎన్ఐఏ విచారణ చేపట్టడంపై ఏపీ ప్రభుత్వానికి అభ్యంతరాలు ఉన్నాయని చంద్రబాబు ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాస్తూ దాడి కేసును ఎన్ఐఏకు అప్పగించడం సరికాదనీ, ఎన్ఐఏ విచారణను రీకాల్ చెయ్యాలని కోరారు. శ్రీనివాసరావుని వారం రోజులపాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

కలకత్తా హైకోర్టు సీజేగా జస్టిస్ రాధాకృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ టీబీ రాధాకృష్ణన్ కలకత్తా హైకోర్టు సీజేగా బదిలీ కానున్నారు. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ డీకే గుప్తా డిసెంబరు 31న పదవీ విరమణ చేయడంతో అక్కడికి జస్టిస్ రాధాకృష్ణన్‌ను బదిలీ చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కేరళకు చెందిన జస్టిస్ రాధాకృష్ణన్ గతేడాది జూలై 1న ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతిపై వచ్చారు. 6 నెలలకే ఆయన బదిలీ కావడం న్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ రాధాకృష్ణన్ బదిలీ నేపథ్యంలో రెండో స్థానంలో కొనసాగుతున్న జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే)గా వ్యవహరించే అవకాశముంది.

18 తర్వాత భవిష్యత్ కార్యాచరణ

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సమ్మె సన్నాహక కార్యక్రమాలు అన్నీ పూర్తి చేశామని, 18వ తేదీ తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. అదే రోజున సంస్థ ఎండీ, వైస్ ఛైర్మన్ ఎన్.వి.సురేంద్రబాబుతో పేకమిటీ సమావేశంలో సమ్మెపై నిర్ణయం తీసుకుంటామని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడం, గత 2017 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జరగాల్సిన వేతన సవరణ విషయమై సీఎం చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని ఎండీ హామీ ఇచ్చారన్నారు. ఈనెల 18న జరిగే పే కమిటీ సమావేశంలో యాజమాన్య వైఖరిని బట్టి అన్ని సంఘాలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ తెలియచేస్తామన్నారు. సంస్థ పరిరక్షణ, నిజవేతనాల సాధన కోసం రాష్ట్ర కమిటీ నుంచి ఏ క్షణంలో పిలుపు వచ్చినా సిద్ధంగా ఉండాలన్న ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలలో సమ్మె సన్నాహక దినం విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈయూ డిమాండు మేరకు ఇంటర్ రీజియన్ బదిలీలకు యాజమాన్యం అనుమతిస్తూ ఆదేశాలు జారీ అయినట్లు నేతలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

ఏపీసీసీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కూడిన యూపీఏ కూటమి విజయం సాధించి గాంధీ వారసులు అధికారం చేపడతారని ఏపీసీసీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. దీంతో మోడీ శకం ముగుస్తాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలో యూపీఏ కూటమికి నాయకులు లేరని బీజేపీ జాతీయ నాయకులు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ బలోపేతంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయి నుంచి బలమైన కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌పార్టీకి వచ్చిన ఫలితాలే 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా పునరావృతం అవుతాయని అన్నారు

హైటెక్ సిటీకి మెట్రో రైలు!

నెలాఖరుకల్లా అందుబాటులోకి..

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్‌కే తలమానికంగా మారిన మెట్రో రైలు ప్రాజెక్టు ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. అమీర్‌పేట-హైటెక్ సిటీ మార్గంలో మెట్రో రైలును నెలాఖరు నుంచి నడపనున్నట్లు మెట్రో వర్గాలు చెబుతున్నాయి. ట్రయల్ రన్ చివరి దశకు చేరుకోవడంతో ఇక భద్రతాపరమైన తనిఖీలు చేపట్టాలని కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఎంఆర్ఎస్)ని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రారంభమైన ఎల్బీనగర్- మియాపూర్, నాగోల్- అమీర్‌పేట మార్గాలతో పోలిస్తే హైటెక్ సిటీ మార్గం క్లిష్టమైనది కావడంతో సీఎంఆర్ఎస్ మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని భావిస్తోంది. అమీర్‌పేట-హైటెక్ సిటీ మార్గంలో నవంబరు 29 నుంచి రాత్రిపూట ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. చివరి స్టేషన్ అయిన హైటెక్ సిటీలో రివర్సల్ లేకపోవడంతో ట్విన్, సింగిల్ విధానంలో రైళ్లు నడుపుతున్నారు. అనుకున్న ప్రకారం ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించినప్పటికీ ప్రారంభోత్సవం వరకు కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. సాధారణంగా మెట్రో రైళ్లు ఒక ట్రాక్‌లో వెళితే.. మరో ట్రాక్‌లో తిరుగు పయనం అవుతాయి. అమీర్‌పేట-హైటెక్ సిటీ మార్గంలో ప్రస్తుతానికి ఇది సాధ్యపడదు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు స్టేషన్ సమీపంలో రివర్సల్ ఉండటంతో ఇక్కడి వరకు ఇబ్బంది ఉండదు. పెద్దమ్మగుడి, మాదాపూర్, దుర్గం చెరువు, హైటెక్ సిటీ వరకు మాత్రం ట్విన్ సింగిల్ లైన్‌లోనే రైళ్లు వెళతాయి. నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు 7 నిమిషాలకో మెట్రో నడుస్తోంది. ఇదే మెట్రో హైటెక్ సిటీ వరకు వెళుతుంది.

ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కృషి

- ముఖ్యమంత్రితో చర్చించి సమస్యలు పరిష్కరిస్తా
- ముస్లిం సాధికారత రాష్ట్ర సదస్సులో మైనార్టీ మంత్రి ఫారూఖ్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి హక్కులు సాధించుకునేందుకు ఎల్లప్పుడూ తనవంతు సహకారం అందిస్తానని రాష్ట్ర మైనార్టీ మంత్రి ఎన్.ఎం.డి.ఫారూఖ్ అన్నారు. ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఫర్ ముస్లీమ్ రైట్స్ (ముస్లీం జేఏసీ) ఆధ్వర్యాన స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ముస్లిం సాధికారత రాష్ట్ర సదస్సులో మంత్రి ఫారూఖ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సదస్సు నిర్వాహకులు, ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఫర్ ముస్లిమ్ రైట్స్ కన్వీనర్, మాజీ న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్, మాజీ ఎంపీ నిజాముద్దీన్‌లు మైనార్టీల తరఫున మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ముస్లింలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని, శాసన సభ, రాజ్యసభ, మరియు స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవులలో అధిక సీట్లు కేటాయిస్తూ వారిని గెలిపించే బాధ్యత ఆయా పార్టీలు తీసుకోవాలని, జస్టిస్ రంగనాధ మిశ్రా కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే నేరుగా ఉద్యోగాలు సృష్టించి ముస్లిం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏ సెక్యులర్ పార్టీ బీజేపీ వ్యతిరేక పార్టీ ముస్లింలకు అత్యధిక సీట్లు కేటాయించి గెలిపించే బాధ్యత తీసుకుంటుందో ఆ పార్టీకి మద్దతివ్వాలని తీర్మానిస్తూ ముస్లింలకు పిలుపునిస్తూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించామని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫారూఖ్ మాట్లాడుతూ న్యాయమైన హక్కుల సాధన కోసం ముస్లింలు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలకతీతంగా ఒకే వేదిక ద్వారా ఏకమవడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో తాను చర్చించి ముస్లిం, మైనార్టీల హక్కులను సాధించుకుందామని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ముస్లిం మైనార్టీల కోసం తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ ఎం.డి.షరీఫ్ అహ్మద్, శాసనసభ విప్, కదిరి ఎమ్మెల్యే చాంద్ బాషా, గుంటూరు వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్‌మీరా, గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే జలీల్ ఖాన్, మాజీ ఎమ్మె ల్యేలు మస్తాన్ వలి, గఫుర్, ఉర్దూ అకాడమి ఛైర్మన్ నౌమాన్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మునీర్ అహ్మద్, వైసీపీ తరఫున ఎం.ఎస్.బేగ్, పీసీసీ కోఆర్డినేటర్, ఫోరమ్ కో-కన్వీనర్ ఎస్.అరిఫ్ అలి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం
తొలి దశకు వెంటనే శ్రీకారం


- ఆ రెండు నిబంధనలపై పరిశీలన
- 17న ప్రత్యేక సమావేశం
- ఏపీయూడబ్ల్యూజే నేతలకు మంత్రి కాల్వ హామీ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ప్రభుత్వానికి అందిన జర్నలిస్టుల దరఖాస్తులలో పూర్తి అర్హతలు ఉన్న వారికి వెంటనే గృహం కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వటంతో పాటు సమాచార శాఖ ఇచ్చే సబ్సిడీ నిధులను విడుదల చేయనున్నట్లు సమాచార శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఆ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఫోన్‌లో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావుతో ఆయన ఈ సమస్యపై మాట్లాడారు. తొలుత ఫోన్ చేసిన సుబ్బారావు సమస్యలను, యూనియన్ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ రోజు విజయవాడ రాలేకపోయా నని, పండగ సెలవులు అనంతరం 17వ తేదీ కార్యక్రమానికి శ్రీకారం పలుకుదామని హామీ ఇచ్చారు. ఆ రోజు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సుబ్బారావు అడిగిన రెండు ప్రశ్నలకు బదులు ఇస్తూ వచ్చిన దరఖాస్తుల్లో సక్రమంగా ఉన్న వాటికి వెంటనే గృహాలు కేటాయించి, సమాచార శాఖ నిధులను ఆ జిల్లాలకు పంపుతామని తెలిపారు. మొత్తం 8 వేల దరఖాస్తులు రాగా వాటిలో అన్నీ సక్రమంగా ఉన్నవారికి తొలి దశ క్రింద ఇళ్లు, నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులు లేకపోవటం, పూర్వకాలంలో ఎప్పుడో గృహం ఇచ్చారనే సాకుతో తిరస్కరణకు గురవుతున్న దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయనే విషయాన్ని మంత్రి తెలియజేస్తూ, ఈ నిబంధనలు సడలిస్తేనే ఎక్కువ మంది జర్నలిస్టులకు న్యాయం జరుగుతుందని మంత్రి అంగీకరించారు. ముఖ్యమంత్రితో మాట్లాడతానని, మరో వారం రోజుల్లో సానుకూల నిర్ణయం వస్తుందని మంత్రి పేర్కొన్నారు. విజయవాడలో జరుగుతున్న యూనియన్ సమావేశం నిర్ణయాలను ఆయనకు సుబ్బారావు వివరించారు. గతంలో మంత్రి ఇచ్చిన హామీ, శనివారం ఫోన్‌లో ఇచ్చిన స్పష్టత మేరకు ఈ నెల 21 వరకు వేచి చూడాలని సమావేశం అభిప్రాయపడింది. సమావేశంలో ఐ.వి.సుబ్బారావుతోపాటు, ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూ డబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఉపాధ్యక్షుడు జయరాజ్, కార్యవర్గ సభ్యులు చావా రవి, సీనియర్ నాయ కులు షేక్ బాబు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చలపతిరావు, కృష్ణా అర్బన్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు సంక్రాంతుల ముచ్చట

- విజయనగరం జిల్లా ఇటికర్లపల్లిలో 9 రోజులపాటు సంబరాలు
- ప్రాచీన సాంప్రదాయాలను కొనసాగిస్తున్న గ్రామస్తులు
- నేటి నుంచి పండగ ప్రారంభం



విశాలాంధ్ర - చీపురుపల్లి (విజయనగరం) : దేశ వ్యాప్తంగా పంచాంగ శాస్త్రవేత్తలు, వేద పండితులు నిర్దేశించిన మేరకు ప్రతీ ఏడాది జనవరి 14,15,16 తేదీల్లో భోగీ, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవడం ఆనవాయితీ. అయితే దీనికి భిన్నంగా ఆ గ్రామంలో సంక్రాంతికి ముందు సోమవారం ఒక సంక్రాంతి, సాధారణ సంక్రాంతి పండుగ తరువాత వచ్చిన సోమవారం మూడో సంక్రాంతిని జరుపుకోవడం విశేషం. ఆధునిక ప్రపంచంలో యాంత్రికంగా మానవ జీవన సరళి మారిన తరుణంలో కూడా పూర్వం నుంచి వస్తున్న కుటుంబ ఆచార సాంప్రదాయాలను ఆ గ్రామస్తులు నేటికీ ఆచరిస్తూ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విజయనగరం జిల్లాలోని చీపురు పల్లి మండలం, ఇటికర్లపల్లి గ్రామానికి చెందిన మీసాల ఇంటిపేరు కుటుంబీకులు, కెల్ల, కొంచాడ ఇంటి పేరు గల కుటుంబాలు సంక్రాంతికి ముందు వచ్చే సోమవారం రోజున సంక్రాంతి పండగను జరుపుకోవడం ఆనవాయితీ. ఆదివారం భోగీ పండగ, మంగళవారం కనుమ పండగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. అయితే ఈ మూడు కుటుంబీకులు వారు భోగీ పండగ రోజున భోగీ మంటలను వేయడం ఉండదు. దీనికి కారణం పూర్వకాలంలో భోగీ మంట వేసిన తరుణంలో ఆ మంటల్లో పిల్లి పడి చనిపోవడం అశుభంగా భావించి అప్పటి నుండి భోగి మంటను నిషేధించి నట్లు ఆ కుటుంబ పెద్దలు వివరించారు. సాధారణ సంక్రాంతి పండగ అనంతరం కుమ్మరి కుటుంబీకులు మరో మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండగలను జరుపుకుంటారు. ఈ క్రమంలో ఆ గ్రామంలో 9 రోజుల పాటు సంక్రాంతి పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సంక్రాంతి పండుగ రోజు ఒకే చోట అందరూ కలిసి సాయంత్రం పూట పూజలు నిర్వహించి అనంతరం పెద్దలకు నైవేద్యంగా ఎండుచేపలు, మాంసం, ముంత కల్లు, చెరువు చేపలు పెట్టడం ఆచారం. అనంతరం మీసాల కుటుంబీకులు సహపంక్తి భోజనాలు చేస్తారు.

సంక్రాంతి రథం - క్రాంతి పథం

సంస్కృతి, సౌభాగ్యాలు కలబోసుకొన్న అపురూప సంబరాల సంరంభం సంక్రాంతి. పుడమి పుస్తకంపై ప్రకృతి రాసుకున్న తీయని కవిత. బంతిపూలు, చేమం తులు జడలో సింగారించుకొని ఆకుపచ్చని చీర ధరించి రంగవల్లుల రంగులదారిలో నడిచివచ్చే అందాల రమణి. నెత్తుటి ధారను చెమటనీరుగా మార్చి పంట సిరులు పెంచే, పంచే అన్నదాతల ఆశలు పండగా వచ్చే వేడుక ఈ సంక్రాంతి. మనిషికి సాగునేర్పి బతుకుల్లో పెనుమార్పు తెచ్చిన పండగ. క్రాంతి అంటే మార్పు. సం అంటే ముందుకు, క్రాంతి అంటే అడుగు అంటే ముందడుగు అని అర్థం. అభ్యుదయం మాన వాళికి మంచి అభ్యున్నతిని అందిస్తుంది కాబట్టే దీన్ని సంక్రాంతి అన్నారు. సార్వజనీన దృక్పథం ఈ సంక్రాంతి లక్షణం. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించి ఉత్తర దిశ ప్రయాణాన్ని కొనసాగించడం ఈ సంక్రాంతితోనే ప్రారంభమవుతుంది. చలినుంచి వేసవికి కాలం మార్పు చెందడం దీనితోనే మొదలవుతుంది. ఉదయం కాలం పెరుగుతూ, రాత్రికాలం క్రమంగా తగ్గుతుంది. మనిషి జీవితాన్ని క్రమబద్ధం చేసే సవిత్రుడు గతిని, రాశిని మార్చి తద్వారా జనగతిని నిర్దేశించే మహత్తర ముహూ ర్తమే సంక్రాంతి. ఆచార సంప్రదాయాలు, శాస్త్రీయ విజ్ఞానం, పర్యావరణం, వినోదం, వేడుకలు, సర్వప్రాణి హితం వగైరాలన్నీ కలగలసిన అపూర్వ, అద్భుత పర్వ దినం. అందుకే జనజీవన నవకాంతి సంక్రాంతి అన్నారు. 'స్వర్ణవర్ణ సుప్రభాత స్రవంతి, నిఖిలలోక మహా వైజయంతి' అని పేర్కొన్నారు.

సంక్రాంతి సుందరి ఒంటరిగా రాదు. మహా రాణిలాగా.. మంచును, చలిపులిని తరిమికొట్టే మంటల కిరీటంతో ముందు భోగిని, వెనుక కనుమ, ముక్క నుమను వెంటబెట్టుకొని చెలికత్తెల నడుమ రాకు మార్తెలా వస్తుంది. వాస్తవానికి ధనుర్మాసారంభంలోనే నెల పట్టండహో అంటూ దండోర వేసుకొంటూ పండగ శోభ వచ్చేస్తుంది. ఇన్ని విలక్షణాల మేలి కలయిక అయినందువల్లే 'శింజాన మధుర మంజుల/ మంజీర ములయ్యె తెలుగు మాగాణమ్ముల్/ పుంజీభవించె నవనవ సంజీవ సమగ్ర సస్య సౌభాగ్యంబుల్' అని కవి గళాలు మార్మోగాయి. ముంగిట్లో ముగ్గులు, గొబ్బిళ్లు, హరిలో రంగ హరీ అని పాడుకుంటూ తిరిగే శ్రీమన్నా రాయణుడిగా తలచే హరిదాసులు, గంగాధరుడిలా భావించే గంగిరెద్దులవారితో పల్లెలన్నీ పండగశోభను సంత రించుకుంటాయి. నిండు గాదెల్లాగా రైతుగుండె నిండుగా ఉండే నిజమైన పండగ ఇది. 'కాంతి శాంతి సుఖమ్ము భాగ్యమ్ము నొసగు/ విజయు సంక్రాంతి లక్ష్మి శోభిల్లు లెమ్ము/ బహువిధారిష్టములు భస్మీపటమగును/ కొత్త వెలుగుల జగతి తళుకొత్తుసుమ్ము' అని కవిగారు దీవించారు. భోగి సాయంత్రం పిల్లలకు భోగిపళ్లు పోయడం, బొమ్మల కొలువులు తీర్చి దిద్దడమూ ఓ చక్కని అను భూతే. భోగిపండ్లు పోయడం ఆయురారో గ్యాలకు చిహ్నం. భోగిమంటల్లో పాత వస్తువులు దగ్ధం చేయడం పనికిరాని పాతభావాలు వదిలించుకొని మంచినిచ్చే కొత్తదనం వైపు సాగడానికి సంకేతం. కలతల చీకట్లను దూరాలకు తరిమే భోగిమంటలు, నేలానింగీ దూరాల్ని కలిపే దారాల గాలిపటాలు మనిషిలో నూతనోత్సాహాన్ని, పోరాట తత్వాన్ని నింపేవే. 'మాలిన్యం మలగిపోవ, మాత్సర్యం తొలగిపోవ/ దౌర్భాగ్యం తరలిపోవ, చీకట్లవి చెదిరిపోవ' మనిషిచేసే ప్రయత్నమే భోగిభాగ్యాలు అని కరుణశ్రీ అన్నారు. రెండవ రోజు ప్రధాన పండగ. సంక్రాంతి విందుభోజ నానికి సాటిలేదు.'లేగటి పాలలో గ్రాగిమాగిన తీయ/తీయ కప్పుర భోగి పాయసంబు/ చవులూరు కరివేప చివురాకులతో గమ/గమలాడు పైర వంకాయకూర/ తరుణ కుస్తుంబరీ దళ మైత్రిమై నాల్క/ త్రుప్పుదుల్చెడు నక్కదోస బజ్జి, ముదురు గుమ్మడిపండు పులుసు, జిడ్డుదేరిన వెన్నెల గడ్డపెరుగు' అంటూ ఆ విందును వర్ణించాడు ఓ కవిగారు. రైతులకు కనుమ ఎంతో ముఖ్యం, ఇష్టం. నేలదున్ని, సాగుచేసి, సిరులు పండిం చేందుకు, ఆ ధాన్యపురాశులు ఇంటికి చేర్చేందుకు అన్ని విధాలా తనకు అండగా ఉండే ఎద్దుల్ని, పాలిచ్చి ఆహారం, ఇంటికి ఆర్థికం అందించే ఆవులు, గేదెల్ని శుభ్రంగా కడిగి పూజలు చేస్తారు. ఈ రోజు ఇళ్ల యజ మానుల కన్నుల్లో సంక్రాంతి తేజ:పుంజాలు మెరుస్తాయి. నాలుగో రోజు ముక్కనుమ.. ముక్క లేనిదే ముద్ద దిగని భోజనప్రియులకు తృప్తితీరా విందారగించే అవకాశం కలుగుతుంది. ఈ పండగకు పేద, ధనిక, కులమతాల తేడాలు లేకుండా అందరూ ఆనందో త్సవాల నడుమ ఉత్సాహంగా గడుపుతారు. 'ఒకచో సంధ్యావందనం, ఒకచో పురాణపఠనం, ఒకదెస స్నానపానాదులు, మరో దిశ భూగోదానాదులు, ఒక ఇంట ఆట పాటలు, మరో ఇంట విందు విశ్రాంతులు'గా ఈ నాలుగురోజులు గడిచిపోతాయి. 'శీతగాలి వీచినప్పుడు లేత ఎండలా/ ఎండ కన్ను సోకినప్పుడు మంచు కొండలా' ఈ సంక్రాంతి రోజులు కనిపిస్తాయి. 'పువ్వుల తావిలోన, పసిబుగ్గల నిగ్గుల చంటిపాప చి/ర్నవ్వుల మోవిలోన, రసరాగిణి పిల్లనగ్రోవిలోన' అందాన్ని, ఆనందాన్ని అనుభవించేందుకు అవకాశం లభించే రోజులివి.

సంక్రాంతికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. ఈ వేడుకకు హీరోగా భావించే సూర్యుడు, మకరరాశికి అధిపతిగా విశ్వసించే శనీశ్వరుడు తండ్రీ కొడుకులు. వీరిద్దరి మధ్య బద్ధవైరం ఉంటుంది. సంక్రాంతి రోజున మాత్రం వీరిద్దరూ కలుసుకొని ఆనందోత్సాహాలు పంచుకుంటారు. నేడు ప్రపంచం ఆగక పరుగులు తీసే, ప్రతి క్షణాన్నీ రూపాయలతో కొలిచే వ్యాపా ర ధోరణి ప్రబలింది. దీంతో ఉద్యోగాలు, వ్యాపారాల పేరిట తల్లిదండ్రులకు, సొంతూరికి దూరంగా జీవించక తప్పడంలేదు. అయితే వారందరూ పల్లెలకు చేరుకొని ఈ నాలుగు రోజులు ఒకరికొకరు ఆత్మీయానుభూతులు కలబోసుకోవడం ఈ పండగ విశిష్ట లక్షణం. ఈ నాలుగు రోజుల్లో పట్టణాలన్నీ ఖాళీగా ఉండడం మనం చూస్తేనే ఉన్నాం. మనిషి జీవితంలో ఎంత స్పీడు, బిజీ వచ్చినా మమతాను బంధాలు మాత్రం యథాతథంగానే ఉన్నాయని ఈ పండగ నిరూపిస్తోంది. సంక్రాంతి అంటే ఉమ్మడి, ఊరుమ్మడి పండగ అని పిలుచుకోవచ్చు. అన్ని పండగల్లోనూ ఏకత్వం, మమేకత్వం మూలా ధారమైనా దీనికి ఆ లక్షణం మరింత ఎక్కువ. అందుకే వైజ్ఞానికంగా మనం ఎంత ఎదిగినా ఈ సంక్రాంతి అందచందాలు అడుగంటలేదు. పాతబడిపోలేదు. ఎప్పటికప్పుడు కొత్తగా అనిపిస్తుంది. అది నిత్యనూతనం. భోగి మం టల్లో పాతబడిన ఆలో చనలు, పనికిరాని సంవేదనలు, నిరాశా నిస్పృహలు వంటి సమిధల్ని విసిరేయాలి. అదొక జ్వాలాయజ్ఞం. క్రాంతి కోసం జరిగే దీప్తిక్రతువు.

సూర్యుడు సత్యానికి ప్రతీక. మనం కూడా సత్య రాశిలో ప్రయాణిద్దాం. అదొక ఆనంద, చైతన్య సంక్రమణం. ప్రకృతిలో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపి జన బాహుళ్యంలో సరికొత్త ఉరవడినీ, ఒరవడినీ కలిగించే పండగిది. అందుకే సంక్రాంతి రథం.. మనకు చూపిస్తుంది క్రాంతి పథం.

చురక

పార్లమెంటు ఎన్నికలు
పానిపట్టు యుద్ధమంటూ
బిజేపీ గెలువకుంటే
బానిసత్వమొస్తదంటూ

అబద్ధాల మాటలతో
అమిత్ షా బెదిరింపు
అసహనం తమ పాలన
అవగలదా ప్రజలకింపు

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

పెట్టుబడిదారీ వ్యవస్థ
సార్వత్రిక సంక్షోభం
భాగం - 2

పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాలు



మర్ల విజయ కుమార్

ఆర్థిక సంక్షోభాలు పెట్టుబడి దారీ వ్యవస్థకు పుట్టుకతో వచ్చిన వ్యాధి లక్షణాలు. ఈ వ్యవస్థ జన్యువులలోనే ఈ వ్యాధి ఉన్నది. నేటికి 150 సంవత్సరాల క్రితం, మార్క్స్, ఏంగెల్స్‌లు "కమ్యూనిస్టు ప్రణాళిక" గ్రంథంలో చెప్పిన మాట నేటికీ అక్షరాలా నిజం: "పెట్టుబడిదారీ వర్గం అనే మాయామాంత్రికుడు తన మంత్రాలతో బయటకు రప్పించిన భూతాలు వశం తప్పి, అతడినే కబళించే స్థాయికి చేరుకుంటాయి." తరచూ సంభవించే ఈ ఆర్థిక సంక్షోభాలు పెట్టుబడిదారీ వ్యవస్థను నిరంతరం అస్థిరత్వానికి లోనుచేస్తాయి. మార్క్స్ మాటలలో చెప్పాలంటే, ఈ వ్యవస్థ ఒక సంక్షోభం నుండి మరొకదానికి కుంటుకుంటూ, లేస్తూ, పడుతూ పయనిస్తుంటుంది. అయితే, సంక్షోభాలు ఎందుకు సంభవిస్తాయనే ప్రశ్నకు ఇప్పటివరకూ సంతృప్తికరమైన సమాధానం పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కనుగొనలేక పోయారు. ఒకసారి బ్రిటిష్ రాణి, ప్రతిష్ఠాత్మ కమైన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లోని ప్రఖ్యాత ఆర్థిక వేత్తలను, "ఆర్థిక సంక్షోభాలు ఎందుకు సంభవిస్తాయ"ని అడిగితే, ఆ పండితులంతా ఆరు నెలలపాటు కుస్తీలు పట్టి, చివరకు రాణీగారికి, "ఈ వ్యవస్థ స్వాభావిక లక్షణాల ప్రకా రమే సంక్షోభాలు సంభవిస్తాయని మాకు అనుమానంగా ఉన్నది. ఏది ఏమైనా, మరింత పరిశోధన అవసరం" అని సమాధానమిచ్చారట. ప్రముఖ పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త అయిన జోసెఫ్ స్టిగ్లిట్జ్, "మార్క్స్ నేర్పిన పాఠాలు మనం అర్థం చేసుకుని ఉంటే, ఈ సంక్షోభాలకు కారణాలను వెదుక్కోనక్కర లేదని" ఒప్పుకున్నాడు. "అసలు ఆర్థిక సంక్షోభం అంటే ఏమిటి? అది ఎందుకు సంభవిస్తుంది?" అనే ప్రశ్నలకు మనం ఇప్పుడు సమాధానం మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషిద్దాం.

ఆర్థిక శాస్త్ర పాఠాలలో పెట్టుబడిదారీ వ్యవస్థలో డిమాం డును బట్టి వస్తూత్పత్తి జరుగుతుందని, ఎప్పుడైతే డిమాండు కంటే ఉత్పత్తి ఎక్కువవుతుందో, అప్పుడు పెట్టుబడిదారులు తమ ఉత్పత్తులను తగ్గించుకుని, మళ్ళీ మార్కెట్ లో సమ తుల్యాన్ని సాధిస్తారని నేర్పుతారు. కాని నిజజీవితంలో, అనేక మంది ఉత్పత్తిదారులు తమకు లాభాలు తెచ్చిపెడతాయనుకున్న వస్తువులనే తయారుచేసి, మార్కెట్ లో అమ్మకానికి పెడతారు. ఉదాహరణకు ఒక మోడల్ టీ షర్టులు బాగా అమ్ముడవటం చూసి, రామయ్య బ్రదర్స్ దేశ వ్యాప్తంగా తమ షాపులలో ఆ టీషర్టులు అమ్మకానికి పెడతారు. జోరుగా సాగుతున్నవారి అమ్మకాలను చూసి, వెంకన్న బ్రదర్స్ కూడా అదే డిజైన్ టీషర్టులు తెచ్చి, పోటీగా అమ్మకానికి పెడతారు. వీరిద్దరినీ చూసి, పుల్లయ్య బ్రదర్స్ కూడా ఏసీ షోరూములలో, 10% డిస్కౌంటుతో పోటీకి దిగుతారు. అమ్మకాలు బాగా జరిగినంత కాలం, ఈ ముగ్గురూ, కొత్త ఫ్యాక్టరీలు స్థాపించి, కార్మికులను పనిలోకి తీసుకుని ఉత్పత్తిని ఇబ్బడిముబ్బడిగా పెంచుతారు. పోటీపెరిగి, అమ్మకాలు మందగించటంతో, రామయ్య బ్రదర్స్ సినిమా స్టార్స్ బొమ్మలతో, రంగురంగుల లైట్లతో షాపును ఆకర్షణీయంగా చేసి, 20% డిస్కౌంట్ ప్రకటిస్తారు. కాని ప్రజలకు అవసరమైన టీషర్టులు పరిమితంగానే ఉంటాయి. కాని అమ్ముడవగలిగిన దానికంటే ఎక్కువ సరుకులు మార్కెట్ లో గుమ్మరించబడటంతో, అందరికీ అమ్మకాలు తగ్గుముఖం పట్టి, వ్యాపారాలు కుదేలవుతాయి. దానితో, ఫ్యాక్టరీలు మూత పడి, కార్మికులు జీవనోపాధిని కోల్పోతారు. అదే ఆటోమొబైల్ తయారీ పరిశ్రమ వంటి పెద్ద కంపెనీలు మూతపడితే, వారితో వ్యాపార సంబంధాలు ఉన్న అనేక ఇతర రంగాలలోని పరిశ్ర మలు కూడా మూతపడతాయి. దానితో, లక్షలాదిమంది కార్మి కులు రోడ్డునపడి, వారికి ఆదాయాలులేక, వారి కొనుగోలు శక్తి సున్నాకు చేరుతుంది. దానితో మొత్తం ఆర్థిక వ్యవస్థే కుప్ప కూలే పరిస్థితి ఏర్పడుతుంది. ఫ్యాక్టరీలపైన పెట్టిన పెట్టు బడులు నిరర్థకమై, అప్పులిచ్చిన బ్యాంకులు కూడా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితినే "ఆర్థిక సంక్షోభం"గా వ్యవహరి స్తారు. ఈ రకమైన స్వాభావికమైన, అదుపు తప్పిన అధికోత్పత్తినే మార్క్స్ సంక్షో భాలకు మూలకారణంగా నిర్ధారించారు.

స్వాభావికంగా, పెట్టుబడిదారుల ఉత్ప త్తులకు, ప్రజావసరాలకూ సంబంధం ఉండ దు. పెట్టుబడిదారుడు ఫలానా వస్తువు అమ్ము డవుతుందని భావించి, దానిపై పెట్టుబడులు పెట్టి, వస్తువులను మార్కెట్‌కు తెచ్చి, లాభాలు గడించాలని చూస్తాడు. ఈ ప్రక్రియలో ప్రజావసరాలకు అనుగుణంగా వస్తూత్పత్తి జరగదు. ఎంత ఉత్పత్తి జరిగినా ప్రజావ సరాలు మాత్రం తీరవు. ఖరీదైన సెంట్లు అమ్మే షాపులు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తాయి గాని, ప్రజల నిత్యావసర వస్తువుల అమ్మ కాలపై ఎవరూ శ్రద్ధతీసుకోరు. పైగా, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లో, ఒకప్పుడు 10 రూపాయలకు దొరికే చింతపండును 30 రూపాయలకు ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి అమ్మజూస్తారు. ఎప్పుడైతే, పెట్టుబడిదారులు లాభాపేక్షతో అమ్మజూపే ఖరీదైన వస్తువులు అమ్మకాలు కాకపోతే, వ్యాపార ప్రకటనలు ముంచెత్తి, ప్రజల మనసులు మొద్దుబారేటట్లు చేసి, ఆ వస్తువులను కొనుగోలు చేసేటట్లు ప్రేరేపిస్తారు. చిరు గులతో, పీలికలతో ఉన్న ఫలానా గాడిద బ్రాండు, జీన్స్ స్కర్టు 5 వేల రూపాయలకు అమ్మినా, 16 ఏళ్ళకూతురు, అదే కావాలని పట్టుబడుతుంది. ఎందుకంటే, "మా ఫ్రెండ్స్ అందరూ ఆ గాడిద బ్రాండు డ్రస్ లే వేసుకుంటారు. అవి వేసుకోకపోతే, నా పరువు పోతుంది" అని మారాం చేస్తుంది. రోడ్డుపైన ఎక్కడ చూసినా గాడిద బ్రాండు డ్రస్‌ల ప్రకటనలే కనిపిస్తాయి. యువత ఫేవరెట్ హీరో ఆ గాడిద బ్రాండు డ్రస్‌లనే కొనమని మనకు పదేపదే టివి అడ్వర్టైజుమెంట్లలో ప్రతీ పది సముషాలకొక నార చెప్ప, యువత మనసులు మొద్దుబారిపోయేటట్లుగా చేస్తుంటాడు. కాని అమ్మకాలు సజావుగా జరుగుతున్నంత కాలం, తండ్రికి నెలనెలా జీతం ముదుతున్నంత కాలం పిల్లల కోరికలు తీర్చగలుగుతాడు. ఎప్పుడైతే, మార్కెట్‌లో మాంద్యం ఏర్పడి, కార్మికులు, ఉద్యోగులు రోడ్డున పడతారో, ఏ వ్యాపార ప్రకటనలూ పెట్టుబడిదార్ల వ్యాపారాలను రక్షించలేవు. ఒక పక్కన పోటీ తీవ్రమై, మరొక పక్కన ప్రజల కొనుగోలు శక్తి క్షీణించటంతో, పెట్టుబడిదారులు మార్కెట్ లో తమ సరుకులు అమ్ముకోవటానికి అవకాశాలు సన్నగిల్లిపోగా, ఇక వారు తమ సరుకుల ధరలైనా తగ్గించాలి, లేదా ఉత్పత్తి ఖర్చులైనా తగ్గించుకోవాలి. లేనిదే వారు తమ వ్యాపారాలను కొనసాగించలేరు. ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకోవటానికి, పెద్ద పరిశ్రమలు తమ ముడిసరుకుల సప్లయర్లపై వత్తిడి



తీసుకువచ్చి, ముడిసరుకుల, విడిభాగాల ధరలను తగ్గించి వేయటానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి పరిస్థితులలో ఆటవిక న్యాయమే రాజ్యమేలుతుంది. ఆర్థిక బలం ఉన్నవాడి మాటే నెగ్గుతుంది. ఈ క్రమంలో చిన్న వ్యాపారులు నష్టపోతారు. ఫ్యాక్టరీ ఉత్పత్తికి అవసరమైన విద్యుత్తు, నీరు, డీజల్ తదితరాలపై ఖర్చులు సామాన్యంగా అతడి అధీనంలో ఉండవు. ఇక ఉత్పత్తిదారునికి మిగిలిన మరొక మార్గం, కార్మికులపై పెట్టే ఖర్చు తగ్గించుకోవటం ఒకటే. అందుకోసం అతగాడు అనేక పద్ధతులను అవలంభించవచ్చును. అమ్మకాలు తగ్గిపోతున్నాయి కనుక, ఇంతమంది కార్మికులు అవసరం లేదని నాలుగవ వంతు కార్మికులను పనిలోనుండి తీసివేసి, త్వరలో మిగతా వారిలో మరికొంతమందికి కూడా ఉద్వాసన చెప్పవలసి ఉంటుందని చెప్పి, కార్మికుల భయభ్రాంతులయ్యే టట్లుగా చేస్తాడు. తొలగించబడిన కార్మికులు ఫ్యాక్టరీ బయట ధర్నాలు చేపడితే, "మీరుగాని వారితో కలిస్తే, మీ ఉద్యోగాలు కూడా పోతాయని, ఫ్యాక్టరీ లాకౌట్ చేస్తానని బెదిరించి, పనిలో ఉన్న కార్మికులచేత రోజుకి 8 గంటల బదులు 12 గంటలు చాకిరీ చేయించుకుంటాడు. ఆవిధంగా వర్కర్స్ యూనియన్ ను నాశనం చేస్తాడు. అవసరమైతే, కొత్త ఆటోమేటిక్ యంత్రాలను తీసుకువచ్చి, ఉత్పత్తిని మరింత తక్కువమంది కార్మికులతో చేయగలుగుతాడు. ఇక మరికొంతమంది కార్మి కులు ఉద్యోగాలు కోల్పోతారు. ఆవిధంగా రాక్షస రాజ్యాన్ని ఏలి, ఉత్పత్తి ఖర్చును తగ్గించుకున్నా, అతగాడి పోటీదార్లు కూడా అవే టెక్నిక్‌లతో తమ ఖర్చులు కూడా తగ్గించుకుని, మార్కెట్‌లో పోటీని మరింత తీవ్రతరం చేస్తారు. ఈ ప్రక్రియనే మార్క్స్ "లాభాల క్షీణత" సూత్రంగా వివరించారు.

1970 దశకంలో సరిగ్గా ఇటువంటి పరిస్థితినే అమెరికా, యూరప్‌లలోని పెట్టుబడిదార్లు ఎదుర్కొన్నారు. మార్కెట్ ను విస్తరించుకోవటం, తక్కువ ఖర్చుతో వస్తూత్పత్తిని చేయటం వారికి తప్పనిసరి అయింది. రీగన్, థాచర్‌లు నయాఉదార వాద విధానాలను ప్రపంచంపై రుద్ది, ప్రపంచీకరణ, ప్రైవేటీ కరణ, సరళీకరణ పేరున, ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలపై పట్టు సాధించటం ఆరంభించారు. చైనా, మెక్సికో, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెట్టుబడులు పెట్టటం, అక్కడ చౌకగా లభించే ప్రకృతి వనరులను, కార్మికుల శ్రమశక్తిని వినియోగించుకుని, వస్తూత్పత్తి చేయటం ద్వారా, వారు తమ లాభాలను నిలబెట్టుకో గలిగారు. పైగా కంప్యూటర్లు ఆటోమేటిక్ యంత్రాలతో అనుసంధానించ బడటంతో, మొత్తం ఉత్పత్తి విధానమే మారిపోయింది. వస్తూత్పత్తి రంగంలో కార్మికుల సంఖ్య తగ్గిపోనారంభించింది. సర్వీసు రంగంలో కొత్త ఉద్యోగాలు కల్పించబడ్డాయి. కాని ప్రపంచీకరణలో భాగంగా, ఉత్పత్తి, సర్వీసు రంగాలు చైనా, భారత్, మెక్సికో వంటి దేశాలకు తరలిపోతుండటంతో అమెరికా, యూరప్‌లలో ఫ్యాక్టరీలు, వ్యాపారాలు బయటకు తరలిపోయి, అక్కడ తీవ్రమైన స్థాయిలో నిరుద్యోగం ప్రబ లింది. ఇక అప్పుడు అమెరికాలో ఒక విచిత్రమైన పరిస్థితి తలెత్తింది. దేశంలోకి చౌకగా చైనా సరుకులు దిగుమతి అవుతున్నాయి. కొనుగోలు శక్తి క్రమంగా తగ్గిపోతుండటంతో, ప్రజలకు ఈ చౌక సరుకుల వలన కొంతవరకు ఉపశమనం లభించినా, రానురాను మార్కెట్ క్షీణించనారంభించింది. ముఖ్యంగా, గృహ నిర్మాణరంగం అతి గడ్డుపరిస్థితిని ఎదుర్కొన్నది. వేరొక ప్రక్కన పెట్టుబడిదారుల వ్యాపారాలు ప్రపంచవ్యాప్తమై, లాభాలు ఇబ్బడిముబ్బడిగా అమెరికన్ బ్యాంకులలోకి వచ్చి చేరాయి. ప్రపంచ వ్యాప్తంగా ధనిక వర్గాలు తమ ప్రజలను దోపిడీచేసి, పోగుచేసుకున్న ధనాన్ని పశ్చిమ దేశాల బ్యాంకులలో కుదువబెట్టటంతో అపారమైన సంపద పోగుపడిందికాని, ఆ సంపదను పెట్టుబడులుగా పెట్టి లాభాలు సంపాదించటానికి అవకాశాలు సన్నగిల్లిపోయాయి. ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా ప్రజల కొనుగోలు శక్తి అతి ప్రధాన మైనది. కొనుగోలుదార్లే లేకపోతే, ఇక వస్తూత్పత్తి చేయవలసిన అవసరములేదు, కొత్త పెట్టుబడుల అవసరం అంతకన్నాలేదు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో అనునిత్యం లాభాలను తిరిగి కొత్త పెట్టుబడులుగా వెచ్చించకపోతే, ఆ వ్యవస్థకు ఊపిరి ఆగిపోయినట్లే. ఇనప్పెట్టెలోనో, బ్యాంకు ఖాతాలోనో మురిగి ఉండే ధనం వలన పెట్టుబడిదారునికి ఏవిధమైన ప్రయోజన మూ లేదు. అందుచేత, తమ వద్ద ఉన్న అపార సంపదను ఉపయోగించి, ఏదో ఒక విధంగా లాభాలు సంపాదించటానికి పెట్టుబడిదార్లు నూతన పద్ధతులను అనుసరించ నారంభించారు. ఆ విధంగా ఫైనాన్స్ ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో జూదమాడటం, విదేశీ పెట్టుబడుల రూపంలో ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలలోకి ప్రవేశించి, లాభార్జన చేయటం ఒక పద్ధతి. ఇక రెండవది, ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ వ్యాపారాలు పెరగటంతో, క్రెడిట్ కార్డులు, నెట్ వ్యాపారాలద్వారా అప్పులు ఇచ్చి లాభాలు గడించటం ద్వారా, తమ ఫైనాన్స్ సంపదపై లాభార్జన చేయటం రెండవ పద్ధతి. ఈ అవకాశాలను వినియోగించుకుని, బ్రహ్మాండమైన స్థాయిలో ఫైనాన్స్ కంపెనీలు విస్తరించాయి. అయితే ఇక్కడ అతి ప్రధానమైన విషయం ఏమిటంటే, ఉత్పత్తి రంగాలలోనే, కార్మికుల శ్రమ శక్తి ఫలితంగా మాత్రమే సంపద సృష్టించబడుతుంది. ఫైనాన్స్ రంగంలో ఎన్ని లక్షల కోట్ల వ్యాపారాలు జరిగినా, ఒక్క పైసా సంపద కూడా సృష్టిం పబడదు. ఉత్పత్తి రంగాలలో భవిష్యత్తులో సృష్టింపబడే సంపదపై ఈరోజే లాభాలను పిండుకోవటమే ఈ ఫైనాన్స్ రంగం లక్ష్యం. దానితో, మొత్తం ఆర్థిక వ్యవస్థనే తన గుప్పిట్లో పెట్టుకుని, ఈ ఫైనాన్స్ రంగం రాజ్యమేలుతుంది. ఎప్పుడైతే, డబ్బు డబ్బును సంపాదించటం ప్రాముఖ్యమై, ఇతర ఆర్థిక కార్యకలాపాలు కుంటు పడతాయో, అప్పుడు నిజమైన సపద సృష్టి తగ్గిపోయి, ఊహాజనితమైన జూదపు సంపద ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. నిజమైన సంపద సృష్టి జరిపే ఉత్పాదక రంగంలోని సంపద ఫైనాన్స్ రంగానికి మళ్ళించబడి, ప్రజల జీవన ప్రమాణాలు, కొనుగోలు శక్తి మరింత అడుగంటుతాయి. అపర ధనికుల చేతుల్లోకి దేశ సంపదలో అధిక భాగం వచ్చి చేరుతుంది. దానితో ఆర్థిక వ్యవస్థ తల్లక్రిందులై, తీవ్రమైన సంక్షోభంలోకి ఆర్థిక వ్యవస్థ దిగజారిపోతుంది. మరొక పక్కన నిరుపయోగంగా పడిఉన్న సంపద, పెట్టుబడులుగా మారలేక పోవటంతో, పెట్టుబడుల విలువ పడిపోతుంది. అయినా, ఆర్థిక మాంద్యం కారణంగా, ఎంత తక్కువ వడ్డీరేటుకు అప్పులు లభించినా, ఎవరూ కొత్త ఉత్పాదక పెట్టుబడులు పెట్టటానికి ముందుకు రారు. ఊహాజనిత ఫైనాన్స్ పెట్టుబడులు, వ్యాపారాలతో, ఆర్థిక వ్యవస్థ డొల్లగా మారిపోయి, కుప్పకూలిపోయే పరిస్థితులు తలెత్తుతాయి. ఈ క్రమంలో బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు దివాలా తీసి కుప్పకూలిపోతాయి. సామాన్యప్రజలు దాచుకున్న కొద్దిపాటి డిపాజిట్లలోని డబ్బులుకూడా ఆవిరి అయిపోతాయి. వడ్డీరేట్లు మరింత తగ్గించి, బ్యాంకులను నిలబెట్టటానికి ప్రభుత్వం ప్రయత్నించినా, ఫలితం నామ మాత్రమే! కాని కొద్దోగొప్పో డబ్బు ఫిక్సెడ్ డిపాజిట్లలో దాచుకున్న పెన్షనర్లు, పేద వర్గాలునష్టపోతారు. ప్రభుత్వం ఈ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు దెబ్బతింటే దేశ ఆర్థిక వ్యవస్థకే నష్టం అనే సాకుతో, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వాటికి ధారపోసి నిలబెడుతుంది. చివరికి అపరధనికులు ఏమాత్రం నష్టం లేకుండా బయట పడతారుకాని, కోట్లాదిమంది సామాన్య ప్రజలు రోడ్డునపడతారు. 2009లో అమెరికా, యూరప్ లలో జరిగినదిదే!

(3వ భాగం వచ్చే ఆదివారం)

వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, సెల్ : 09848933545

ప్రశ్నోపనిషత్తు

అలేఖ్య

పురాణమిత్యేవ వసాధు సర్వయే' (పూర్వులు చెప్పినంత మాత్రాన దేనినీ గుడ్డిగా విశ్వసించనక్కరలేదు) అని బోధించిన ఘనత మనదేశ సంస్కృతిది. యస్తుర్యాణి భూతాన్యాత్మ స్యేవాను పశ్యతి - సర్వ భూతమే చాత్మవాం' (అన్ని భూతాలను తనలోనూ, తనను అన్ని భూతాలలోను చూసుకొమ్మని) చెప్ప గలిగిన గొప్ప ఆధ్యాత్మిక ఔన్నత్యం మనదేశానిది. ఇటువంటి గొప్ప సంస్కృతి, సంప్రదాయం పుట్టినిల్లైన మనదేశంలో మతం పేరుతో మళ్ళీ మారణహోమాలకు తెరలేవనుండటం చూస్తుంటే మనం మళ్ళీ రాతి యుగం నాటికాలానికి వెళ్ళిపోతున్నామేమో అనిపిస్తోంది.

మానవుని ఇతర జంతువుల నుంచి వేరు చేసేది 'ఆలోచన' మాత్రమే. ఆలోచనలకు మూలం ప్రశ్న. ప్రశ్నలేనిదే మానవుని మనుగడ లేదు. దేవుని ఉనికిని కూడా ప్రశ్నిస్తూ ఏకంగా 'ప్రశ్నోపనిషత్తు' అనే ప్రశ్నల వర్షాన్ని కురిపించారు మన పూర్వీకులు. ప్రశ్నల వరం పర వేదకాలం నుండి విస్తృతంగా, విస్తారంగా ఉంది. ప్రశ్నించటం భావస్వేచ్ఛకు ప్రతీక. కొన్ని వేల భావాలు సంఘర్షించినప్పుడు 'సత్యం' వెలుగులోకి వస్తుంది. ఇటువంటి ప్రశ్నలు ఉదయించినపుడు సామాన్య ప్రజానీకం, పామర జనం ఉలికి పాటుకు గురయ్యారంటే వారి అవివేకాన్ని కొంతమేర అర్థం చేసుకోవచ్చు. కాని అన్నీ, తెలిసి, వేద వేదాంగాలను అపుపోసన పట్టిన మతోద్ధారకులు, పీఠాది పతులు, సాధుపుంగవుల ఆవేశాలకు లోనవటం ఎంత వరకు సమంజసం. తమ వేద విజ్ఞాన్ని మొత్తం సమాజహితానికి ఉపయోగించాల్సిన వీరే ఆవేశంలో సమాజంలో అలజడులు సృష్టించాలని చూడటం ఎంత వరకు సబబు.

దేవాలయాలు రెండు రకాలు, ఒకటి స్వయంభూ దేవాలయాలు, రెండు ప్రతిష్ఠాపన దేవాలయాలు. భగవంతుడు ఏదోకారణం చేతో లేక ఏ భక్తుడి కోసమో తానే స్వయంగా వెలసిన చోట దేవాలయాన్ని నిర్మిస్తే అది స్వయంభూదేవాలయం అలా కాకుండా భక్తులే దేవుని ప్రతిమలు చెక్కించి, దేవాలయాన్ని నిర్మిస్తే వాటిని ప్రతిష్ఠాపన దేవాలయాలంటారు. అదే తరహాలో మఠాలు, పీఠాలు కూడా కొన్ని భగవత్‌స్వరూపులైన ఆది శంకరుడు, రామానుజాచార్యుడు, మధ్వాచార్యుడు వంటి వారు ప్రతిష్ఠించినవైతే, మరికొన్ని ఈ మధ్యకాలంలో తమకు తామే పీఠాధీపతులుగా, మఠాధిపతులుగా పేర్కొంటు వాటిని తామే ప్రతిష్ఠించినవి కొన్ని. మొదటిరకం మఠాలకు అధిపతులైన మఠాధిపతులకు ఎన్నో కట్టుబాట్లుంటాయి. వీరు సామాన్య జనంలోకి రావటమే కాదు. వీరిని భగవత్‌స్వరూపులుగా, భారతీయ ఆధ్యాత్మిక సంపదకు వారసులుగా ప్రజలు పరిగ ణిస్తూ పూజిస్తున్నారు. ఇక రెండవ రకం వారు నియమాలను, కట్టుబాట్లను తమకు అనుకూలంగా మార్చుకుంటూ, ఏదో ఒక రకంగా ప్రజలలో తమ పేరు మోగుతూ ఉండాలని నిత్యం ఏదో ఒక వివాదంలో తలదూరుస్తూ సమాజంలో అలజడులుకు కారణమౌతున్నారు.

రెండోరకం, మఠాధిపతులు, పీఠాధీపతులనే వారు సర్వ సంగ పరిత్యాగులు, సాధువులు, సన్యాసుల మంటూనే, ఇటువంటి వారు నిత్యం ఏదోఒక టి.వి.ఛానల్లో కనపడాలనే తాపత్రయపడటం ఎందుకో అర్థంకాదు. సినిమా నటుల్లా, రాజకీయ నాయకుల్లా వీరికి కూడా ప్రచార యావ ఎక్కువ. అదేమని ఓ స్వామిజీ, ప్రశ్నిస్తే, ఆ భగవంతునికే ప్రచారం అవసరం అవుతుంటే ఈ రోజుల్లో, మేమెంత అని నవ్వేశారు. సన్యాసులని చెప్పుకునే వీరు సినిమా ఫంక్షన్లలో, మల్టీప్లెక్సులు, షాపింగ్ మాల్స్ ప్రారంభాలకు విచ్చేయటం ఎంతవరకు సబబు. ఒకడుగు ముందుకేసి కొంతమంది స్వామీజీల పేరుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు కూడా జరగటం శోచనీయం. వీరు ఏదో ఒక రాజకీయ పార్టీని భుజాన వేసుకుని మోయటం కూడా వివాదాలకు దారితీస్తున్నాయి.

ఈ మధ్య ఈ రెండోరకం పీఠాధిపతులు మతోద్ధారకులం అని చెప్పుకుంటూ ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలోనుంచి చూపిస్తూ, అమాయక ప్రజలను రెచ్చగొడుతూ మతమౌఢ్యాన్ని పెంచి పోషిస్తున్నారు. మతాల గురించి, దేవుళ్ళ గురించి దేశంలో ఏ మూల వివాదం రేగినా, వీరొక్కరే మతోద్ధారకుల్లా టీవి ఛానళ్ళ ముందు తయారైపోతారు. అసలు వీరి ఉద్దేశ్యంలో ఎవరో ఒక అనామకుడు, ఓ మూర్ఖుడు మతం గురించి, దేవుడి గురించి వ్యాఖ్యానం చేసినంత మాత్రానే ఆ మతం దెబ్బతినేంత హీనస్థితిలో ఏ మతం లేదనే విషయాన్ని గ్రహించాలి. మతాన్ని ప్రశ్నించరాదనే, ఛాందసవాదాన్ని ప్రజలలో వీరు పెంచి పోషిస్తున్నారు. వీరిని గుడ్డిగా నమ్ముతూ, వీరినే అనుసరిస్తూ, వీరి వీరభక్తులని చెప్పుకునే వీధిగుండాలు సృష్టించే అల్లకల్లోలం అంతాఇంతా కాదు.

ప్రతి మతంలో అంధ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, అసమానతలు, వివక్షతలు ఉన్నాయనేది నిర్వివాదాంశం వీటిని ప్రశ్నిస్తూ, ఇటువంటి వాటిని మతంనుండి పారద్రోలుతూ మతాన్ని సంస్కరించేదిశగా అందరం ప్రయత్నించాలి. ఇటువంటి సంస్కరణలకు ఏనాడో దయానంద సరస్వతి, వివేకానందుల వంటి వారు తెరతీసారు. వీరికంటే ఇప్పుడున్న పీఠాధిపతులు గొప్పవారు కాదు. పురాణాలను చదివినప్పుడు చరిత్రలో ఎంతోమంది ఎన్నో అభ్యంతరాలను లేవదీశారు. యోగివేమన మతం పేరిట జరుగుతున్న అసమానతలను, మూఢనమ్మకాలను తూర్పారబట్టాడు. పోతులూరి వీరబ్రహ్మం మతం పేరిట జరిగే మారణ హోమాన్ని ఆనాడే ఖండించారు. మరి వీరి కన్నా మేధావులా మన పీఠాధిపతులు.

పురాణాలపై విమర్శలు మనకు కొత్తకాదు. దేవుడి ఉనికిని ప్రశ్నించటం మన సంస్కృతిలో భాగమే. ఎందరో భక్తులు దేవుడిని నిందిస్తూ కీర్తనలు పాడిన సందర్భాలున్నాయి. మరి అవి విన్నప్పుడు ఆ దేవుడికి లేని నొప్పి వీరికెందుకో. అసలు దేవుడు ఒక మనిషి కాదు, ఒక అనుభూతి అనే విషయం వీరికెప్పుడు అవగమౌతుందో ప్రేమ, దయ, జాలి, క్షమ వంటి దైవదత్తమైన గుణాల దైవత్వమనేది కూడా ఒక గొప్ప మానవీయ గుణం. దాన్ని అందిపుచ్చుకున్న నాడు ప్రతి ఒక్కరూ దేవుళ్ళే అవుతారు. ఆ నిజాన్ని గ్రహించలేని మన పెట్టుడు పీఠాధీపతులు రాళ్ళలోనే దేవుడ్ని చూస్తూ తమ అజ్ఞానానికి పదును పెడుతూ ఉంటారు.

ఈ మధ్య ఈ పీఠాధిపతులు ఎక్కువై, వీరి మధ్య పోటీ పెరిగిపోయి, ప్రజల్లో తమ ప్రాపకం పెంచుకోవటానికి సొంత టీవీ ఛానళ్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని టీవీ ఛానళ్లు తమ రేటింగులు పెంచుకోవటానికి 24 గంటల ప్రసారానికి కావలసిన ముడిసరుకును ఏర్పాటు చేసుకోవటానికి, రెండుమూడు సొంత ఛానళ్లతో కార్యక్రమాల కోసం వీరిని పెంచిపోషిస్తున్నారు. ఒక టీవీ ఛానల్ అఖండ కార్తీక సమారాధన అంటే, మరో ఛానల్లో దసరా ఉత్సవాలంటూ ప్రసారం చేసే కార్యక్రమాలకు మన పీఠాధిపతులే ముఖ్య అతిథులు. కొంత మంది స్వాములు శోభాయాత్రలంటూ భక్తుల మెడలు వంచి ఏనుగు అంబారీలు, గుర్రపు బగ్గీలలో ఊరేగటం వీరికే చెల్లింది. ఒకస్వామిజీ తనను దర్శించటానికి, కొలవటానికి, అనుగ్రహం పొందటానికి వివిధ రకాల రేట్లు పెట్టడం, వీరికి డబ్బు మీద ఉన్న అత్యాశను తెలియజేస్తుంది. అవునులే మన దేశంలో దేవుడ్ని దర్శించటానిక్కూడా రేట్లు నిర్ణయించినప్పుడు వీరొక లెక్కా, ఒక స్వామిజీ ఇక్కడ కాషాయ వస్త్రాలు కట్టుకుని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ, విదేశాల్లో టీ షర్టులు, పొట్టి నిక్కర్లు వేసుకుని సముద్రాలలో జలకాలాడటం చూస్తుంటే వీరికింకా ఐహిక భోగాలు మీద వాంఛ తగ్గలేదనిపిస్తోంది.

ప్రపంచంలో ఏమతంలో దేవుడ్ని దర్శించటానికి రేట్లు లేవు. మరి ఇక్కడెందుకు శ్రీఘ్ర దర్శనం, లఘు దర్శనం అంటూ రకరకాల రుసుములు వసూలు చేస్తున్నారు. ప్రపంచంలో ఏ మతంలోనైనా తను సంపాదించిన దానిలో కొంతపరుల కొరకు వినియోగించమని పేర్కొనబడి ఉంది. మరిఇక్కడ ఎందుకు అది ఆచరణలో లేదు. ప్రపంచంలో మార్గాలు లేవు. ఉన్నదల్లా ఒక్కటే తమను తాము సమర్పిం చుకోవటం. మరి ఇక్కెందుకు అభిషేకాలంటూ, సహస్రనా మాలంటూ, హోమాలంటూ అర్థంపర్థంలేని పద్ధతులను అమాయక ప్రజలపై రుద్దుతారు. వీటన్నిటికి ఎవడో ఒక అనామకుడు, అజ్ఞాని, మూర్ఖుడు అన్న నాలుగు మాటలను పట్టుకుని మన మతానికేదో జరగరాని ఘోరం జరిగిపోయినట్టు జనాన్ని పోగేసి దాడులకు ప్రేరేపించటం ఓ సాధువు చెయ్యాల్సిన పనేనా. మతం పేరుతో సమాజంలో అలజడులు సృష్టించటం ఓసర్వసంగ పరిత్యాగి చెయ్యవలసిన పనియేనా. దేవుడి మీద, మతం మీద వివాదస్పద వాఖ్యలు చేసిన వారికంటే ముందు ఇటువంటి మతోన్మాదులను దేశ బహిష్కరణ చెయ్యాలి.

ఇప్పటికే కొంతమంది మఠాధీపతులు రాసలీలలో చిక్కుకోవటం, ఇంకొంత మంది లైంగిక దాడుల్లో నేరస్తులుగా కటకటాలు లెక్కపెట్టడం, మరికొంత మంది అపారమైన ఆస్తి పాస్తులు కూడ బెట్టడం, హత్య నేరాల్లో ఇరుక్కోవటం వంటి సంఘటనలతో మన మతం ఏనాడో చచ్చిపోయింది. దాన్ని పునర్జీవింప చెయ్యటానికి సర్వమత సహనంతో, సర్వమానవ సౌభాగ్యంతో క్షమతో, ప్రేమతో ముందుకుసాగాలి తప్ప, సై అంటే సై అంటూ తొడలు చరిస్తే వీధిరౌడీలకు వీరికి ఏ తేడా ఉందని ప్రజలు భావించే ప్రమాదం ఉంది.

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం 13 జనవరి 2019

'రావమ్మా మహాలక్ష్మి రావమ్మా....నీ కోవెల ఈ ఇల్లు...కొలువై ఉందువుగాని....కడివెడు నీళ్ళు కళ్ళాపి జల్లీ గొబ్బిళ్ళో గొబ్బిళ్ళు....కావెడు పసుపు గడపకు పూసి గొబ్బిళ్ళో గొబ్బిళ్ళు.....' అంటూ దేవులపల్లివారి గీతం సంక్రాంతి శోభను కళ్లకు కట్టినట్లు చూపిస్తుంటే.....ఆ దృశ్యాన్ని, ఆ ఆనంద పారవశ్యాన్ని కచ్చితంగా పల్లెల్లోనే చూడాలి....అక్కడే ఆస్వాదించాలి....గుండెనిండా ఆ సంక్రాంతి సోయగాల్ని పదిలపర్చుకోవాలి.....అసలు సంక్రాంతి వస్తున్నదంటేనే నెలరోజుల ముందునుంచీ గ్రామీణ జనజీవితంలో సందడి మొదలౌతుంది.

మార్గశిరమాసంలో ధనుర్మాసం ప్రారంభించగానే దాదాపుగా 'సంక్రాంతి' సోయగాలలో కదలిక మొదలవుతుందని చెప్పాలి. ఇల్లిల్లూ దులుపుకోవడాలు, సున్నాలు (ఇప్పుడు పెయింట్స్) వేసుకోవడాలు.....'పండగొస్తోంది కదా మరి!'....అంటూ బోల్డు పనులున్నాయన్నట్లు హడావిడిపడిపోవడాలూ.....ఇంక పదిరోజుల్లో పండుగ వస్తుందనగా....ఏ ఇంట్లో చూసినా.....వారి స్తోమతకు తగ్గట్టు పిండి వంటల ఘుమఘుమలూ, అరిశలపాకాల జిగిబిగిలూ..... ఆ పల్లెల్లోనే చూడాలి.....అక్కడే అనుభవించి ఆస్వాదించాలి.....





కళా, సంస్కృతుల సమ్మేళనం

సంక్రాంతి





సంక్రాంతి అంటే....

సంక్రాంతి అనగానే 'పెద్దపండుగ' వస్తోందన్న భావన అందరిలోనూ ఉంటుంది. కనీసం ఈ పెద్దపండుగకైనా ఎక్కడెక్కడి వారూ వచ్చి సరదాగా కలుసుకోవాలని తహతహలాడతారు. భోగి నుంచి ముక్కనుమ వరకూ నాలుగురోజులు జరుపుకునే ఈ పండక్కి ఎలాగో వీలు చూసుకుని మరీ సొంత ఊళ్లకు వస్తారు. నలుగురూ కలుసుకుని ముచ్చట్లతో సందడి చేసుకుంటారు. ఇప్పటికీ చాలా మంది ఈ నాలుగురోజులూ సెలవు పెట్టుకుని మరీ సొంతూళ్లకు పరుగెడుతున్నారు. వాస్తవానికి మన పండుగలన్నీ ఏదో రూపేణా ప్రకృతితో ముడిపడి ఉన్నవే! అంతర్లీనంగా అంతోఇంతో శాస్త్రీయ దృక్పథం కలిగి ఉన్నవే. దానితోబాటుగా మానవతా దృక్పథం, ప్రకృతితో మమేకమైన జీవన విధానం మన పండుగల్లో ఇమిడి ఉన్నాయంటే ఆశ్చర్యపోనక్కరలేదు. సూర్యుడు 30 రోజులకొకసారి 12 రాశులలోనూ సంచరిస్తూంటాడంటోంది ఖగోళశాస్త్రం. అలా సంచరించే సమయాన, సూర్యుడు ధనూరాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణం అంటారు. ఇది పవిత్రమైన కాలంగా భావిస్తారు. ఎందుకంటే మనకున్న రెండు ఆయనాల్లో, సూర్యుడు దక్షిణాయణ కాలం ముగించుకుని, ఉత్తరాయణ కాలంలోకి ప్రవేశిస్తాడు. ఇది సంక్రాంతి రోజుతోనే ప్రారంభమౌతుంది. ఉత్తరాయణం పుణ్యకాలం అని మన పెద్దల నమ్మకం. మహా భారత యుద్ధంలో భీష్ముడు అంపశయ్యపైనే ఉండి ఈ ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చిన తరువాతనే పరమపదించాడన్నది మనకు తెలిసిందే. ఈ ఉత్తరాయణ ప్రారంభం నుంచి సూర్యుడు తూర్పున ఉత్తర దిశగా ఉదయిస్తాడు. దక్షిణాయంలో తూర్పున సూర్యుడు దక్షిణ దిక్కుగా ఉదయిస్తాడు. సూర్యుడు ఉత్తర దిక్కున ఉదయించి, ఆ దిశగా ప్రయాణం (ఆయనం) సాగిస్తాడు కనుక ఈ ఆరు నెలల కాలాన్ని ఉత్తరాయణంగా పిలుస్తారు.

సంక్రాంతి పండుగ నాటికి ఒకటో అరో మినహా దాదాపుగా పొలాలన్నీ కుప్పనూర్పులు అయిపోయి, ప్రతి రైతు ఇల్లు ధన ధాన్యాలతో తులతూగుతుంటుంది. రైతుకు దాదాపుగా ఓ ఐదు నెలలపాటు, అంటే ఏరువాక వచ్చే వరకూ, మెట్టప్రాంతాలోనూ, ఇతరత్రా అపరాల వంటి చిరు సాగు పనులు మినహా విశ్రాంతి అన్నమాట. అయితే రైతుకి ఆటుపోట్లు అప్పుడూఉన్నవే, ఇప్పుడూ ఉన్నవే. కానీ సమస్యలు ఎన్ని ఉన్నా పెద్దపండుగ జరుపుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం చెయ్యరనేది నిజం! ఈ పండుగకున్న మరో ప్రత్యేకత ఏమిటంటే రైతు ఇంటి ముందు దూలానికి ఒక ధాన్యం పురి వేలాడదీస్తారు. ఆ పురిలో ఉన్న ధాన్యగింజలు తినడానికి పాతిక ముప్ఫై పిచ్చుకలు కిచకిచలాడుతూ, ధాన్యం తింటూ చేసే ధ్వనులు లయబద్ధంగా, సందడిగా, చూడముచ్చటగా ఉంటుంది. ఇక చంటిపిల్లలున్న ఇల్లయితే ఆ పిచ్చుకలను చూస్తూ గంతులేస్తూ వారు చేసే అల్లరి ఎంత హాయిగా ఉంటుందో. ప్రత్యేకంగా ఈ పండుగ పేరు చెప్పి ప్రతి ఇల్లు కొత్త, పాత అల్లుళ్లతో సందడిగానే ఉంటుంది. భోగి రోజు చిన్న పిల్లలకి భోగిపళ్లు (రేగిపళ్లు) పొయ్యడం ఒక ఆనవాయితీ. ఈ కాలంలోనే రేగిపళు కాసేవి. ఈ కాలంలోనే అంటే హేమంత రుతువులోనే చేమంతులు కూడా పూసేది. ఇప్పుడు హైబ్రిడ్ యుగంలో చామంతులు దాదాపుగా ఏడాది పొడుగునా దొరుకుతున్నాయనుకోండి. ఈ సంక్రాంతి నాలుగు రోజులూ కాకపోయినా, కనీసం రెండురోజులు అంటే భోగి, సంక్రాంతి రెండు రోజులూ చాలామంది ఇళ్లల్లో లేదు అనకుండా ముష్టివారికి భిక్షం వేయడం కూడాకొన్ని ప్రాంతాలలో ఆనవాయితీగా వస్తూంది.



కనుమ ముచ్చట్లు

నిజానికి ఇది రైతులు ఆనందంగా తమ వ్యవసాయ నేస్తాలైన పశువులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సందర్భం లాంటిది. కనుమ అంటే పశువు అని అర్థం. అంటే ప్రధానంగా పశువులను ఆరాధించే రోజు. పశువులు ఉంచే చోటును బాగా శుభ్రం చేసి, వాటి కొమ్ములకి పసుపు రాసి, అందమైన బంతిపూలతో అలంకరించి వాటిని పూజిస్తారు. అయితే ఈ ఆధునిక కాలంలో మాత్రం పశువులకు ఇప్పుడు గిరాకీ తగ్గింది. కారణం వాటి స్థానంలో ట్రాక్టరు, కుప్పనూర్పిడి యంత్రాలు రావడమే. అయినా రైతుకు పశువు ఎప్పటికీ నేస్తమే. ఈ పశువులను పూజించే ఆచారం ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రీతిలో ఉంటుంది. పశువుల కొట్టాలో పొంగలి వండి వాటికి పెట్టడం, పసుపు కుంకుమలు కలిపి దానిని పొలాల్లో జల్లడం....ఇలా ఆయా ప్రాంతాల ఆచారాలు సాగుతున్నాయి. ఏదిఏమైనా కనుమరోజు రైతు తన వ్యవసాయ నేస్తాలైన పశువులను ఆరాధించడం అనేది దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఆచారంగా వస్తున్నది.

ఈ కనుమ రోజునే కొన్ని ప్రాంతాలలో కన్నెపిల్లలూ, పెళ్లయిన వారూ బొమ్మల కొలువు నోము నోస్తుంటారు. ఇది తొమ్మిదేళ్లపాటు గౌరీదేవిని కొలిచే నోము. కనుమ నుంచి తొమ్మిదిరోజుల పాటు ఎవరో ఒకరి ఇంటిలో ఈ నోము నోస్తారు. అలా ఒక ఏడాది ఒకరి ఇంట్లో చొప్పున ఈ పూజ జరుగుతుంది. తొమ్మిదేళ్లూ నోము నోచిన వాళ్లు చివరి సంవత్సరం ఉద్యాపన చేస్తారు. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది ఏమంటే ఈ నోము నోచే తొలిరోజున, ఆ నోమునోచే వాళ్లంతా స్వయంపాకం, దక్షిణతో మేళతాళాలతో ఊరేగింపుగా కుమ్మరి ఇంటికి వెళ్లి, సంభావనతో కుమ్మరిని గౌరవించి గౌరీదేవి బొమ్మలను తెచ్చుకుంటారు. ఎన్ని సంవత్సరాలు పట్టాల్సి ఉంటే అన్ని బొమ్మలు తెచ్చుకుంటారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే గ్రామంలో ఉన్న చేతి వృత్తుల వారిని గౌరవించడం. ఏరువాకరోజున రైతులు కమ్మరిని గౌరవిస్తారు. అలాగే ఆయా ప్రాంతాలవారి ఆచారం లేదా సంప్రదాయం మేరకు ఈ కనుమరోజు బొమ్మలకొలువు పెడతారు. అనేక రకాల బొమ్మలు తెచ్చి ప్రత్యేకంగా ఒక వేదికను అలంకరించి, అందులో వ్యవసాయం, ఆధునిక యంత్రాలకు సంబంధించిన అనేక బొమ్మలను పెట్టి వేడుక చేస్తారు. ఇది ప్రత్యేకించి చిన్న పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లల వేడుక.





పొంగళ్ళ సందడి

సాధారణంగా సంక్రాంతి అంటే పెద్ద పండుగరోజు చాలా చోట్ల పొంగలి వండి దేవుడికి నివేదన సమర్పించడం పరిపాటి. అలాగే కొత్త బియ్యంతో పాయసం వండి నివేదించడం కూడా ఆనవాయితీ. ఇక కొత్తబట్టలు కట్టుకోవడం, పతంగులు ఎగురవేయడం ఇవన్నీ మామూలే. ఎవరికి ఉన్నంతలో వారు ఈ మూడురోజులూ సందడిగా సంతోషంగా ఆస్వాదిస్తారు. ఎక్కడెక్కడివారూ వచ్చి కలుసుకునే అందమైన, ఆకర్షణీయమైన సందర్భం కలిగించే ఈ పండుగ ఒక్కసారి, బంధుత్వాలనూ, అనురాగాలను గుర్తుచేసి ఆత్మీయతను పంచుకునేట్టు చేస్తుంది.

హరిదాసులూ... కళారూపాలు



సంక్రాంతి పండుగ నెల్లాళ్లూ ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చి దిద్దడం, వాటి మధ్యలో గొబ్బెమ్మలు అలంకరించడం ఒక ఎత్తయితే, ఈ నెలరోజులూ ప్రతి గ్రామంలోనూ హరిదాసులు సందడి చేస్తుంటారు. ఈ హరిదాసుల తలపై పెట్టుకున్న గిన్నెలో దోసిళ్లతో బియ్యం వెయ్యడమంటే చిన్న పిల్లలకి చాలా సరదా. అలాగే ప్రతి వీధిలోనూ సన్నాయి మేళంతో గంగిరెద్దుల విన్యాసాలు, ఇంకా కొమ్ముదాసరులు, జంగమదేవరలు, బుడబుక్కలవారూ తదితర జానపద కళాకారులు ఉత్తేజ పరుస్తుంటారు. ఇప్పుడైతే వీరిని కేవలం భిక్షాటనకొస్తున్న వారిలాగ ఈ తరం వారు చూస్తున్నారు కానీ, వాస్తవానికి వీరు జానపద కళాకారులు. ఏ రకమైన ప్రచార సాధనాలూ లేని ఆ రోజుల్లో రామాయణ, భారత, భాగవతాలు, స్త్రీల నోముల కథలూ, వ్రతకథలూ వగైరా ప్రజాబాహుళ్యంలోకి విస్తృతంగా ప్రచారం చేసింది ఈ కళాకారులే. ఈ పండుగ నాలుగు రోజులూ ఈ కళాకారులకు తృణమోఫణమో ఇచ్చి ఆదుకోవడం కద్దు. అలాగే ఈ కళారూపాలతో బాటుగా కొన్ని ప్రాంతాలలో సాహసోపేతమైన దొమ్మరసాని విన్యాసాలు వళ్లు గగుర్పొడుస్తాయి. దాదాపు నలభై ఏభై అడుగుల పొడవున్న గడకర్రచివరన అమర్చిన చిన్న కొమ్ముపై బొడ్డును ఆన్చి దొమ్మరసాని కళాకారిణి చేతులూ, కాళ్లూ జాపి గిరగిరా తిరగడం నిజంగా గొప్ప విన్యాసమే. ఇలాంటి అనేక కళారూపాలు, ఆ జానపద కళాకారులు ఈ పండుగ నాలుగు రోజులూ ఊరూరా ప్రదర్శిస్తుంటారు. ఈ పండుగ తరువాత మళ్లీ దసరా ఉత్సవాలలోనే ఈ జానపద కళాకారులు ఇంత విస్తతంగా ప్రదర్శనలిచ్చేది. నిజానికి మన జనజీవితంలో ఈ జానపద కళారూపాలు ఒక భాగమై ఉన్నాయి. మారిన కాలమాన పరిస్థితులు, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఈ కళలు చాలామటుకు అంతరించి పోతున్నాయి.

ఈ సంక్రాంతి పండుగకు మరో ప్రత్యేకత ఉంది. అది ఆటపాటల వేడుకలో భాగమైనవి ఎడ్ల పందాలు, బరువు లాగుడు పందాలు, కోడి పందాలు, కబడ్డీ క్రీడలూ వగైరా. కొన్ని చోట్ల గ్రామ పంచాయితీల తరపునే ఎడ్ల పందాలు, బరువు లాగుడు పందాలు ఏర్పాటు చేస్తుంటారు. ఊళ్లో పెత్తందార్లనబడే పెద్ద రైతులు ఈ పందాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇటీవల కాలంలో కోడి పందాలపై కోర్టు నిషేధాజ్ఞలు జారీచేసిన విషయం విధితమే. అయినా ఏమీ ఆగడం లేదన్నదీ అందరికీ తెలిసిన విషయమే.

భోగి మంటల సంబరాలు



సంక్రాంతి పండుగ వస్తున్నదంటే గ్రామాల్లో నెలరోజుల ముందునుంచీ ఆవుపేడతో చిన్న అరచేయంత పిడకలు వేసి సిద్ధంగా ఉంచుకుంటారు. భోగిరోజున తెల్లవారు జామునే వీధి మొగలో (నాలుగురోడ్ల కూడలి)లో చలి మంట వేస్తారు. ముందురోజు ఆ చుట్టుప్రక్కల ఇళ్లల్లో విరిగిపోయిన గుమ్మాలు, వగైరాలు తెలిసో, తెలియకుండానో తెచ్చేసి ఈ భోగిమంటలో వేసెయ్యడం ఒక సరదా. సిద్ధం చేసిన పిడకలను ఒక దండలా గుచ్చి ఈ మంటలో వేసెయ్యడం చిన్న పిల్లలకి, ముఖ్యంగా ఆడపిల్లలకి చాలా సంబరం. ఈ మంటని సాధారణంగా సంక్రాంతి రోజు వరకూ వెలిగేలా చూస్తారు. ఇప్పుడు మారిన కాలం, మారుతున్న తరం కారణంగా ఒకపూటకే సరిపెడుతున్నారు. అయితే నగరాల్లో కూడా ఈ భోగిమంటను వేస్తుండడం విశేషం. కొన్ని ప్రాంతాల్లో ఈ చిన్న పిడకల మంటతో తయారు చేసిన పాయసం చేసి తినడం కూడా ఆనవాయితీ.

ముగ్గుల్లో......గొబ్బిళ్ళు

మార్గశిర మాసంలో ధనుర్మాసం ప్రారంభం కాగానే సంక్రాంతి నెలపట్టడం అంటారు. ఆరోజు నుంచి ప్రతి ఇంటిముందూ పోటీలు పడి మరీ, తెల్లవారు జామునే లేచి ముగ్గులు వెయ్యడం ఆడపిల్లలకు పెద్ద సరదా అయిన ఆచారం. ఇందుకోసం దాచిపెట్టుకున్న ముగ్గుల పుస్తకాలు వెలికి తీసిమరీ ముగ్గులు వేస్తారు. అప్పుడు రోడ్డుమీదనడవాలంటే కొంచెం ఇబ్బంది పడాలి....ఎక్కడ ముగ్గుతొక్కాల్సి వస్తుందో, తొక్కితే ఎవరేమనుకుంటారోనని. అయితే ఇంతగా ముగ్గులు పెట్టడం అనే ఆచారం వెనుక ఒక శాస్త్రీయ దృక్పథం కూడా ఉంది. వర్షరుతువు తరువాత వచ్చేది, శరదృతువు. దాని తరువాత వచ్చేది హేమంత రుతువు. దాదాపుగా ఈమూడు రుతువులూ చల్లగా ఉండే వాతావరణమే. అంటే క్రిమికీటకాలు బాగా ప్రజ్వరిల్లే సమయం ఇది. వాటి నిర్మూలనకి ఆరోజుల్లో బ్లీచింగ్ పౌడర్లు లేవు. వాటికి సరైన విరుగుడు రాతి ముగ్గే. అది చాలా ఘాటుగా ఉంటుంది. అందుకనే నాటి నుంచి నేటి వరకు ఇంటిముందు కళ్ళాపి జల్లి ముగ్గు పెట్టుకోవడం ఆచారంగానే వస్తున్నది. ఇంతే కాకుండా ఈ పండుగ మూడు రోజులూ ఇంటిముందు రంగవల్లులు తీర్చి దిద్ది వాటి మధ్యలో ఆవుపేడతో గొబ్బెమ్మలను పెట్టి, వాటిని బంతిపూలతో అలంకరిస్తారు.



రథం ముగ్గుతో ముగింపు

పెద్దపండుగ చివరి రోజైన ముక్కనుమ కొన్ని ప్రాంతాలలో గ్రామదేవతల ఆరాధనకు ఆచారంగా వస్తున్నది. ఆరోజు పులగం (మునగాకుతో కలిపి అన్నం)వండి గ్రామ దేవతలకు నైవేద్యం పెడతారు. ఆ పులగాన్ని ప్రత్యేకించి తమ ఇంటి రజక (చాకలి) ముత్తయిదువకి ఇచ్చి, కొత్త చీరతో గౌరవిస్తారు. బ్రాహ్మణేతరులు ఈ ముక్కనుమరోజు ముక్క కొరకాలన్నది ఆచారంగా వస్తున్నది కూడా! ఈ ముక్కనుమరోజుతో ఇళ్ల ముందు పోటీలు పడి వేసే రంగవల్లులకీ ముగింపు పలుకుతారు. ఆరోజు తెల్లవారు జామున లేచి ప్రతి ఇంటి ముందూ రథం ముగ్గు వేస్తారు. ఆ రథం లాగే తాడు రెండుమూడిళ్ల వరకూ వేస్తారు. అంటే సంక్రాంతి లక్ష్మిని రథంలో సాగనంపుతారన్నమాట! ఈ ముక్కనుమరోజున ఆడపడుచులు, అత్తారింటికి వచ్చిన అల్లుళ్లు, లేదా ఇతర బంధువులు ప్రయాణం చెయ్యరు. ఆ ముందురోజు కనుమనాడు కానీ, తరువాతరోజు కానీ తమతమ ఊళ్లకి వెళతారు. అలా ఈ పెద్దపండుగ సంబరాలు, సందళ్ళు చాలారోజులు వారివారి గుండెల్లో పదిలంగా ఉండిపోతాయనడంలో సందేహం లేదు. 'క్రాంతి' అంటే వెలుగు. సం-క్రాంతి అంటే కొత్త వెలుగు.....ఈ కొత్త వెలుగును గుండెల్లో నింపుకుని, కొండంత ఉత్సాహాన్ని తెచ్చుకుని, బంధాలనీ, అనుబంధాలనీ, అనురాగాల్ని ఒకసారి తడుముకుని.....కాంక్రీట్ జంగిల్‌లో యాంత్రిక జీవితాలనుంచి ఓ తొంభై ఆరు గంటలు, కనీసం డెబ్భైరెండు గంటలు మనల్నిమనం మరచిపోయి, మన మూలాలైన పల్లెలకు పోదాం....మట్టి వాసనల్ని మనసారా ఆస్వాదించి, పుడమి తల్లికి నమస్కరిద్దాం.



-సర్వజిత్

నేను - సుడిగుండం (నవల) 14

పి.చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

మోహన్ కి అటవీ శాఖ అంటే ఇష్టం. అతను చదువుకుంటానికి ఢిల్లీ వెళ్లాడు. ఆ తర్వాత నాలానే ఆరు నెలలకు ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత ఇంటికి రావటం బాగా తగ్గిపోయింది. ఎప్పుడన్నా వచ్చినా ఓ పూట మాత్రం వుండేవాడు. పనులున్నాయని వెళ్లిపోయేవాడు.

మొదట్లో డబ్బులు పంపమని ఉత్తరాలు రాసాడు. తర్వాత అవీ లేవు. ఢిల్లీ వెళ్లాక అతనిలో పూర్తిగా మార్పు వచ్చింది. అక్కడ స్టూడెంట్ యూనియన్స్ తో పరిచయం అయింది. అతనిలో ఒక్కసారిగా ఊహించనంత మార్పు వచ్చింది..

రాడికల్ సంఘంలో నాయకత్వం స్థానంలోకి వచ్చాడు. అప్పటిదాకా తెలుగు మాత్రమే తెలుసు. ఢిల్లీ వెళ్లాక నాలుగయిదు భాషలు నేర్చుకున్నాడు. తెలుగువారి నుండి, ఇతర రాష్ట్రాల వారికి షెల్టర్ ఇస్తుండేవాడు. అండర్ గ్రౌండ్ పత్రికను నడిపేవాడు. ఆ పత్రిక బాధ్యతలన్నీ మోహన్.. అప్పుడప్పుడు సలహాలు, సూచనలు నాయకత్వం నుండి వచ్చేవి.

మోహన్ పేరు ఎవరికీ తెలియదు. అలాంటి ఉద్యమాల్లో అన్నీ పెట్టుకున్న పేర్లు వుంటాయి. సొంత అస్తిత్వం కోసం ఎవరూ పాకులాడరు. అతను ఆ పత్రికను బయటకు ఎలా పంపేవాడో తెలియదు. చాలాకాలం అలాంటి పత్రిక వుందని తెలియదు. ఓ ఎన్ కౌంటర్లో పోలీసులకి ఆ ప్రతులు దొరికాయి.

అప్పటి నుంచి నిఘా మొదలయింది. అది ఎక్కడ నుండి ప్రచురిస్తున్నారు. ఆ పత్రిక వెనక ఎవరున్నారు అని.

కేంద్ర నాయకత్వం, అలాగే బహిరంగంగా పనిచేసే వారు ఢిల్లీ వెళ్లినప్పుడు మోహన్ ని కలుసుకునే వారు. మోహన్ ని చూస్తే భగత్ సింగ్ గుర్తొచ్చేవాడు..

ఇరవై మూడు సంవత్సరాల వయసులో భగత్ సింగ్ ఉరికంబం ఎక్కాడు. అంత చిన్నవయసులో భగత్ సింగ్ సాధించిన పరిణతి ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఓసారి ఇంటికి వచ్చినప్పుడు నాన్న అడిగాడు "మోహన్ నువ్వు ఏం చదువుతున్నావో, ఏం తింటున్నావో మాకు తెలియటం లేదు. నిన్ను చూస్తుంటే కంటి నిండా నువ్వు నిద్ర కూడా పోతున్నట్లు అనిపించటం లేదు. చదువు అవసరమే. ఆరోగ్యం చెడగొట్టుకునే అంతకాదు. నాకయితే నువ్వు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి లక్షలు సంపాదించాలని లేదు. నువ్వు ఎప్పుడు వస్తావో తెలియదు. ఎప్పుడు వెళ్తావో తెలియదు" అన్నాడంట.

"నేను చదువుకుంటుంది ఢిల్లీలో నాన్నా... నాకు ఇదివరకటిలా ఇంటికి రావటం కుదరదు. వీలున్నప్పుడు వస్తుంటాను" అన్నాడు మోహన్,

"అదేంటిరా కనీసం ఇదన్నా చెప్పు. ఇంకా ఎంతకాలం ఈ చదువులుంటాయి"

"అది ఇప్పుడు చెప్పటం కష్టం నాన్నా

"అయితే నువ్వు చదువు మానేయ్యరా. నా కళ్ల ముందు నువ్వుండాలి. మనకి ఉద్యోగాలు వద్దు. మనకున్న భూమి మనకు చాలు. వ్యవసాయం చేసుకుని బతుకుదాం"

"అది కుదరదు నాన్నా" అన్నాడు మోహన్.

"అలా అంటే ఎలారా?"

"వ్యవసాయం చేయాలనుకుంటే నేను ఢిల్లీ వెళ్లేవాడిని కాదు. ఓసారి చదవటం మొదలు పెట్టాక మధ్యలో మానేయటం కుదరదు. నువ్వన్నట్లు నేను ఉద్యోగం చేయాలనుకోవటం లేదు"

"మరి..." "చెబుతాను. ఇప్పుడు చెప్పినా నువ్వు అర్థం చేసుకోలేవు"

"నేను చదువుకోలేకపోవచ్చు. అయినా నువ్వు చెప్పేదేంటో తెలుసుకోలేనా? నీకు చెల్లి వుంది. దానికి పెళ్లి చేయాలి. నువ్వు పెళ్లి చేసుకోవాలి. నువ్వు ఏం చేయదలచుకున్నావో నీకే తెలియదు. నిన్ను చూస్తుంటే నాకు భయంగా వుందిరా" అన్నాడు.

"భయం ఎందుకు నాన్నా. భయపడుతూ బతుకుతూ వుంటే దానికి విలువ వుండదు"

అప్పుడు కొడుకు కళ్లల్లోకి చూసాడు.

"మీరు నాకు జన్మనిచ్చారు. పెంచారు. అంతవరకు సంతోషం. ఇప్పుడు నా బతుకు నన్ను బతకనీయండి. ఇప్పట్లో నాకు పెళ్లి ఆలోచన లేదు. ఎప్పుడూ ఆ ప్రస్తావన తీసుకురావద్దు" అనగానే పెద్దాయన ముఖంలో దిగులు కమ్ముకుంది.

"చెల్లి పెళ్లి అంటావా - ఎవరో ఒకరు వస్తారు. నాకు మీ నుండి ఎలాంటి ఆస్తి వద్దు. మీ ఖర్చులకి వుంచుకోండి. ఉన్న ఆస్తి, భూమి చెల్లెలికి ఇవ్వండి" అన్నాడు మోహన్.

ఆయన ఇంకేదో అనబోతుంటే "మనం తర్వాత మాట్లాడుకుందాం" అని లేచి వెళ్లాడు.

అదే చివరిసారి మోహన్ని చూడటం.

ఎప్పుడో ఓసారి పోలీసులు ఇంటికి వచ్చారు. మోహన్ ఫొటోల్ని తీసుకువెళ్లారు. దానికి ముందు ఆయన్ని ఆయన భార్యని చాలా ప్రశ్నలు అడిగారు.

"అసలు మీరు మా ఇంటికి ఎందుకు వచ్చారో తెలియదు. మా మోహన్ దొంగతనం చేస్తాడా" అన్నాడాయన.

"దొంగతనం కొంతవరకు నయం. మీ అబ్బాయి ప్రభుత్వాన్ని కూల్చాలనుకుంటున్నాడు" అన్నారు.

"అదేంటయ్యా!" "అతను నక్సలైట్లతో పని చేస్తున్నాడు. అతను ఇప్పు డు ఎక్కడ వుంటున్నాడు"



"తెలియదు. ఉత్తరాలు రాయడు. చదువుకి వెళ్లిందగ్గర్నుండి ఇంటికి వచ్చిందే తక్కువ. ఈ మధ్య వచ్చిన తర్వాత ముఖం చూపించలేదు"

"మీరు కూడా ఉత్తరాలు రాయరా?"

"మా అమ్మాయి చేత రాయిస్తుంటా. కొత్తలో ఢిల్లీ వెళ్లినప్పుడు ఓ దగ్గర వుండేవాడు. అక్కడికి రాస్తుంది. ఉత్తరాలు అందుతున్నాయో లేదో తెలియదు. మా మోహన్ అక్కడ వుండటం లేదా?"

"ఇలాంటి వారు రహస్యంగా వుంటారు. అసలు మీ అబ్బాయి పేరు కూడా మారిపోయింది. ఇంటి దగ్గర నుండి డబ్బులు పంపించరా?"

"అదెప్పుడో పోయింది. మొదట్లో పంపించాం. ఇంటికి వచ్చినప్పుడు తీసుకు వెళ్లేవాడు. చివరిసారి వచ్చినప్పుడు డబ్బులు యిస్తామన్నా వద్దన్నాడు" అన్నాడాయన.

మోహన్ తల్లి గాద్గదికంగా అడిగింది.

"మా అబ్బాయిని జైల్లో పెడతారా?"

"జైల్లో పెట్టటం కాదు. కాల్చేస్తారు"

అప్పుడామె బావురుమంది. మోహన్ తండ్రి, చెల్లి కూడా కన్నీరు పెట్టుకున్నారు.

"అందుకే ఈసారి మీ అబ్బాయి కలిసినా, అతని స్నేహితులు మీకు తెలిసినా చెప్పండి. మోహన్ని పోలీసులకి లొంగి పొమ్మని బతిమాలుకోండి. ప్రభుత్వం క్షమిస్తుంది. అందరిలా మామూలుగా బతకవచ్చు. అయినా ఇంత పెద్ద దేశంలో పదిమంది కూర్చుని విప్లవాలు తీసుకువస్తామంటే అది కుదరని పని" అని వాళ్లు వెళ్లిపోయారు.

అది చిన్న గ్రామం. మోహన్ కోసం పోలీసులు వచ్చారు అని తెలియగానే ముందు ఏ నేరమో చేసి వుంటాడనుకున్నారు. ఆడపిల్ల విషయంలోనూ, ఎవరినన్నా మోసం చేసాడేమో అని చర్చలు చేసారు.

క్రమంగా ఒక్కో విషయం బయటికి వచ్చింది. అప్పుడు కొందరు మోతుబర్లు తమ పిల్లలు కూడా మోహన్‌లా తయారవుతారా అని భయపడ్డారు.

***

అప్పుడు నిరంజన్ మాట్లాడాడు.

"తర్వాత కొన్ని సంవత్సరాలు గడిచాయి. మోహన్ గురించి తెలియదు. ఏకకాలంలో ఓ భూస్వామి మీద, పోలీస్ స్టేషన్ మీద దాడి చేయటానికి ప్లాన్ చేసారు. ఆ దాడిలో మోహన్ చనిపోయాడు. అతను చనిపోయిన విషయం కూడా మా పెదనాన్న వాళ్లకి తెలియదు. కనీసం మోహన్ శవాన్ని కూడా వాళ్లు ఇంటికి తెచ్చుకోలేదు. పోలీసులే దహన కాండలు పూర్తి చేసారు"

అప్పుడు నాకు తెలియకుండానే దుఃఖం వచ్చింది. నేను ఏడుస్తుంటే నిరంజన్ ఎర్రబడ్డ కళ్లతో చూస్తుండిపోయాడు. కాసేపటికి నేను తేరుకున్నాను.

"నేను మా బ్రదర్ విషయాలు తెలుసుకున్నాను. అప్పటి నుంచి నాకు ఈ రాజకీయల మీద ఆసక్తి కలిగింది. అన్ని రకాల పుస్తకాలు చదవటం మొదలు పెట్టాను. అన్నయ్య ఎంత విలువయిన కామ్రేడో చెప్పారు. భారతదేశంలో కులం ఎలా పుట్టిందో, ఆ అంశానికి ఎంత ప్రాముఖ్యత వుందో అనే అంశాల మీద గొప్ప థీసిస్ రాసాడంట. అది ఎవరి దగ్గర వుందో తెలియదు. ఏదొక రోజు అది వెలుగు చూస్తుందన్న నమ్మకం వుంది" అన్నాడు.

"మీరు కూడా మోహన్‌గారిలా ఉద్యమాల్లోకి వెళ్లిపోతారా?" అన్నాను.

"నాకు మా అన్నయ్య మీద గౌరవం వుంది. అయితే అన్నయ్య మార్గం మీద నాకు నమ్మకం లేదు. మన దేశంలో కోట్లమంది ప్రజలున్నారు. వారికి కులం వుంది. మతం వుంది. మూఢ నమ్మకాలు వున్నాయి. తమ బతుకులు మార్చుకోవచ్చు అనే ఆలోచన వారికి లేదు. లేచిన దగ్గర్నుండి నాలుగు ముద్దల కోసం నిరంతరం పని చేయాలి. అందుకే వారిని చైతన్యవంతుల్ని చేయాలి. నేను ఏ విభాగంలో పని చేయాలా అనేది నిర్ణయించుకునే క్రమంలో వున్నాను" అన్నాడు.

నేను మాత్రం పెళ్లి చేసుకోవాలా అన్న ప్రశ్న ఆ క్షణం నాలో చిన్న విత్తనంలా మారింది.

***

విశాఖ వచ్చాక అమిత కలిసింది.

"మీ ఊరు వెళ్లావా?" అంది.

"లేదు. నేనూ, నిరంజన్ గిరిజన గూడాలు చూడటానికి వెళ్లాం"

"అయితే ముందుగా ఓ మాట చెప్పవచ్చు కదా!"

"చెబితే నువ్వు వచ్చేదానివా?"

"ఆ సంగతి తర్వాత. నేను వచ్చేదాన్నో లేదో!" అంది.

"ఇది ముందుగా అనుకున్నది కాదు. అప్పటికప్పుడు రమ్మని తీసుకువెళ్లాడు. అయినా ఇకముందు ఇలాంటివి నీకు తప్పకుండా చెబుతాను అమితా" అన్నాను.

"ఎలా వుంది ఈ అనుభవం"

(ఇంకా ఉంది)

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్

అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ : బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

అగ్రవర్ణ పేదలకు ఆర్థిక స్తోమత ప్రాతిపదికగా విద్య, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 7న ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు సాధారణ విభాగంలో రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాజ్యాంగంలోని 15, 16 అధికరణలను సవరించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం గరిష్ట పరిమితికి అదనంగా ఈ కోటా ప్రతిపాదిస్తున్నందువల్ల దీనికి అవసరమైన బిల్లును పార్లమెంటు శీతాకాల సమావేశాల చివరిరోజైన ఈనెల 8వ తేదీన ఉభయ సభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 323 ఓట్లు, వ్యతిరేకంగా కేవలం మూడు ఓట్లు పడ్డాయి. దీంతో బిల్లును లోక్‌సభ ఆమోదించినట్లయింది. ఈనెల 9న రాజ్యసభలో కూడా పది గంటల పాటు చర్చించిన అనంతరం బిల్లుకు 165-7 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. దీంతో రాజకీయంగా కీలకమైన ఈ బిల్లుకు పార్టీలకు అతీతంగా మద్దతు లభించినట్లయింది. పార్లమెంటులో బిల్లు ప్రక్రియ పూర్తికావడంతో రాష్ట్రపతి సంతకం మాత్రమే మిగిలి ఉంది.

సీబీఐ డైరెక్టర్ పదవి మళ్లీ అలోక్‌వర్మకే..

సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ తిరిగి ఆ పదవిని చేపట్టేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. అనూహ్య రీతిలో ఆయన అధికారాలను ఉపసంహరించి, బలవంతపు సెలవుపై పంపుతూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) గత ఏడాది అక్టోబరులో ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఈనెల 8వ తేదీన కొట్టివేసింది. వర్మ రెండు సంవత్సరాల పదవీకాలం ఈనెల 31తో ముగుస్తుంది. కోర్టు ఆదేశాలమేరకు వర్మ ఈనెల 9వ తేదీన బాధ్యతలు స్వీకరించారు.

అలోక్ వర్మ బదిలీ.. రాజీనామా



సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ఆ పదవి నుంచి తప్పిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఈనెల 10న నిర్ణయం తీసుకుంది. అలోక్‌పై అవినీతి, విధుల పట్ల అలసత్వం వంటి ఆరోపణలున్నట్లు కేంద్ర నిఘా కమిషన్ సీవీసీ సమర్పించిన నివేదిక ఆధారంగానే ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలోక్ వర్మను హోంశాఖ పరిధిలోని అగ్నిమాపక సేవలు, సివిల్ డిఫెన్స్, హోంగార్డుల డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని విమర్శిస్తూ వర్మ కేంద్రానికి లేఖ రాశారు. కొత్తగా అప్పగించిన పదవీ బాధ్యతలు స్వీకరించేందుకు ఆయన నిరాకరిం చారు. తాను పదవీ విరమణ పొందినట్లుగా పరిగణించాలని కోరారు. దీనిని తక్షణం అమలులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. 55 ఏళ్ల సీబీఐ చరిత్రలో ఒక డైరెక్టర్ ఉద్వాసనకు గురికావడం ఇదే ప్రథమం. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా అదనపు డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు నియమితులయ్యారు.

చిన్న వ్యాపారులకు జీఎస్‌టీ మినహాయింపు

రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ ఉన్న వ్యాపారులు, చిన్నతరహా పరిశ్రమలకు వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) నుంచి కేంద్ర ప్రభుత్వం మినహాయింపులు ప్రకటించింది. ఈనెల 10న జరిగిన జీఎస్‌టీ మండలి సమావేశం అనంతరం ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పన్ను మినహాయింపు పరిధిలోకి వచ్చే వార్షిక టర్నోవర్, కాంపోజిషన్ స్కీమ్ విషయాలలో మార్పులు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ నిర్ణయాలన్నీ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.



కాశ్మీర్‌లో హిమపాతం..

జమ్మూ-కాశ్మీరులో శ్రీనగర్, కాశ్మీర్‌లోయ అంతటా మంచు కప్పేసింది. ఈనెల 4వ తేదీ సాయంత్రం నుంచి మొదలైన హిమపాతం కారణంగా శ్రీనగర్, కాశ్మీరులోయను చేరే అన్ని జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. జమ్మూ విమానాశ్రయంలో విమానాల రాకపోకలను రద్దుచేశారు. పలుచోట్ల 10-17 అడుగుల మేర మంచు పేరుకుపోయింది. విపరీతంగా కురిసిన మంచు కారణంగా గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోయి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఈనెల 5వ తేదీన మరణించారు. వీరిలో ఎనిమిదేళ్లు, ఐదేళ్లుగల ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

మేఘాలయకు రూ.100 కోట్ల జరిమానా

నిబంధనలు ఉల్లంఘించి కొందరు యథేచ్ఛగా గనులు తవ్వుకుంటున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఉదాసీనతను తప్పుపడుతూ ఈనెల 5వ తేదీన రూ.100 కోట్ల జరిమానాను విధించింది. 'కేంద్రీయ కాలుష్య నియంత్రణ మండలి' వద్ద రెండు నెలల్లోగా డబ్బును జమ చేయాలని ఎన్‌జీటీ చైర్‌పర్సన్ ఎ.కె.గోయల్ ఆదేశించారు.

నార్వే ప్రధాని భారత్ పర్యటన

నార్వే ప్రధాని ఇర్నా సోల్‌బర్గ్ భారత్ పర్యటనకు వచ్చారు. ఈనెల 8న ఆమె ప్రధాని నరేంద్రమోడీతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలకు నూతన శక్తిని, సరికొత్త మార్గదర్శకత్వాన్ని అందించడంపై ఇరువురు నేతలు చర్చించారు. ఇర్నా సోల్‌బర్గ్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన 'పౌరసత్వ సవరణ బిల్లు-2018'ను ఈనెల 8న లోక్‌సభ ఆమోదించింది. ఆ దేశాల నుంచి భారత్‌కు వచ్చి, ఎలాంటి పత్రాలు లేకపోయినా ఆరేళ్లుగా నివాసం ఉంటున్న హిందువులు, జైనులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలకు భారత పౌరసత్వం ఇవ్వాలన్నది ఈ బిల్లు సారాంశం. ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడంతో అసోంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అఖిలభారత అసోం విద్యార్థుల సంఘం ఈనెల 8న బంద్ నిర్వహించడంతో జనజీవనం స్తంభించింది. ఈశాన్య రాష్ట్రాల బంద్ కూడా విజయవంతమైంది. పోలీసుల లాఠీచార్జి, కాల్పుల్లో ఏడుగురు గాయపడ్డారు.

ఆస్థానాపై ఎఫ్ఐఆర్ కొట్టివేతకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

అవినీతి కేసులో సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడానికి ఢిల్లీ హైకోర్టు ఈనెల 11న నిరాకరించింది. ఆయనపై క్రిమినల్ చర్యలు చేపట్టకుండా రక్షణ కల్పిస్తూ తాను ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వును కూడా రద్దు చేసింది. దీని ప్రకారం ఆయనను అరెస్టు చేయాలనుకుంటే ఎటువంటి అడ్డంకులు ఉండవు. ఆస్థానాపై వచ్చిన ఆరోపణలను ఈ దశలో నిర్ధారణగా కొట్టివేయలేమని కూడా కోర్టు పేర్కొంది.

కుదుటపడుతున్న కేరళ

శబరిమల అయ్యప్పస్వామిని ఈనెల 2న ఇద్దరు మహిళలు దర్శించుకున్న నేపథ్యంలో మొదలైన హింసాకాండ ఈనెల 6వ తేదీకి కొంత శాంతించింది. 5వ తేదీ సాయంత్రం నుంచి బీజేపీ-ఆర్ఎస్ఎస్, సీపీఎం కార్యకర్తల మధ్య పలుచోట్ల దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకున్నా 6వ తేదీకి పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు శబరిమలపై సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయడం రాష్ట్రప్రభుత్వ విధి అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు.

తిరువారూరు ఉప ఎన్నిక రద్దు

తమిళనాడులోని తిరువారూర్ శాసనసభ నియోజకవర్గానికి ఈనెల 28న జరగాల్సిన ఉప ఎన్నికను భారత ఎన్నికల సంఘం రద్దు చేసింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి గత ఏడాది ఆగస్టు 7వ తేదీన మరణించడంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన తిరువారూర్ శాసనసభ స్థానానికి ఎన్నిక అనివార్యమైంది. ఈనెల 3న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. గజ తుపానుకు ఘోరంగా దెబ్బతిన్న జిల్లాల్లో తిరువారూర్ కూడా ఒకటి కావడంతో ఇక్కడ ఉప ఎన్నికను వాయిదా వేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ఎన్నికల కమిషన్‌కు పిటిషన్ సమర్పించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి నివేదిక తెప్పించుకున్న కేంద్ర ఎన్నికల సంఘం.. దానిని పరిశీలించి, ఉప ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పరిస్థితులు అనుకూలించాక ఉప ఎన్నిక ఉంటుందని పేర్కొంది.

కార్మిక సంఘాల సమ్మె విజయవంతం

దేశవ్యాప్తంగా పది కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 8, 9 తేదీల్లో బంద్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో ఈనెల 8న రోడ్డు రవాణా, రైలు సేవలకు ఎక్కువగా అంతరాయం కలిగింది. కర్ణాటకలోని కొన్ని జిల్లాల్లో బంద్ వాతావరణం కనిపించింది. ముంబయి పౌర రవాణా విభాగానికి చెందిన 32 వేల మంది సమ్మె



చేయడంతో సుమారు 25 లక్షల మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రెండోరోజైన ఈనెల 9వ తేదీన కూడా బంద్ సందర్భంగా పలుచోట్ల చెదురుమదురు సంఘటనలు చోటుచేసుకున్నాయి. తూర్పు రైల్వేజోన్‌తోపాటు కేరళ, తమిళనాడు, ఒడిశాల్లోని పలు ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలను ఆందోళనకారులు అడ్డుకున్నారు.

తమిళనాడు మంత్రికి మూడేళ్ల జైలు

అల్లర్ల కేసులో తమిళనాడు మంత్రి బాలకృష్ణారెడ్డికి చెన్నైలోని హైకోర్టు అనుబంధ ప్రత్యేక న్యాయస్థానం మూడేళ్ల జైలుశిక్ష, రూ.10,500 జరిమానా విధిస్తూ ఈనెల 7వ తేదీన తీర్పు వెలువరించింది. అక్రమ మద్యానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో చెలరేగిన హింసలో నిందితుడిగా తేల్చింది. తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి పళనిస్వామితో బాలకృష్ణారెడ్డి సమావేశమయ్యారు. శాసనసభ సభ్యత్వానికి, మంత్రి పదవికి రాజీనామా చేస్తూ లేఖను అందజేశారు. 1998లో బీజేపీ నేతగా ఉన్న బాలకృష్ణారెడ్డి జి.మంగళం గ్రామంలో చేపట్టిన ఉద్యమానికి నేతృత్వం వహించారు. ఆ సమయంలో చేపట్టిన భారీ ప్రదర్శన హింసాత్మకంగా మారింది.

అంతర్జాతీయ వార్తలు

విదేశీ విద్యార్థులు మా దగ్గరే ఉండండి : ట్రంప్



చదువు పూర్తయ్యాక కూడా విదేశీ విద్యార్థులు అమెరికాలోనే ఉండాలని ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విజ్ఞప్తి చేశారు. అమెరికా సంస్థల వృద్ధికి దోహదపడాలని అభ్యర్థించారు. ప్రస్తుతం అనుసరి స్తున్న తెలివితక్కువ 'వలస విధానం' కారణంగా తమ దేశం గొప్ప మేధావులను దూరం చేసుకుం టోందని అన్నారు. ఇన్నేళ్లుగా వస్తున్న వలసదారులు రాకూడదని, ప్రతిభ ఆధారంగానే వారికి ప్రవేశం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. తమ దేశంలో హెచ్-1బీ వీసాపై ఉద్యోగం చేస్తున్న విదేశీయులకు అమెరికా పౌరసత్వం కూడా పొందడానికి మార్గం సుగమం చేసేలా ఆ వీసా నిబంధనల్లో త్వరలోనే భారీ మార్పులు తీసుకురానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. తద్వారా ప్రతిభావంతులను ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో భారీగోడను నిర్మించేందుకు అవసరమైతే అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తానని ఆయన హెచ్చరించారు. గోడ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసేందుకు కాంగ్రెస్ నిరాకరిస్తుండటంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ దక్షిణ సరిహద్దుల్లో భారీగోడ నిర్మాణానికి రూ.40 వేల కోట్ల నిధులు మంజూరయ్యేందుకు సహకరించాలని ప్రతిపక్ష డెమోక్రాట్లను ట్రంప్ డిమాండ్ చేశారు.

ఆఫ్ఘనిస్థాన్‌లో బంగారం గని కూలి 30 మంది దుర్మరణం

ఆఫ్ఘనిస్థాన్ ఈశాన్య ప్రాంతంలోని బదక్షాన్ ప్రావిన్స్‌లో ఈనెల ఆరోతేదీన బంగారం గని కుప్పకూలిన దుర్ఘటనలో 30 మంది సజీవ సమాధి అయ్యారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానిక నది ఒడ్డున గల బంగారు గనిలో 200 అడుగుల లోతున గ్రామస్తులు తవ్వకాలు జరిపారు. వారికి తవ్వకం పనుల్లో నైపుణ్యం లేకపోవడంతో పైనుండి మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. తజకిస్థాన్, చైనా, పాకిస్తాన్ సరిహద్దున గల ఈ ప్రాంతంపై ఆఫ్ఘనిస్థాన్‌కు నియంత్రణ లేదు. స్థానిక ప్రజలు యథేచ్ఛగా గనుల్లో తవ్వకాలు జరుపుతుంటారు.

బంగ్లా ప్రధానిగా షేక్ హసీనా బాధ్యతల స్వీకారం

బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా షేక్ హసీనా బాధ్యతలు స్వీకరించారు. దేశాధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఆమెతోపాటు కొత్త మంత్రులతో ఈనెల 7న ప్రమాణ స్వీకారం చేయించారు. 24 మంది కేబినెట్ మంత్రులు సహా మొత్తం 46 మంది బాధ్యతలు స్వీకరించారు.



విడిపోతున్న 'అమెజాన్' బెజోస్ దంపతులు

ప్రపంచంలోనే అత్యంత ధనికుడు, అమెజాన్ సంస్థ అధిపతి జెఫ్ బెజోస్, ఆయన సతీమని మెక్ కెంజీలు విడిపోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు దంపతులిద్దరూ ఉమ్మడిగా ట్విట్టర్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. విడాకుల అనంతరం మెక్ కెంజీకి రూ.4.2 లక్షల కోట్లు భరణంగా దక్కే వీలుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన విడాకులుగా చెబుతున్నారు.

విశాలాంధ్ర ప్రజ్ఞ

వైదొలిగిన మలేసియా రాజు

మలేసియా రాజు సుల్తాన్ మహ్మద్ (49) ఈనెల 6న సింహాసనం నుంచి వైదొలిగారు. దేశ చరిత్రలో ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి. ఆరోగ్య కారణాలు చెబుతూ కొంత కాలం సెలవు తీసుకున్న ఆయన భవితవ్యంపై ఊహా గానాలు చెలరేగాయి. సుల్తాన్ మహ్మద్ 2016లో సింహాసనాన్ని అధిష్ఠించారు. ఆయన రాజీనామాకు కారణాలు వెల్లడి కాలేదు. మలేసియాలో రాజు పాత్ర లాంఛనప్రాయమే. కార్యనిర్వాహక అధికారాలన్నీ ప్రధానమంత్రి నేతృత్వంలోని క్యాబినెట్ వద్ద ఉంటాయి.

ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్తగా గీతా గోపీనాథ్

అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రధాన ఆర్థికవేత్తగా ప్రముఖ భారతీయ అమెరికన్ అర్థ శాస్త్రవేత్త గీతా గోపీనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిని అందుకున్న తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. అంతకుముందు ఈ బాధ్యతల్లో ఉన్న మరీస్ డిసెంబరు 31న పదవీ విరమణ పొందారు. మరుసటిరోజు ఆయన స్థానాన్ని గీతా గోపీనాథ్ భర్తీ చేశారు.

క్రీడావార్తలు




ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ భారత్ కైవసం

ఆస్ట్రేలియా జట్టుతో సిడ్నీలో జరిగిన నాలుగో టెస్ట్‌మ్యాచ్ డ్రాగా ముగిసింది. వర్షం కారణంగా నాలుగోరోజు కొద్దిసేపు మాత్రమే సాధ్యమైంది. ఐదోరోజు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. దీంతో 2-1 తేడాతో ఆధిక్యంలో ఉన్న భారత్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 677/7 వద్ద డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 300కు ఆలౌట్ అయి, ఫాలో ఆన్ ఆడుతుండగా మ్యాచ్‌కు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది. 31 ఏళ్లలో ఆస్ట్రేలియా జట్టుకు స్వదేశంలో ఇదే ఫాలోఆన్. భారత బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించాయి. ఈ సిరీస్‌ను గెలవడంతో భారత్ తొలిసారిగా ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్‌ను గెలుచుకున్న ఘనతను దక్కించుకుంది. దీంతో భారత్‌కు 71 ఏళ్ల కల సాకారమైంది.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి పుజారా

ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన చతేశ్వర్ పుజారా ఐసీసీ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం మెరుగుపరచుకుని మూడో ర్యాంకుకు ఎగబాకాడు. రిషబ్ పంత్ ఏకంగా 21 స్థానాలు ఎగబాకి, 17వ స్థానంలో నిలిచాడు. కెప్టెన్ విరాట్‌కోహ్లి నెంబర్‌వన్ స్థానంలో కొనసాగుతు న్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు నెంబర్‌వన్‌గా కొనసాగుతోంది.

టెన్నిస్‌కు వీడ్కోలు పలకనున్న ఆండీ ముర్రే



తరచూ గాయాలతో బాధపడుతున్న బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే టెన్నిస్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 14 నుంచి ఆరంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెనే అతడికి చివరి టోర్నమెంట్ అవు తుంది. ముర్రే వయస్సు 31 సంవత్సరాలు. 2012లో యూఎస్ ఓపెన్ గెలుచుకున్న అతడు.. 2016లో వింబుల్డన్‌తోపాటు ఫ్రెంచ్ ఓపెన్‌కు కూడా కైవసం చేసుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఐదుసార్లు ఫైనల్‌కు చేరినా.. టైటిల్ మాత్రం గెలుచుకోలేకపోయాడు.

రాష్ట్ర వార్తలు

పోలవరం ప్రాజెక్టుకు రెండు గిన్నిస్ రికార్డులు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి 24 గంటల్లో 32,100 ఘనపు మీటర్ల కాంక్రీటు స్పిల్ చానల్ వేయడంతోపాటు ఏకధాటిగా 32,315 ఘనపు మీటర్ల కాంక్రీటు వేసిన రెండు రికార్డులు నమోదయ్యాయి. ఈనెల 6వ తేదీ ఉదయం ఎనిమిదింటికి ప్రారంభమైన ఈ నిర్మాణం 7వ తేదీ ఉదయం ఎనిమిది గంటలవరకు కొనసాగింది. రికార్డులను గిన్నిస్ సంస్థ ప్రతినిధి రిషినాథ్ అధికారికంగా ప్రకటించి, అవార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రాజెక్టు వద్ద అందజేశారు.

ముగిసిన జగన్ పాదయాత్ర

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 2017 నవంబర్ 6న ఇడుపులపాయలో ప్రారంభించిన ప్రజా సంకల్పయాత్ర ఈనెల 9వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను జగన్ ప్రారంభించి బహిరంగసభలో ప్రసంగించారు. పాదయాత్ర ముగిస్తున్నట్లుగా ప్రకటించారు. జగన్ మొత్తం 341 రోజులపాటు 3648 కిలోమీటర్లు నడిచారు.

ఆర్టీజీఎస్‌ను సందర్శించిన బ్రిటన్ మాజీ ప్రధాని

బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ఈనెల 7న అమరావతి సచివాలయంలోని రియల్‌టైం గవర్నెన్స్‌ను పరిశీలించారు. 45 నిముషాల పాటు దానిని పరిశీలించిన అనంతరం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును అభినందించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు తాను ఇక్కడకు వచ్చానని టోనీ బ్లెయిర్ పేర్కొన్నారు. సచివాలయంలో ఆయనకు చంద్రబాబునాయుడు తదితరులు స్వాగతం పలికారు.

ఇకపై ఏపీ 39 సంకేతంతో వాహనాల రిజిస్ట్రేషన్

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇకపై ఒకే సంకేతంతో వాహనాల రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇప్పటివరకు జిల్లాలవారీగా వేర్వేరు సంకేతాలు ఉండేవి. ఇకపై అన్ని జిల్లాల్లోనూ ఏపీ 39 సంకేతంతో వాహనాల రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు కల్పిస్తూ రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తుది నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఆర్టీసీ వాహనాలకు ఏపీ 39 జెడ్, పోలీసు వాహనాలకు ఏపీ 39 పీ తో సంకేతాలు ప్రారంభమవుతాయి.

ఓటర్ల తుది జాబితా ప్రచురణ

రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాను ఈనెల 11న ప్రచురించింది. దాని ప్రకారం రాష్ట్రంలో 3,69,33,091 మంది ఓటర్లు ఉన్నారని ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా ప్రకటించారు. వీరిలో పురుషుల కన్నా మహిళలే అధికంగా ఉన్నారు. యువ ఓటర్లు 5,39,804 మంది ఉన్నారు.

Sunday Special

పండగొచ్చింది...
పల్లె పిలుస్తోంది





(విశాలాంధ్ర స్పెషల్ డెస్క్)

పుట్టినూరు... ఈ పేరు చెప్పడంతోనే ప్రతి మనిషి పులకరిస్తాడు.. ఉండేది అమెరికా అయినా, హైదరాబాద్ అయినా ఇంకెక్కడైనా... మా ఊరు అని మొదలు పెట్టాడంటే గంట సేపు మీరు విన్నా వినకపోయినా చెబుతూనే ఉంటాడు. అతని స్థానంలో మనం ఉన్నా అంతే... అదే సొంతూరంటే.... కన్నతల్లిని, ఉన్న ఊరిని మరువడం అనేది మానవ జన్మకు సాధ్యం కాని పని. అటువంటి పల్లెటూళ్లు 30 సంవత్సరాల క్రితం వరకు బాగానే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన మార్పులు పల్లెలపై తీవ్ర ప్రభావం చూపాయి. వ్యవసాయం సరైన దారి చూపకపోవడం.. ఉపాధి మార్గాలు కరవు అవ్వడం, అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు వెల్లువెత్తడం... వాటిని అందిపుచ్చుకునే క్రమంలో మనతరం పల్లెను వదిలింది. కానీ ఇది 30 ఏళ్ల తరువాత అలాంటి వారి ఆలోచనల్లో మార్పువస్తోంది. ఎప్పటికైనా ఊరికి పోదాం... అదే మనకు మనశ్శాంతినిచ్చే ప్రదేశం అన్న మాటలు ఇటీవల కాలంలో తరచూ వినపడుతున్నాయి. దీని ప్రతిఫలమే గ్రామాల్లో పొలాలు... అమ్మకాలు నిలిపివేశారు. ఇళ్లను పునరుద్ధరిస్తున్నారు. ఉన్నా లేకపోయినా పొలం, ఇల్లు కంటికి రెప్పలాగా చూసుకుంటున్నారు. కారణం గ్రామంపై పెరిగిన మమకారం. ఇది మనలాంటి గ్రామాల నిలయమైన రాష్ట్రానికి శుభసంకేతం... ఇలా పల్లెకు వెళదాం... అనే వారికి అత్యుత్తమ సందర్భం... తెలుగోళ్ల పెద్ద పండుగ సంక్రాంతి. దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏ దేశంలో ఉన్నా... ఏస్థాయిలో ఉన్నా సంక్రాంతి పేరు చెబితే తన చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకుంటూ... మరొక్కసారి నెమరు వేసుకుంటూ స్వగ్రామం వెళ్లాలన్న మనసు పడనివారు ఉండరు. అది మన పల్లె గొప్పతనం... పల్లెకు రైతు కుటుంబం దూరం కావడం వల్ల మూడు దశాబ్దాల కాలంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రైతుపై ఆధారపడ్డ అనేక వృత్తుల వారు ఉపాధి కోల్పోయారు. ఏ జాతి అయితే తన సంస్కృతిని కోల్పోతుందో ఆ రోజున ఆ జాతి అంతమైపోయినట్లేనని ఓ మహానుభావుడు సెలవిచ్చాడు. అటువంటి సంస్కృతి ఇన్ని తరాలుగా బతికి ఉందంటే కారణం పల్లెటూరే... రైతు కుటుంబాలు పల్లెకు దూరం కావడంతో వారిపై ఆధారపడ్డ కుల వృత్తులు సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్న అనేక రకాల కుటుంబాలు పోషణ లేక వృత్తులే మానుకుని ఆయా సంస్కృతే మటుమాయమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇటీవల కాలంలో సంక్రాంతి పండుగకు అయినా పల్లెకు వెళ్లి సంతోషం పొందడంతో పాటు ఆ సంస్కృతిని కాపాడుతున్న వారిని ఆదుకుందామన్న ఆలోచనలు కూడా పెరుగుతున్నాయి. ఈ ఆలోచనలు ఆచరణలో పెట్టి ఆయా సంస్కృతులను కాపాడుతున్న వారిని ఆదుకుంటే మన భవిష్యత్తుతరాలకు ఆ సంస్కృతులను అందించినవారమవుతాం.

ఉదాహరణకు సంక్రాంతినే తీసుకుందాం... పండుగ వేళ వచ్చే హరిదాసులు, గంగిరెద్దుల వారి నుంచి సాయంత్రం వచ్చే గుత్తి కోయల వరకు ఎటు వెళ్లారో తెలియదు. వారిని ఆదరించే దిక్కులేక వారు తమ వృత్తులనే మానేయడంతో మన సంప్రదాయమేమిటో మన పిల్లలకే తెలియని పరిస్థితి ఏర్పడింది. మనం నడిచిన బాట, మొక్కిన గుడి, ఈత వేసిన చెరువు, చదివిన బడి, ఇవన్నీ మనకు తీపిగుర్తులుగానే మిగిలివున్నాయి. కానీ మన తరువాత తరానికి ఇవేమీ లేవు. ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, వీడియోగేమ్స్, యూట్యూబ్లు తప్ప మరే ప్రపంచం తెలియదు. వారికి సంస్కృతిని చూపించాల్సిన బాధ్యత మనపై ఉంది. సంస్కృతిని కాపాడాలంటే పల్లె సరైన దారి. సంస్కృతితోపాటు విజ్ఞానం కూడా అందించడానికి ఇదో అత్యుత్తమమైన అవకాశం. నేడు ఇక్కడ పుట్టి ఇక్కడ పెరిగిన వారిలో 80శాతం మందికి వరి నుంచి బియ్యం వస్తుందనేది తెలియదు. బియ్యం ఎక్కడ పండుతాయి నాన్న.



అని పిల్లల నుంచి ఈ ప్రశ్న ఎదుర్కొనని తండ్రి లేడు. పాలు గేదెలు ఇస్తాయని తెలియక ప్యాకెట్ ఇస్తుందనే చెప్పే పిల్లలు పిల్లలే కాదు.. బీటెక్ చదివే విద్యార్థులు కూడా ఇలానే ఉన్నారంటే ఆశ్చర్యం కాదు. కారణం పల్లెకు దూరం కావడమే. మనం తినే కూరగాయల్లో ఏ మొక్క ఎలా



ఉంటుందో తెలియదు. దేనికి ఏ కాయ కాస్తుందో తెలియదు.. ఇవన్నీ తెలుసుకోవాలంటే పిల్లలను పండుగకు గ్రామాలకు తీసుకెళితే సంతోషంతో పాటు విజ్ఞానం దొరుకుతుంది. దీంతో పాటు అనురా గాలు, ఉన్నది నలుగురైనా నాలుగు దిక్కుల్లా పెరగడం ఫోన్లో పలకరింపులు తప్ప మనవడి స్పర్శ తాతకు తెలియదు. నాయనమ్మ వంట మనుమరాలికి తెలియదు. ఇది ఈ జన్మల పరిస్థితి.. వీటన్నింటిని మనం అందుకున్నాం. కానీ మన తరాల తరువాత తరం వారు ఈ మధురానుభూతులకు దూరమయిపోతున్నారు. అందువల్ల వారికి కూడా వీటిపై మమకారం పెంచి తీపి గుర్తుల్లా వారు కూడా ఆనందించేలా పల్లెకు పోయి వీటన్నింటిని చూపుదాం. ఇటీవల కాలంలో అత్యుత్తమ నేతల నుంచి మధ్యస్థాయి పౌరుడి వరకు పట్టణ జీవితానికి విసిగిపోయి నాలుగు రోజులన్నా స్వగ్రామాలకు పోయి ఉండి వద్దామన్న వ్యాఖ్యలు తరచూ వినపడుతున్నాయి. వీటిని ఆచరణలో చూపేందుకు అనేకమంది సంక్రాంతిని మార్గంగా ఎంచుకుంటున్నారు. అందుకే పల్లెకు పోదాం... దానికి పండుగను మార్గంగా ఎంచుకుందాం... దీంతో సంతోషంతో పాటు మన సంస్కృతిని కాపాడుతూ దానిని మన తరాల వారికి అందిద్దాం.

కలిసి వచ్చిన సెలవులు

ఈ ఏడాది పండుగ జరుపుకొనేందుకు సోమ, మంగళ, బుధవారాలతోపాటు రెండో శనివారం, ఆదివారం కూడా ముందురావడంతో మొత్తం ఐదు రోజులు కార్యాలయాలకు సెలవులు ఇచ్చారు. దీంతో హైదరాబాద్, విశాఖ వంటి నగరాల నుంచి కూడా శుక్రవారం సాయంత్రమే పల్లెకు వచ్చేందుకు బయలుదేరారు. పల్లెల్లో కూడా వారి రాక కోసం కుటుంబీకులు, స్నేహితులు ఎదురు చూస్తున్నారు.

కోడి పందేలను జూదంలా చూడొద్దు...



ఇటీవలి కాలంలో సంక్రాంతి కోడిపందేలను జూదంలా మారుస్తున్నారు. పౌరుషానికి ప్రతీక కోడిపుంజు. ఒక్కో జంతువుకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. కోడిపుంజు ప్రత్యేకత అన్నింటికన్నా భిన్నమైనది. పౌరుషానికి ప్రాణం ఇస్తుంది. తన శరీరంలో చివరి రక్తం బొట్టు వరకు వెన్నుచూపకుండా ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రయత్నిస్తుంది. అలాగే ప్రాణాలు విడుస్తుంది. దానిలో ఉన్న ఆ గొప్ప గుణాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలే తప్ప దానిని జూదం చేయకూడదు. సంక్రాంతికి జిల్లాలో అక్కడక్కడ కోడి పందేలు సర్వసాధారణంగా మారాయి. ఎక్కువమంది వీటి కోసమే గ్రామాలకు వస్తున్నారు. వచ్చిన వారికి ఇవి తీపి జ్ఞాపకాలుగా ఇచ్చేందుకు గ్రామస్థులు ప్రయత్నించాలని కోరుకుందాం.

సంక్రాంతి సందర్భంగా హోంక్రెడిట్ ఆఫర్లు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:
సంక్రాంతి పండగ సందర్భంగా హోంక్రెడిట్ వినూత్న పథకాలు, ఆఫర్లను ప్రకటించింది. వినియోగదారులకు అవాంతరాలకు కలగకుండా డిజిటల్, స్మార్ట్‌ఫోన్లపై కొనుగోలుపై ఆఫర్లను ప్రకటించింది. వివిధ ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ సొల్యూషన్స్ ద్వారా వినియోగదారుల జీవితాలకు చేరువచేసినట్లు సంస్థ చీఫ్ సేల్స్ ఆఫీసర్ ఆర్టెమ్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు నోకియా ఫోన్లపై అలాగే 5ప్రో, మైఎ2, రెడ్‌మి 6ప్రో ఫోన్ల కొనుగోలుపై 'డబుల్ జీరో' పథకం ద్వారా ఫైనాన్సింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. సరళమైన ఫైనాన్సింగ్ పరిష్కారాల ద్వారా తన పోర్ట్‌పోలియోను 30 వేల పాయింట్ల అమ్మకం ద్వారా విస్తరించిందన్నారు.

మార్కెట్లో ఆడిదాస్ టెక్నికల్ సోలార్ బూస్ట్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:
ప్రముఖ ఆడిదాస్ సంస్థ అత్యుత్తమ పనితీరు, సౌకర్యం, ఎనర్జీ రిటర్న్‌లను కోరుకునేవారి కోసం ప్రత్యేకంగా ఒక సాంకేతిక అద్భుతాన్ని ఆవిష్కరించింది. నాసా ఇంజినీరింగ్‌తో పొందిన స్ఫూర్తితో చక్కటి పనితీరుకు వీలుగా ఇవి రూపుదిద్దుకున్నాయి. అధిక పనితీరు ఈ లైట్ వెయిట్ షూ ప్రత్యేకత. ఆడిదాస్ యొక్క అత్యుత్తమ వినూత్నతలతో ఈ షూ రూపుదిద్దుకుంది. టైలర్డ్ ఫైబర్ ప్లేస్‌మెంట్ సాంకేతికతను ఇందులో ఉపయోగించారు. పార్లే మెటీరియనల్ కంటెంట్ ఇందులో ఉంది. షూలోని ప్రతీ మల్లీమీటర్ కూడా ఎంతో కచ్చితత్వంతో తయారుచేయబడిందని సంస్థ నేడొక ప్రకటనలో తెలిపింది. వినియోగదారులకు అత్యున్నతస్థాయి సౌకర్యం, ఫిట్, సపోర్ట్ అన్నీ కూడా లైట్ వెయిట్ రూపంలో అందుబాటులో ఉంటాయని పేర్కొంది. రన్నర్లు ఎంతటి వేగంతో అయినా, ఎంతటి దూరాన్ని అయినా ఆత్మవిశ్వాసంతో చేరుకోవచ్చని తెలిపింది.

యమహా హైజెడ్-ఆర్ 15వి ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:
ప్రముఖ యమహా సంస్థ తన ఎంట్రీ లెవెల్ సూపర్ స్పోర్ట్స్ బైక్ వైజెడ్ఎఫ్-ఆర్ 15 వి3.0కి చెందిన ఎబిఎస్ వేరియంట్‌ను ఆవిష్కరించింది. యమహా వైజెడ్ఎఫ్-ఆర్ 15 వి3.0 ఎబిఎస్‌కి చెందిన ఎక్స్ షోరూం ధర రూ.1.39 లక్షలు. డ్యూయల్ ఛానల్ ఎబిఎస్‌కు చెందిన ఈ బైక్ ధర నాన్ ఎబిఎస్ వేరియంట్ కన్నా రూ.12 వేలు అధికంగా ఉంది. ఎబిఎస్ మాత్రమే కాకుండా కంపెనీ ఈ బైక్‌కు నూతన డార్క్ నైట్ కలర్ స్కీంలో ప్రవేశపెట్టింది. దీని షోరూం ధర రూ.1.14 లక్షలు. యమహా బైక్‌లో డ్యూయల్ ఛానల్ ఎబిఎస్‌కు మెకానికల్‌గా ఎటువంటి మార్పులను చేయలేదు.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐటీసీ	295.35	1.99
యూపీఎల్	783.45	1.34
ఐఓసీ	131.20	1.00
ఓఎన్‌జీసీ	145.50	0.98
హిండాల్కో	207.95	0.91

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,515.15	-3.24
టాటా మోటార్స్	180.30	-2.93
భారతీ ఇన్‌ఫ్రాటెల్	277.20	-2.75
టీసీఎస్	1,875.00	-2.44
లార్సెన్	1,393.00	-1.65

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	70.41	70.49
యూరో	81.21	81.25
పౌండ్	89.71	90.29
ఆస్ట్రేలియా డాలర్	50.61	50.96
సింగపూర్ డాలర్	52.11	52.20

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,720	32,885
చెన్నై	30,720	32,855
బెంగళూరు	30,160	32,256
ముంబై	31,280	33,454
విజయవాడ	-	33,000
విశాఖపట్నం	30,770	32,200
ప్రొద్దుటూరు	30,720	32,260

ముడి చమురు	61.68

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో 600 ఉద్యోగాలు

తెలంగాణలో మరో ఏడు శాఖలు



హైదరాబాద్: దేశంలో రెండో అతిపెద్ద బ్యాంకైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రాష్ట్రంలో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 14 శాఖలను ప్రారంభించిన సంస్థ.. వచ్చే రెండు నెలల్లో మరో ఏడు బ్రాంచ్‌లను ప్రారంభించడానికి సిద్ధమైంది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ దక్షిణాది విభాగాధిపతి మధుసూదన్ హెగ్డే మాట్లాడుతూ.. ఈ ఏడాది 21 శాఖలను ప్రారంభించాలని గతంలో నిర్ణయించడం జరిగిందని, వీటిలో ఇప్పటికే 14 శాఖలను ఆరంభించగా, మరో రెండు నెలల్లో మిగతావి ప్రారంభించనున్నట్లు చెప్పారు. దీంతో రాష్ట్రంలో శాఖల సంఖ్య 208కి చేరుకోనున్నది. ఒక్కో శాఖను ఏర్పాటు చేయాలంటే కనీసంగా పది మంది సిబ్బంది అవసరమవుతారని, దీంతో యేటా 500-600 వరకు ఉద్యోగులను నియమించుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బ్యాంకుకు 6 వేల మంది సిబ్బంది ఉన్నారని చెప్పారు. బ్యాంక్ మొత్తం వ్యాపారంలో దక్షిణాది వాటా అధికంగా ఉంటుందని, గడిచిన తొమ్మిది నెలల్లో డిపాజిట్లలో 23 శాతం, అడ్వాన్స్‌లలో 24 శాతం పెరుగుదల నమోదైందన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మరో 11 శాఖలను ప్రారంభించపోతున్నట్లు చెప్పారు.

వచ్చే నెల 10న సేవ్‌థాన్
హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోగల సంజీవయ్య పార్క్‌లో సేవ్‌థాన్ పేరుతో వచ్చే నెల 10న ప్రత్యేక రన్ నిర్వహిస్తున్నట్లు హెగ్డే ప్రకటించారు. రన్ ఫర్ గ్రీన్ పేరిట నిర్వహిస్తున్న ఈ బృహత్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ చుట్టు 25 వేల మొక్కలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎండీఏ, అటవీ శాఖలు తమ మద్దతుగా 25 వేల మొక్కలను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. గతేడాది నిర్వహించిన రన్‌లో 5 వేల మంది పాల్గొనగా, ఈసారి 8 వేల మంది పాల్గొనే అవకాశం ఉందన్నారు.

పారిశ్రామికి ఉత్పత్తి 0.5 శాతమే

17 నెలల కనిష్టం నమోదు



న్యూఢిల్లీ: పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల క్షీణించింది. 2018 నవంబర్‌లో వృద్ధి 0.5 శాతం మాత్రమే నమొదయింది. 2017 జూన్ తరువాత ఇదే అత్యల్పమని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలో తెలిపింది. ఆర్థిక వేత్తలు 4.1 శాతం వృద్ధిని అంచనా వేయగా, వారి అంచనాలను తలకిందులు చేస్తూ 0.5గా నమోదయింది. అక్టోబర్‌లో మాత్రం పెరుగుదల ఉన్నా నవంబర్‌లో క్షీణించింది. ముఖ్యంగా తయారీ రంగంలో ఖనిజ, వాహనాల తయారీలో వృద్ధి తగ్గడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. ఉత్పత్తి వృద్ధి సూచీలో గనుల తవ్వకాలలకు 14.4 శాతం ఉంది. కానీ గనుల రంగంలో వృద్ధి 2.7 శాతం మేరే ఉండటం కూడా పారిశ్రామికి ఉత్పత్తిపై ప్రభావం చూపింది. విద్యుత్ సరఫరా లేకపోవడం కూడా ఉత్పత్తి క్షీణించడానికి కారణమైంది. క్యాపిటల్ గూడ్స్ వృద్ధి 3.7 శాతం నుంచి 3.4 శాతానికి తగ్గింది. ఎక్కువ కాలం మన్నికగా ఉండే వినియోగదారుల వస్తువుల ఉత్పత్తి 3.1 శాతం నుంచి 0.9 శాతం తగ్గింది. మన్నిక లేని వస్తువుల ఉత్పత్తి 23.7 శాతం నుంచి 0.6 శాతం తగ్గింది. తయారీ రంగంలోని 23 పరిశ్రమల్లో 10 నవంబర్ (2018)లో సానుకూల వృద్ధి నమోదు చేయడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా 3.2 శాతమే వృద్ధి సాధించినట్లు ప్రభుత్వం తెలిపింది.

ఎన్‌ఎస్ఈ చైర్మన్ రాజీనామా



న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) చైర్మన్ పదవికి అశోక్ చావ్లా రాజీనామా చేశారు. తక్షణమే రాజీనామా అమల్లోకి వస్తుందని ఎన్ఎస్ఈ వెల్లడించింది. మాజీ బ్యూరోక్రాట్ అయిన చావ్లాను ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో విచారించేందుకు సీబీఐకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. 'ఇటీవలి చట్టపర ఘటనల నేపథ్యంలో ఎన్ఎస్ఈ డైరెక్టర్, బోర్డ్ చైర్మన్ పదవికి అశోక్ చావ్లా రాజీనామా చేశారు. వెంటనే ఇది అమల్లోకి వచ్చింది' అని ఎన్ఎస్ఈ ప్రకటనలో తెలిపింది. యూపీఏ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేసిన చిందంబరం అలాగే ఆయన కుమారుడు కార్తీకి ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అయిన చావ్లా 2016 మార్చి 28న ఎన్ఎస్ఈ చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు పౌరవిమానయాన కార్యదర్శి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్‌పర్సన్ బాధ్యతలూ నిర్వర్తించారు. 2018 నవంబరులో యెస్ బ్యాంక్ చైర్మన్ పదవి నుంచి వైదొలగారు.

యస్ బ్యాంక్ చైర్మన్‌గా బ్రహ్మదత్



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ బ్యాంకులో నాలుగో స్థానంలో ఉన్న యస్ బ్యాంక్, బోర్డు స్వతంత్ర డైరెక్టర్ బ్రహ్మదత్‌ను బ్యాంక్ పార్ట్ టైమ్ చైర్మన్‌గా నియమి స్తున్నట్లు ప్రెకటించింది. బ్రహ్మ దత్‌కు ఉన్న అత్యుత్తమ అర్హతల కారణంగానే చైర్మన్‌గా నియమిస్తున్నాం. జులై 4, 2020 సంవత్సరం వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారు అని తెలిపింది. 2013 నుంచీ దత్ యస్ బ్యాంక్ స్వతంత్ర డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మాజీ ఐఏఎస్ అధికారి అయిన దత్ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కీలక పదవులు చేపట్టారు. బ్యాంకు ఫారెన్ సీఈఓగా ఉన్న రజత్ మోంగాను బ్యాంకు సీఈఓ రాణా కపూర్ స్థానంలో నియమిస్తున్నట్లు కూడా ప్రెకటనలో తెలిపింది. రాణా కపూర్ స్థానంలో కొత్త వారిని నియమిస్తున్నట్లు యస్ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలిపింది.

త్వరలో చిన్న వ్యాపారులకు 'బీమా'

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు బీమా పథకం రూపంలో మరో ఎన్నికల తాయిలం తయారు చేస్తున్నట్లు తెలుస్తుంది. చిన్న వ్యాపారుల ట్యాక్స్ పరిమితి రెట్టింపు చేసిన కేంద్రం, జీఎస్‌టీలో భాగమైన చిన్న వ్యాపారులకు బీమా పథకం అందించనుందని మార్కెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ పథకం చిన్న వ్యాపారులకు అతి తక్కువ ప్రిమియంతో ప్రమాద బీమా అందించనుందని, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం వ్యాపారులకు అందిస్తున్న బీమా పథకం నియమావళితో ఈ దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని తీసుకురానున్నట్లు తెలుస్తుంది. వ్యాపారులకు ప్రమాద బీమా కింద కంపెనీ టర్నోవర్ ఆధారంగా రూ.10 లక్షల వరకూ అందనున్నాయి.

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆస్తుల విక్రయానికి సూచనలు

న్యాయమూర్తి పర్యవేక్షణలో చేయాలన్న సుప్రీం



న్యూఢిల్లీ: ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆస్తుల బదిలీ, విక్రయాలను పర్యవేక్షించేందుకు సుప్రీం కోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తిని నియమించాలని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సూచించింది. రూ.90,000 కోట్ల రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌ను గట్టెక్కించేందుకు.. సంస్థల ఆస్తులు విక్రయించాలని, నూతన యాజమాన్యం నిర్ణయించిన సంగతి తెలిసిందే. 'కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ తరహాలోనే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్, దాని అనుబంధ సంస్థల ఆస్తులకూ ఒక విధానాన్ని అనుసరించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఎంత మేర చెల్లించాల్సి ఉంది, పరిష్కార ప్రక్రియకు అవకాశం ఉందా..? వంటి అంశాలను పరిశీలించేందుకు రుణదాతల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటి పర్యవేక్షణకు పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు జడ్జిని నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచిస్తున్నాం' అని జస్టిస్ ఎస్.జె.ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల ఎన్‌సీఎల్‌టీ బెంచ్ సూచించింది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-96.66 ▼	-26.65 ▼	0 ◀◀	30,770	100 ▲	41,400	70.41
36,009.84	10,794.95	30,050	ప్రొద్దుటూరు 30,720	40,400	ప్రొద్దుటూరు 42,049	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడికి మార్గాలివి..


మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేందుకు అందుబాటులో ఉన్న వివిధ మార్గాల వివరాలు తెలుసుకుందాం..



మ్యూచువల్ ఫండ్లలో మూడు రకాలుగా పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. పెట్టుబడిదారు తన వీలుని బట్టి ఏ మార్గం అయినా ఎంచుకోవచ్చు. మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులుంటాయి. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, అనుమతి పొందిన సంస్థలు మదుపర్లకు ఆన్‌లైన్ సదుపాయాన్ని కల్పిస్తాయి. బ్యాంకులు, బ్రోకర్ ఏజెన్సీలు, పంపిణీదారులు, ఆర్థిక సలహాదార్లు మదుపర్లకు ఆఫ్‌లైన్ పద్ధతిలో మదుపు చేసేందుకు సహకరిస్తాయి.

మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడి పెట్టేందుకు అవసరమైనవి :

- పాన్ కార్డు
- రెండు కలర్ ఫొటోలు
- చిరునామా ధ్రువీకరణ పత్రం
- గుర్తింపు కార్డు
- కేవైసీ నమోదు
- కేవైసీ దరఖాస్తు ఫారం



ఆన్‌లైన్ పెట్టుబడి విధానం

- మ్యూచువల్ ఫండ్ ఆన్‌లైన్ పెట్టుబడులను మూడు విధాలుగా చేయొచ్చు
- ఏఎమ్‌సీ వెబ్‌సైట్లు
- బ్రోకర్ వెబ్‌సైట్లు
- ఇండిపెండెంట్ ప్లాట్‌ఫారంలు

అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల (ఏఎమ్‌సీ) వెబ్‌సైట్లు :

మ్యూచువల్ ఫండ్ సంస్థలు వెబ్‌సైట్ల ద్వారా నేరుగా పెట్టుబడి పెట్టే సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. ఆన్‌లైన్‌లోనే మ్యూచువల్ ఫండ్ లావాదేవీలను జరపవచ్చు. మొదటిసారి పెట్టుబడి పెట్టేటప్పుడు నేరుగా ఫండ్ కంపెనీని లేదా అధీకృత కేంద్రానికి పెట్టుబడిదారు వెళ్లి దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. లేదా క్యామ్స్/ కార్వీ కేంద్రాల్లో సైతం ఈ ఫారంలను సమర్పించవచ్చు.

దశలవారీ చేయాల్సిన పనులు :

- కంపెనీ వెబ్‌సైట్ నుంచి ఎంచుకున్న ఫండ్ ఫారంని డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- వివరాలన్నీ నింపిన తర్వాత ఫారంతో పాటు, మొదటి చెక్కు పాన్‌కార్డు కాపీ, కేవైసీ పత్రాలను సమర్పించాలి.
- ఆన్‌లైన్ లావాదేవీలు జరిపేందుకు వ్యక్తిగత గుర్తింపు సంఖ్య (పిన్) కోసం దరఖాస్తు చేయాలి.
- ఒకసారి దరఖాస్తు చేసిన తర్వాత ఫోలియో నంబరు, పిన్ కేటాయింపులు అయినట్లయితే తదుపరి లావాదేవీలను బ్యాంక్ ఖాతా ద్వారా ఆన్‌లైన్‌లోనే జరపొచ్చు.

బ్రోకర్ ప్లాట్‌ఫారంలు :

- ఇదివరకే షేర్ మార్కెట్లో పెట్టుబడి పెట్టేందుకు డీమ్యాట్ ఖాతా కలిగి ఉంటే, మ్యూచువల్ ఫండ్లను సైతం దాని ద్వారానే కొనుగోలు చేయవచ్చు.
- పెద్ద పెద్ద బ్రోకరేజీలన్నీ ఈరోజుల్లో ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈ మ్యూచువల్ ఫండ్ ప్లాట్‌ఫారంలతో అనుసంధానమై ఉంటాయి.
- డీమ్యాట్ ఖాతాలోకి లాగిన్ అయి, మీరు పెట్టుబడి పెట్టాలనుకున్న పథకాన్ని ఎంచుకోవచ్చు.
- సిప్ ద్వారా పెట్టుబడి పెట్టాలనుకునేవారికి బ్రోకర్లు ఆన్‌లైన్ సిప్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు.
- ఒకసారి యూనిట్ల కొనుగోలు జరిపిన తర్వాత డీమ్యాట్ ఖాతాలో ఈ యూనిట్లు జమ అవుతాయి.

ఉదాహరణకు

ఐసీఐసీఐడైరెక్ట్, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్, కొటక్ సెక్యూరిటీస్, బిర్లా మైయూనివర్స్ వంటివి ఈరకమైన బ్రోకరేజీల్లో ఉన్నాయి.

ఇండిపెండెంట్ పోర్టల్స్:

మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లకు ప్రాథమిక సేవల నుంచి మొదలుకొని అన్ని సంబంధిత సేవలు అందించేందుకు ఆన్‌లైన్ ఇండిపెండెంట్ వెబ్‌సైట్లు కూడా ఉన్నాయి.

ఉదా: ఫండ్స్ ఇండియా, ఫండ్ సూపర్‌మార్ట్, ఇన్వెజ్ట్, మొదలైన సంస్థలు మ్యూచువల్ ఫండ్లను ఆన్‌లైన్‌లోనే కొనే, అమ్మే సదుపాయాలను ఇవి కల్పిస్తున్నాయి.

చేయాల్సిందల్లా మొదటిసారి ఆయా వెబ్‌సైట్లలో ఖాతాను తెరవడమే.

మొదటిసారి ఆన్‌లైన్ ఖాతా తెరిచేటప్పుడు ప్రాథమిక సమాచారాన్ని నింపాలి.

దాంతో పాటు పాన్ కార్డ్ కాపీ, రద్దుచేసిన చెక్కును అందజేయాలి.

పూర్తిచేసిన దరఖాస్తును, అవసరమయ్యే పత్రాలను వారి మెయిల్‌ఐడీకి సైతం పంపవచ్చు.

మీరు ఇది వరకే కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేసి ఉండకపోతే ఈ పోర్టల్ మీకు కేవేసీ ప్రక్రియలో సహకరించి మొత్తం పనిని చేసి పెడుతుంది.

అన్ని పత్రాలను సరి చూసిన తర్వాత మీ ఖాతా తెరిచే ప్రక్రియ పూర్తవుతుంది.

దాదాపు అన్ని బ్యాంకులతో ఈ వెబ్‌సైట్లు ఒప్పందం కుదుర్చుకుని ఉంటాయి.

దీని ద్వారా తదుపరి లావాదేవీల కోసం బ్యాంకులకు ఈసీఎస్ మ్యాన్డేట్ సమర్పిస్తే ఖాతా నుంచి నేరుగా సిప్ సిప్ పెట్టుబడులకు మళ్లించడం అవుతుంది.

పెట్టుబడులు మర్చిపోకండి

మదుపు చేయండి.. మర్చిపోండి.. సాధారణంగా ఆర్థిక నిపుణులు చెప్పే సూచన ఇదే. దీర్ఘకాలంపాటు పెట్టుబడులు కొనసాగించాలనేందుకు దీన్ని వాడుతుంటారు. అయితే, చాలామంది తాము పెట్టిన పెట్టుబడుల గురించి పూర్తిగా మర్చిపోతుంటారు. కనీసం కుటుంబ సభ్యులకూ వాటి విషయాన్ని చెప్పరు. దీనివల్ల తమ పెట్టుబడులకు ఏ ప్రయోజనం లేకుండా మారిపోతోంది.

కుటుంబంలో ఒక వ్యక్తి మరణిస్తే.. అతనికి సంబంధించిన పెట్టుబడుల వివరాలు తెలియకపోవడంతో ఆ మొత్తాలను వెనక్కి తీసుకోకపోవడంతో కొన్ని కోట్ల రూపాయలు బ్యాంకులు, బీమా సంస్థలు, డీమ్యాట్ తదితరాలలో ఉండిపోతున్నాయి. వీటికి కారణం.. పెట్టుబడులు పెట్టిన వ్యక్తి తన పెట్టుబడుల గురించి ఎవరికీ కనీస సమాచారం తెలియనీయకపోవడం.. నామినీ పేరును కూడా పేర్కొనకపోవడం.

- బీమా పాలసీలు తీసుకునేది మన కుటుంబానికి ఆర్థిక రక్షణకోసమే కదా! మరి, మీరు ఆ విషయాన్ని ఎవరికీ చెప్పకపోతే ఎలా? మీరు తీసుకున్న పాలసీల వివరాలన్నీ ఒకచోట రాసి పెట్టండి. ఏ పాలసీకి ఎవరు ఏజెంటో వారి ఫోన్ నెంబరును కూడా తెలియజేయండి. నామినీ పేరు ఎవరిది రాశారో చూసుకోండి. ఒకవేళ పేర్కొనకపోతే వెంటనే, నామినీ పేరును బీమా పాలసీలో చేర్పించండి.
- డీమ్యాట్ ఖాతాలకు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులకు కూడా నామినీ ఎంతో అవసరం. లేకపోతే.. ఏదైనా జరిగినప్పుడు.. ఆ డబ్బును ఎవరికి ఇవ్వాలో తెలియక ఇబ్బందులు ఎదురవుతాయి. పెట్టుబడుల గురించి తెలిస్తే.. ఎలాగోలా వారసత్వ ధ్రువీకరణలు పెట్టి తీసుకోవచ్చు. కానీ, అసలు తెలియకపోతే.. మీరు పెట్టిన పెట్టుబడులన్నీ ఎవరికీ పనికిరాకుండా పోయినట్లే! అవునా? అందుకే, ఒకసారి మీ డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్లను పరిశీలించండి. నామినీ పేరు ఉందా చూసుకోండి.
- ఇక బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల సంగతి కొంత ప్రత్యేకం. వీటిని ఎప్పటికప్పుడు పట్టించుకోవాలి. బ్యాంకు ఖాతాకు నామినీ పేరు ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా బ్యాంకులు డిపాజిట్ చేసేప్పుడే వ్యవధి తీరిన తర్వాత సొమ్ము తీసుకుంటారా? లేక ఆటో రెన్యువల్ చేయాలా అని అడుగుతుంటాయి. ఆటో రెన్యువల్ ఎంచుకోవడం వల్ల గడువు తీరగానే బ్యాంకుకు వెళ్లి, తిరిగి డిపాజిట్ చేయాల్సిన అవసరం ఉండదు. దాదాపు 90శాతం మంది ఇలా ఆటో రెన్యువల్‌కే మొగ్గు చూపిస్తారని బ్యాంకింగ్ నిపుణులు అంటున్నారు. పెట్టుబడుల గురించి ఆలోచించడానికి సరైన సమయం చిక్కని వారంతా ఆటో రెన్యువల్ ఎంచుకోవడమే మంచిది. అయితే, దీనివల్ల కొన్ని నష్టాలూ ఉన్నాయన్న సంగతి మాత్రం మర్చిపోకూడదు.
- ప్రస్తుతం వడ్డీ రేట్లు తగ్గుతున్న దశలో ఉన్నాయి. అదే వ్యవధికి వేరే బ్యాంకు కొంత ఎక్కువ వడ్డీ ఇస్తుండవచ్చు. ఇలాంటప్పుడు ఆటో రెన్యువల్ వల్ల నష్టపోవాల్సి వస్తుంది.
- ఫిక్సెడ్ డిపాజిట్ ఆటో రెన్యువల్ పెట్టుకుంటే.. గడువు తీరేలోగా దాన్ని మార్చుకోవచ్చు. గడువు రోజు కూడా బ్యాంకుకు వెళ్లి దాన్ని వద్దనేందుకు వీలుంది. కానీ, ఒక్కసారి పునరుద్ధరణ అయ్యాక దాన్ని తిరిగి తీసుకోవాలంటే.. రుసుము భరించాల్సిందే.
- ఆటో రెన్యువల్ కన్నా కూడా.. వ్యవధి ముగియగానే నేరుగా మీ ఖాతాలోకి సొమ్ము వచ్చి చేరేలా సౌకర్యాన్ని ఎంచుకోవడం మేలు. ఇప్పుడు సేవింగ్ బ్యాంకు ఖాతాకు కూడా 4శాతం వడ్డీ ఇస్తున్నారు. కాబట్టి, డిపాజిట్ చేయడానికి కొంత సమయం తీసుకున్నా పెద్దగా నష్టపోయేదేమీ ఉండదు.

ఆపేసి ఓడినవాడున్నాడు కానీ.. ప్రయత్నించి ఓడిపోయిన వాడు లేడు



గౌతం తిన్ననూరి దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'జెర్సీ'. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పర్ఫెక్షన్ కోసం నాని క్రికెట్‌లో శిక్షణ తీసుకుని మరీ షూటింగ్‌లోకి ఎంటర్ అయ్యాడు. అర్జున్ అనే పాత్రలో నాని మెప్పించనున్నాడు. సూర్యదేవర నాగవంశీ నిర్మాణ సారథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అనిరుథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై పీడీవీ ప్రసాద్ 'జెర్సీ'ని సమర్పిస్తున్నారు. "నీ ఏజ్ ఇప్పుడు 36 అర్జున్.. ప్రొఫెషనల్ స్పోర్ట్స్ నుంచి రిటైర్ అయ్యే ఏజ్' అనే వాయిస్ ఓవర్‌తో టీజర్ స్టార్ట్ అవుతుంది. 'యు ఆర్ ది లూజర్ ఆఫ్ యువర్ లైఫ్' అని నానికి చెప్పగా.. భావోద్వేగానికి గురయ్యే సీన్ ఆకట్టుకునేలా గౌతమ్ డిజైన్ చేశారు. 'ఆపేసి ఓడిపోయినవాడున్నాడు కానీ.. ప్రయత్నించి ఓడిపోయిన వాడు లేడు' అంటూ నాని చెప్పే డైలాగ్ స్ఫూర్తిని కలిగిస్తోంది.

అనుష్కతో హాలీవుడ్ స్టార్?





అగ్ర కథానాయిక అనుష్క తన తర్వాతి సినిమాకు సిద్ధమౌతున్న సంగతి తెలిసిందే. ఇందులో మాధవన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. నిర్మాత, రచయిత కోన వెంకట్ ఈ సినిమా కోసం పనిచేస్తున్నారు. కాగా ఈ సినిమాకు సంబంధించి ఓ వార్త తెగ ప్రచారంలో ఉంది. ఇందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ మైఖెల్ మాడ్సన్ ప్రతినాయకుడి పాత్ర పోషించనున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవల ఈ ప్రాజెక్టును ఉద్దేశించి కోన ఓ పోస్ట్ చేశారు. సినిమాలో అనుష్క లుక్ అద్భుతంగా ఉంటుందని, ఇది ఆమె సినీ కెరీర్‌లోనే ది బెస్ట్ లుక్ కాబోతోందని అన్నారు. ఈ సినిమాకు హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించనున్నారు. దీనికి 'సైలెన్స్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇందులో అనుష్క దివ్యాంగురాలి పాత్రలో కనిపించనున్నారట. థ్రిల్లర్ కథాంశంతో దీన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. గోపీ మోహన్, కోన సినిమా కథ రాశారు. ఈ కథ కోసం దాదాపు రెండేళ్లు కష్టపడ్డట్లు ఇటీవల ఓ ఆంగ్లపత్రికతో కోన అన్నారు. అంతేకాదు రూ.40 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు చెబుతున్నారు. మార్చిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాబోతోందట. దాదాపు సినిమా షూటింగ్ అమెరికాలో జరగనున్నట్లు తెలిసింది.

'ఉండిపోరాదే..' టైటిల్ ఫిక్స్



తరుణ్ తేజ్, లావణ్య హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతూ శ్రీమతి సత్య ప్రమీల కర్లపూడి సమర్పణ లో గోల్డ్ టైమిన్ పిక్చర్స్ బ్యానర్‌పై డాక్టర్ లింగేశ్వర్ నిర్మిస్తున్న చిత్రానికి ఉండిపోరాదే.. అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు బ్యానర్‌లో అసోసియేట్ దర్శకుడిగా పనిచేసిన నవీన్ నాయని దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే రాజమండ్రి, ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో మెదటి షెడ్యూల్ షూటింగ్‌ని పూర్తి చేసుకుంది. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ని మెదటి లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత డా. లింగేశ్వర్ మాట్లాడుతూ.. 'కథ స్ట్రాంగ్‌గా ఉంటే కథకు తగ్గ నటీనటులు ఉంటే.. ఆ కథని తెరకెక్కించే దర్శకుడు ఉంటే కొత్త, పాత అనే తేడా చూపకుండా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఇదే బేస్ చేసుకుని చక్కటి కథని మా బ్యానర్‌లో తెరకెక్కిస్తున్నాం. నవీన్ నాయని దర్శకుడు, తరుణ్ తేజ్, లావణ్యలు జంటగా కనిపిస్తారు. ఈ చిత్రానికి 'ఉండిపోరాదే' అనే చక్కటి టైటిల్‌ని ఖరారు చేశారు. సంక్రాంతి సందర్భంగా మా చిత్రం మెదటి లుక్‌ని విడుదల చేశాం. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో మెదటి షెడ్యూల్‌ని పూర్తి చేశాం. అలాగే మా తదుపరి షెడ్యూల్‌ని ఈ నెల 28 నుంచి బెంగుళూరు, మైసూర్, కరీంనగర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా చిత్రీకరిస్తాం. మా చిత్రంలో కేధార్ శంకర్, సత్య కృష్ణన్, సిద్ధిక్షా, అల్లు రమేష్, నారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మా చిత్రం తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆదరిస్తుంది' అని అన్నారు.

వీడియో చూసి ఏడ్చా



'ఛలో' సినిమాతో కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ముద్దుగుమ్మ రష్మిక. తర్వాత 'గీత గోవిందం'లో కనిపించిన ఈ భామకు కుర్రకారులో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఈ సినిమాకు ఉత్తమ నటిగా రష్మిక ఇటీవల 'జీ సినిమా' అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులు రష్మిక కోసం ఓ ప్రత్యేకమైన వీడియోను రూపొందించారు. 'గీత గోవిందం' ఆడియో ఫంక్షన్ వీడియోను, ఓ ఇంటర్వ్యూ వీడియోను, సినిమాలో ఆమె స్టిల్స్‌ను కలిపి దీన్ని రూపొందించారు. ఈ వీడియోను రష్మిక ఫ్యాన్స్ ట్విటర్‌లో షేర్ చేస్తూ ఆమెకు ట్యాగ్ చేశారు. దీన్ని చూసిన ఆమె భావోద్వేగానికి గురయ్యారు. 'నేను ఏ మాత్రం ఊహించలేదు. ఈ ఎడిట్ చూస్తున్నప్పుడు ఏడ్చేశాను. ఏం చేశానని ఇంత ప్రేమకు నేను అర్హురాలినో తెలియదు కానీ.. మీలా ప్రోత్సహించే వారు నా చుట్టూ ఉన్నందుకు గర్వంగా ఉంది. నాకు చాలా ఆనందంగా ఉంది. కన్నీరు ఆగట్లేదు. ఐ లవ్ యు సో మచ్ గాయ్స్' అని రష్మిక ట్వీట్ చేశారు. రష్మిక 'దేవదాస్' సినిమాతో గత ఏడాది సెప్టెంబరులో హిట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె 'డియర్ కామ్రేడ్' చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్నారు. భరత్ కమ్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను యశ్ రంగినేని నిర్మిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తున్నారు. మరోపక్క రష్మిక కన్నడలో రెండు సినిమాల్లో నటిస్తున్నారు.

హీరోయిన్ మసాలా ఎంట్రీకి విమర్శలు



బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాని మహేష్ బాబు 'భరత్ అనే నేను' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమా సూపర్ హిట్ కావడంతో వెంటనే చరణ్ సినిమా 'వినయ విధేయ రామ' లో అవకాశం వచ్చింది. బోయపాటి-చరణ్ కాంబినేషన్ పై అంచనాలు ఉండడంతో ఈ సినిమా విజయంపై కియారా కూడా నమ్మకంగా ఉంది. కానీ విడుదలైన తర్వాత రెస్పాన్స్ మాత్రం అంత పాజిటివ్ గా అయితే లేదు. ఇదిలా ఉంటే 'వినయ విధేయ రామ' లో కియారా ఎంట్రీ సీన్ హాట్ టాపిక్ అయింది. దర్శకుడు హీరోయిన్ ను క్లీవేజ్ షోతో పరిచయం చేసిన తీరుపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇంట్రో సీన్ కోసం బోయపాటి మరో సీన్ ఎంచుకొని ఉండాల్సిందని అంటున్నారు. కమర్షియల్ సినిమాల్లో ఇలాంటి సీన్లు కామనే గానీ కొత్త తరం ఫిలిం మేకర్లు రావడంతో ఈ పాతకాలం సీన్లు ఈమధ్య తగ్గిపోయాయి. కానీ బోయపాటి తీసింది పక్కా మాస్ ఫార్మాట్ సినిమా కాబట్టి ఓల్డ్ టెంప్లేట్ ను బ్లైండ్ గా ఫాలో అయ్యాడు. ఒకరకంగా అయన అనుకున్నట్టే కియారా ఎంట్రీ సీన్ వచ్చినప్పుడు థియేటర్లో ఈలలు అరుపులు వినిపిస్తున్నాయి. అయినా కియారాకు అందాలు ధారపోయడం కొత్తకాదు. 'లస్ట్ స్టోరీస్' వెబ్ సిరీస్ కనుక చూస్తే విమర్శలు చేసే ఈ నెటిజనుల నోళ్ళు మూతపడడం ఖాయం. బోయపాటి ఒక మాస్ మాస్టర్ పీస్ తీసేందుకు ప్రయత్నించాడు. క్లీవేజ్ షోలు.. తలలు నరకడాలు గద్దలు ఆ తలలను పట్టుకెళ్ళే సీన్లు ఉండొద్దంటే ఎలా.. అర్థం చేసుకోరూ!

పూర్తి బాధ్యతలు చార్మికేనట



చార్మి నిర్మాతగా అవతారమెత్తి పూరీ జగన్నాథ్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఆ మధ్య పూరీ జగన్నాథ్ కొడుకుతో తీసిన 'మెహబూబా'లో పెట్టుబడి పెట్టి చార్మి చేతులు కాల్చుకుంది. ఆ సినిమా తర్వాత చార్మి పేరు పెద్దగా వినిపించలేదు. ఇన్ని రోజులకు మళ్ళీ చార్మి పేరు సినీ సర్కిల్‌లో వినిపిస్తోంది. ఈ సారి కూడా పూరీ జగన్నాథ్ కొత్త సినిమాలో చార్మి కీలక పాత్ర పోషించ బోతోంది. అయితే ఈ సారి కూడా తెర వెనుక మాత్రమే. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి చార్మిని పూర్తిగా నమ్మేశాడు. అందుకే మొన్నటి వరకు చార్మికి కొన్ని అధికారాలు మాత్రమే ఇచ్చిన పూరీ ఈ సారి పూర్తి స్థాయిలో అధికారాలు అప్పగించాడట. నటీనటుల ఎంపిక దగ్గర నుంచి.. ఆర్థిక వ్యవహారాలు అన్నీ చార్మినే చూసుకోమన్నాడట పూరీ. కాకపోతే ఈ సారి డబ్బు పెట్టలేదట కానీ, పెత్తనం మాత్రం చేస్తోందట.

కాంగ్రెస్‌లో విలీనం ప్రసక్తే లేదు..: కోదండరామ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలంగాణ జనసమితి (టీజేఎస్)ను కాంగ్రెస్‌లో విలీనం చేసే ప్రసక్తే లేదని ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరామ్ స్పష్టంచేశారు. లోక్‌సభ ఎన్నికలు, పొత్తులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై శనివారం నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కూటమి ఓటమిపైగానీ కూటమిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అనే విషయంపైగానీ చర్చ జరగలేదన్నారు. వచ్చే ఎన్నికలపై తమ పార్టీకంటూ అంతర్గతంగా ఓ ఆలోచన ఉందని కోదండరామ్ తెలిపారు. పార్టీ పెట్టిన కొద్ది నెలల్లోనే ఎన్నికలు రావడమే తమ ఓటమికి కారణంగా భావిస్తున్నామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలన్నది చర్చించి నిర్ణయిస్తామని చెప్పారు. పంచాయతీల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించటం సరికాదని, బీసీ రిజర్వేషన్లపై గట్టి ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆయనన్నారు. ప్రైవేటు రంగంలో స్థానికులకే అవకాశాలివ్వాలని కోదండరామ్ డిమాండు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, ఎన్నికల అధికారిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఓట్ల తొలగింపుపై బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. రాష్ట్ర ఎన్నికల అధికారిపై రాష్ట్రపతికి, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

సీబీఐలో పరిణామాలు ఆందోళనకరం : సీపీఐ

న్యూఢిల్లీ : సీబీఐ విశ్వసనీయత పునరుద్ధరణ అతిపెద్ద సవాల్‌గా మారిందని సీపీఐ అభిప్రాయపడింది. సీబీఐలో పరిణామాలు మరింత మురికిగా తయారయ్యాయని ఆందోళన వెలిబుచ్చింది. సీబీఐ ప్రతిష్ట దిగజారడానికి కేంద్ర ప్రభుత్వ జోక్యమే ప్రధాన కారణమని వ్యాఖ్యానించింది. సీబీఐలో జరుగుతున్న పరిణామాలపై ఆందోళన వ్యక్తంచేస్తూ సీపీఐ కేంద్రకార్యదర్శి వర్గం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ లోపలా, బయటా జరుగుతున్న పరిణామాలు చాలా గందరగోళం సృష్టిస్తున్నాయి. సీబీఐ డైరెక్టరు అలోక్‌వర్మను మోడీ ప్రభుత్వం తొలగించింది. సుప్రీం కోర్టు ఆయనను తిరిగి యథాస్థానంలో ఉండాలని ఆదేశించింది. 48 గంటలు తిరగకముందే ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని సెలెక్టు కమిటీ...అలోక్‌వర్మపై మళ్లీ వేటు వేసింది. ఫైర్ సర్వీసెస్ డైరెక్టరు జనరల్‌గా బదిలీ చేసింది. సీవీసీ నివేదిక ఆధారంగా వర్మపై అనేక ఆరోపణలు చేసింది. సీబీఐ, సీవీసీ రెండింటినీ ప్రశ్నించాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం వివరణ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వకుండా అలోక్‌వర్మను సెలెక్టు కమిటీ తొలగించింది. బదిలీ చేసిన అగ్నిమాపకశాఖ బాధ్యతలు తీసుకోవడానికి బదులుగా అలోక్‌వర్మ తన పదవికి రాజీనామా చేశారు. ప్రభుత్వ జోక్యం కారణంగానే ఈ పరిణామాలన్నీ జరిగాయని, ఇకనైనా మురికి రాజకీయాలకు స్వస్తి చెప్పాలని మోడీ ప్రభుత్వానికి సీపీఐ హితవు పలికింది.

యూపీలో ఫిఫ్టీ ఫిఫ్టీ

- ఎస్పీ, బీఎస్పీ చెరో 38 చోట్ల పోటీ
- అఖిలేష్, మాయావతి అధికారిక ప్రకటన
- చిన్న పార్టీలకు రెండు స్థానాల కేటాయింపు
- కూటమిలో కాంగ్రెస్ లేదని స్పష్టీకరణ
- అమేథీ, రాయ్‌బరేలీలో పోటీ లేదన్న నేతలు
- దేశ ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నట్లు వెల్లడి



లక్నో : దేశంలోనే అతి పెద్ద రాష్ట్రం, అత్యధిక లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మధ్య పొత్తు కుదిరింది. రానున్న సాధారణ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేయాలని పది రోజుల క్రితమే నిర్ణయం జరిగింది. వచ్చే ఎన్నికల్లో ఎస్పీ 38 స్థానాలకు, బీఎస్పీ 38 స్థానాలకు పోటీ చేయాలని నిర్ణయించాయి. రెండు సీట్లను చిన్న పార్టీల కోసం కేటాయించగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీలో పోటీ చేయకూడదని రెండు పార్టీలు నిర్ణయించాయి. యూపీలో ఎస్పీ, బీఎస్పీ పొత్తు అనైతికమని బీజేపీ వ్యాఖ్యానించగా, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) స్వాగతించింది. కాగా, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగా పోటీ చేయాలనే యోచనలో ఉంది. పొత్తులపై ఎస్పీ అధ్యక్షుడు, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి, మాజీ సీఎం మాయావతి లక్నోలో ఒక హోటల్‌లో శనివారం ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు. రెండు పార్టీల సమావేశం చారిత్రకమని, దేశ ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గద్దెదించేందుకే ఎస్పీ, బీఎస్పీ కలిసి పోటీ చేయాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. తమ కూటమిలో కాంగ్రెస్ పార్టీలేదని మాయవతి స్పష్టం చేశారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. కాంగ్రెస్‌పై పోరాటం చేసేందుకే బీఎస్పీ ఆవిర్భవించినట్లు తెలిపారు. కూటమిలో కాంగ్రెస్ ఉండటం వల్ల ఎస్పీ, బీఎస్పీకి నష్టమేగానీ, ఉపయోగం ఉండదన్నారు. అయితే, అమేథీ, రాయబరేలీలో మాత్రం పోటీ చేయకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పూల్‌పూర్, గోరఖ్‌పూర్, కైరానా లోక్‌సభ ఉప ఎన్నికల్లో మాదిరిగానే, సాధారణ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. ఎస్పీ, బీఎస్పీ కూటమి గెలుపుపై తనకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. మతోన్మాద పార్టీపై ఉమ్మడిగా పోటీ చేసి గెలుపొందటమే తమ లక్ష్యమని తెలిపారు. రెండు పార్టీల పొత్తు నిర్ణయం ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాకు నిద్రలేని రాత్రులనే మిగుల్చుతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అదృశ్యం కావటం తథ్యమన్నారు. అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్‌ను కులప్రదేశ్‌గా బీజేపీ మార్చిందని విమర్శించారు. చివరకు దేవుళ్లను కూడా విభజించటం శోచనీయమన్నారు. విభజించి పాలించు అనే నినాదంతో ఉన్న బీజేపీకి ఈసారి ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. యూపీలో రెండు పార్టీల మధ్య పొత్తు కుదరటం, లోక్‌సభ ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. 1995లో ఎస్పీ, బీఎస్పీ పొత్తు చీలిన ఘటనను రెండు పార్టీలు మరచిపోయినట్లు చెప్పారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ చీఫ్ కాన్షిరామ్, ఎస్పీ చీఫ్ ములాయంసింగ్ యాదవ్ నేతృత్వంలో పోటీ చేసి విజయం సాధించినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని చెప్పారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేయటం వల్ల ప్రజలు, కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులకు ప్రయోజనకరమని వివరించారు.

అస్తిత్వం కోసమే పొత్తు : బీజేపీ

యూపీలో అస్తిత్వాన్ని కాపాడుకునేందుకే ఎస్పీ, బీఎస్పీ పొత్తు కుదుర్చుకున్నాయని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. యూపీలో రెండు ప్రతిపక్షాల మధ్య పొత్తు కుదిరిన వెంటనే న్యూఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశం కోసమే కూటమిగా ఏర్పడినట్లు ప్రకటించటం శోచనీయమన్నారు. ప్రధాని మోడీని ఎదుర్కొనలేకే రెండు పార్టీలు కలిశాయన్నారు. ఈ పొత్తు వల్ల సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం ఏమీ ఉండదని చెప్పారు. ఎన్నికలంటే మేథమెటిక్స్ కాదని, కెమిస్ట్రీ అని వ్యాఖ్యానించారు.

ఆ పొత్తు అనైతికం : సీఎం యోగి

ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తు అనైతికమని, దీనివల్ల రాష్ట్రంలో రాజకీయ అస్థిరత్వం, అవినీతి పెరిగే ప్రమాదం ఉందని సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల కోసం బద్ధ శత్రువులు ఒక్కటిగా పోటీ చేయటం శోచనీయమని బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల ప్రాంగణంలో చెప్పారు. బీజేపీ రామ్, రోటీని గౌరవిస్తుందని, సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధిని కోరుకోవటంతోపాటు ప్రజలపై గౌరవిస్తుం దన్నారు. కాంగ్రెస్ పార్టీ కుల, ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొట్టిందని విమర్శించారు.

యూపీలో బీజేపీ ఔట్ : మమతా బెనర్జీ

ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తును పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ స్వాగతించారు. ఈ పొత్తు వల్ల రానున్న ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీ తుడుచు పెట్టుకుని పోతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అఖిలేష్ యాదవ్, మాయావతి మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

ఒంటరి పోరుకు కాంగ్రెస్ ప్రయత్నాలు

ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తు కుదరగా, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగా పోటీ చేయాలనే యోచనలో ఉంది. ఇందుకోసం సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ నేతృత్వంలో పార్టీ సీనియర్ నాయకులు రాజ్ బబ్బర్, పీఎల్ పునియా, ప్రమోద్ తివారీ తదితరులు కసరత్తు చేస్తున్నారు.

పాలకులపై అసహనం, ఆగ్రహం


- భిన్న ఆలోచనల వేదిక భారత్
- ఏకపక్ష నిర్ణయాలకు తావు లేదు
- నాలుగున్నరేళ్లుగా ప్రజల ఇక్కట్లు
- దుబాయ్ వర్సిటీ విద్యార్థులతో రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : అధికారం వెలగబెడుతున్న ప్రభుత్వాధినేతల వైఖరిపై భారతదేశంలో అసహనం, ఆగ్రహం పెల్లుబికుతోందని ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. నాలుగున్నరేళ్లుగా పాలకుల మానసిక ధోరణిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని చెప్పారు. ఏకపక్ష నిర్ణయాలు, నిరంకుశత్వం, కనీసం సహచరులతోనూ సంప్రదిం పులు జరపకపోవడం రాచరికానికి సంకేతాలని నిందించారు. రెండు రోజుల యూఏఈ పర్యటనలో భాగంగా శనివారం దుబా య్‌లో ఐఎంటీ దుబాయ్ యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్ ముఖాముఖి మాట్లాడారు. భారతదేశం అసహనం, ఆగ్రహంతో ఊగిపోతోందని రాహుల్ చెప్పారు. ప్రజలపై భారతదేశం ఏకపక్ష నిర్ణయాలు రుద్దబోదని, అనేక రకాల ఆలోచనలు సంఘర్షిస్తుంటా యని తెలిపారు. 'భారతదేశమే ఆలోచనలు...ఆలోచనలే భారత'దేశం. ఇతరులు చెప్పింది వినడం కూడా భారతదేశ ఆలోచనల్లో భాగమే'నని రాహుల్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు దుబాయ్‌లో ఉన్న భారతీయులతో సమావేశం కావడానికి రాహుల్ యూఏఈ పర్యటనను ఎంచుకున్నారు. ఆకలి వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నందున భారతదేశం క్రీడలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం కష్టమేనని రాహుల్ చెప్పారు. 'సహనం మన సంస్కృతిలో అంతర్భాగం. అయితే, గడచిన నాలుగున్నరేళ్లుగా అనేక వర్గాల మధ్య విభజన, ప్రజల్లో పెద్ద ఎత్తున ఆగ్రహం పెల్లుబికుతోంది. అధికారంలో ఉన్న వారి మానసిక వైఖరి దీనికి ప్రధాన కారణం' అని అన్నారు. 'జర్నలిస్టులను చంపేస్తున్నారు. ప్రశ్నించిన వారిని అంతం చేస్తున్నారు. దీని గురించి అడిగితే పాలకుల్లో అసహనం పెరిగిపోతోంది. ఈ పరిస్థితులను మార్చాలని మేము కోరుకుంటున్నాం. వచ్చే ఎన్నికల్లో ఇదే పెద్ద సవాల్‌గా మారింది' అని రాహుల్ వివరించారు. ప్రపంచదేశాలతో పోలిస్తే భారతదేశానికి ఆరోగ్య సంరక్షణ ఓ మంచి అవకాశమని చెప్పారు. భారతదేశంలో అన్ని అవకాశాలు ఉన్నాయని, అన్ని రంగాల్లో దూసుకుపోతున్నామని చెప్పుకొచ్చారు. బ్యాంకింగ్ వ్యవస్థకు తుది రూపు ఇవ్వాల్సిన అవసరం ఉందని రాహుల్ చెప్పారు. చిన్న కంపెనీలు ఎదగడానికి చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు ఆర్థిక తోడ్పాటు అందించడం మంచిదన్నారు. రాహుల్‌గాంధీ శుక్రవారం యూఏఈ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తూమ్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు తాను కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. భారతదేశానికి చెందిన కార్మికులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. వాణిజ్యసంస్థల అధిపతులతో ముచ్చటించారు. దుబాయ్ లోని ఇండియన్ బిజినెస్ అండ్ ప్రొఫెషనల్ కౌన్సిల్ (ఐబీపీసీ) ప్రతినిధులతో భేటీ అయ్యారు. పంజాబీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

స్వేచ్ఛ ఇస్తేగా..చిలుక ఎగరడానికి...

సీబీఐ వివాదంపై మాజీ సీజేఐ లోధా విచారం



న్యూఢిల్లీ : చిలుకను పంజరంలో బంధిస్తే స్వేచ్ఛగా ఎలా ఎగురుతుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆర్ఎం లోధా ప్రశ్నించారు. సీబీఐని పంజరంలో చిలుకగా ఆయన గతంలో అభివర్ణించారు. సీబీఐ డైరెక్టరు అలోక్‌వర్మ బదిలీపై ఆయన తీవ్రంగా స్పందించారు. కమిటీని పిలవడానికి సంబంధించిన విధానపరమైన లోపాలను మాత్రమే సుప్రీంకోర్టు ప్రస్తావిస్తుందని, ప్రభుత్వం చెప్పినట్టు కమిటీ వింటుందని వ్యాఖ్యానించారు. కమిటీని ఉపయోగించుకొని సీబీఐ చీఫ్‌ను ప్రభుత్వం బదిలీ చేసిందని మాజీ సీజేఐ లోధా చెప్పారు. సీబీఐని నిజమైన దర్యాప్తు సంస్థగా తీర్చిదిద్దడానికి ఏదో ఒకటి కచ్చితంగా చేసి తీరాల్సిందే'నని జస్టిస్ లోధా ఓ ఆంగ్లపత్రికతో మాట్లా డుతూ చెప్పారు. సీబీఐ డైరెక్టరు అలోక్‌వర్మపై పదివారాల్లో ప్రభుత్వం రెండుసార్లు వేటు వేయ డంపై స్పందిస్తూ చిలుకను పంజరంలో పెట్టి స్వేచ్ఛగా ఎగరమంటే ఎలా అని ప్రశ్నించారు. చిలుక స్వేచ్ఛగా ఆకాశంలోకి ఎగరాలంటే ముందుగా దానికి ఎగరడానికి అవకాశం కల్పించాలని అన్నారు. సీబీఐ, ఇతర స్వయంప్రతిపత్తిగల సంస్థలను ప్రభుత్వాలు నిస్సిగ్గుగా తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుం టున్నాయని. ఇక్కడ ఆ ప్రభుత్వం...ఈ ప్రభుత్వం అనే తేడా లేదని, అన్ని ప్రభుత్వాలు చేస్తున్న దుర్మార్గం ఇదేనని జస్టిస్ లోధా ఆరోపించారు. తమ ప్రయోజనాల కోసం సీబీఐని ప్రభావితం చేయడం, వాడుకోవడం పెరిగిందన్నారు. సీబీఐ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున తాను మాట్లాడకూడదేమోనని వ్యాఖ్యానించారు. సీబీఐ స్వతంత్రంగా పనిచేయడం గురించి బొగ్గుకుంభకోణం కేసు విచారణ సమయంలో తాను స్పష్టంగా చెప్పానని గుర్తుచేశారు. ఇంకెంత కాలం సీబీఐని పంజరంలో చిలు కలా ఉంచుతారని కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్‌ను ప్రశ్నించినట్టు లోధా చెప్పారు. సీబీఐలో కొనసాగుతున్న ఆధిపత్య పోరు, అవినీతి ఆరోపణలపై అలోక్‌వర్మను ఆ పదవి నుంచి తొలగిం చడం, ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం, తనకు అనుకూలంగా సుప్రీం తీర్పు ఇవ్వడం వరుసగా జరిగాయి. సుప్రీంతీర్పు ఆధారంగా అలోక్‌వర్మ తిరిగి సీబీఐ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. 24గంటలు గడవకు ముందే హైపవర్ కమిటీ అలోక్‌వర్మపై బదిలీ వేటు వేసింది.

సీబీఎస్ఈలో రెండు స్థాయిల్లో లెక్కల పేపరు

న్యూఢిల్లీ : పదవ తరగతి విద్యార్థులకు 2020 నుంచి లెక్కల పేపరు రెండు స్థాయిల్లో ఉంటుందని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎగ్జామినేషన్సు (సీబీఎస్ఈ) ప్రకటించింది. అయితే, ఈ చర్యను విద్యావేత్తలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ దశలో ఈ చర్య అనవసరమని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో వారికి ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సీబీఎస్ఈ విడుదల చేసిన సర్క్యులర్ పేర్కొన్నది. రెండు స్థాయిల్లో పరీక్ష విద్యార్థులలో ఆసక్తిని ఏమాత్రం పెంచలేకపోతోందని తెలిపింది. ఈ రెండు స్థాయిలను మాథమేటిక్స్ స్టాండర్డుగా పిలుస్తారు. ఒకటి ప్రస్తుతం ఉన్న పేపరు కాగా, రెండోది ఈజియర్ మేథమేటిక్స్ బేసిక్. రెండు స్థాయిల్లో పరీక్షలకు సంబంధించి సిలబస్, తరగతి గదిలో బోధన, అంతర్గత మదింపు గతంలో వలే కొనసాగుతుంది. అందువల్ల విద్యార్థులు ఏడాదిపొడవునా మొత్తం అంశాలను అధ్యయనం చేసేందుకు వీలుకలుగుతుంది. తమ సామర్థ్యం, అవకాశం ఆధారంగా బోర్డు పరీక్షల స్థాయిని నిర్ణయించుకోగలుగుతారు" అని ఆ సర్క్యులర్ తెలిపింది.

ఈ చర్య వాంఛనీయం కాదని విద్యావేత్తలు పేర్కొన్నారు. "అనేక దేశాలలో సాధారణ విద్యా నిర్దిష్ట స్థాయిలో ఏకరూపంలోనే ఉన్నది. భారత్‌లో 10వ తరగతి వరకు అదేవిధంగా ఉన్నది. ఆ తరువాత ఆసక్తి, సామర్థ్యం బట్టి విద్యార్థులు అంశాలను ఎంపిక చేసుకుంటారు. సీబీఎస్ఈ ప్రస్తుతం తీసుకున్న చర్య ఈ భావనను నీరుగారుస్తుంది" అని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ఎనాలిసిస్‌కు చెందిన నాగతి నారాయణ అన్నారు. "10వ తరగతిలో సిలబస్, అంతర్గత మదింపు యథావిధిగానే ఉంటుంది. అటువంటప్పుడు రెండు స్థాయిల్లో పరీక్ష ఎందుకు? ప్రస్తుత పరీక్షల విధానంలో తప్పు ఏమిటి" అని ప్రశ్నించారు.

ప్రభుత్వాన్ని బలహీనపరిచే కుట్ర

- ఈబీసీ రిజర్వేషన్లతో పెరిగిన విశ్వాసం
- రైతుల ఆదాయం పెంపునకు కృషి
- బీజేపీ జాతీయ సదస్సులో మోడీ



న్యూఢిల్లీ : కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంటే తాము దేశాన్ని దోచుకోవడం కుదరదు కనుక ప్రభుత్వాన్ని బలహీనపరచాలని, నిస్సహాయ స్థితిలోకి నెట్టివేయాలని ప్రతిపక్షం కోరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. ఇక్కడి రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న బీజేపీ జాతీయ సదస్సునుద్దేశించి శనివారం ఆయన మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన వారికి (ఈబీసీలకు) విద్య, ఉద్యోగరంగాలలో 10 శాతం రిజర్వేషన్లు 'నవ భారత్'పై విశ్వాసాన్ని ఇనుమడింపజేస్తుందని అన్నారు. 'భారత రాజకీయా చరిత్రలో 'మహాగట్బంధన్' పేరుతో విఫల ప్రయోగంపైనే నేడు ప్రచారం జరుగుతోంది. నిస్సహాయ ప్రభుత్వాన్ని తయారుచేసేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు. తాము దేశాన్ని దోచుకోవడం కుదరనందున్న పటిష్టమంతమైన ప్రభుత్వాన్ని వారు కోరుకోవడంలేదు' అని అన్నారు. 'మేము బలమైన ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం. దానితో రైతులకు పంటలకు సరైన ధరను పొందుతారు. యూరియా కుంభకోణానికి పాల్పడేందుకు వీలుగా బలహీన ప్రభుత్వాన్ని ప్రతిపక్షం కోరుకుంటోంది" అని మోడీ ఆరోపించారు. ప్రతిపక్ష కూటమిపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఆలోచనల ఆధారంగా రాజకీయాలు ఉంటాయి. దార్శనికత ఆధారంగా సంకీర్ణాలుంటాయి. మొట్టమొదటిసారిగా ఈ రాజకీయ పార్టీలన్నీ ఒక్క వ్యక్తిని ఓడించేందుకు ఏకం అవుతున్నాయి' అని చెప్పారు. అయోధ్య భూవివాద కేసుపై మోడీ మాట్లాడుతూ, ఈ సమస్య పరిష్కారం కావాలని కాంగ్రెస్ పార్టీ కోరుకోవడంలేదని అన్నారు. "న్యాయవాదుల ద్వారా అయోధ్య కేసును అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం తప్పుడు అభియోగాలతో సీజేఐని అభిశంసించేందుకు కూడా సిద్ధపడుతోంది. ఇదేం మనస్తత్వం? ప్రతి అంశంలోనూ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోంది" అని ప్రధానమంత్రి చెప్పారు.

ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి విద్య, ఉద్యోగ రంగాలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించటంపై ప్రతిపక్షాల విమర్శలను ప్రస్తావిస్తూ, అన్ని సమస్యలకు ఇది పరిష్కారం కాదు. కానీ, "దేశాన్ని నూతన దిశలోకి తీసుకువెళ్లేందుకు ఇది ఒక మార్గం" అని చెప్పారు. ఈ విధంగా చేయడం ఎవరి హక్కులను హరించడం కాదని అన్నారు. దేశాన్ని అవినీతిరహితంగా నడిపించవచ్చునని బీజేపీ పాలన నిరూపించిందని అన్నారు. దేశ చరిత్రలో మొట్టమొదటిసారి ప్రభుత్వంపై ఎటువంటి అవినీతి ఆరోపణలు రాలేదని చెప్పుకున్నారు. ఇంతకుముందు రైతులను ఓటర్లుగా మాత్రమే చూసేవారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. "2022నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు మేము పగలూరాత్రి పనిచేస్తున్నాం" అని మోడీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో సీబీఐని నిషేధించడాన్ని తప్పుపట్టారు. "యూపీఏ హయాంలో 12 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా తాను ఉన్నప్పుడు తీవ్ర వేధింపులకు గురైనా రాష్ట్రంలో సీబీఐ ప్రవేశాన్ని ఏనాడు నిషేధించలేదు" అని మోడీ చెప్పారు.

కొడనాడ్ కేసులతో సంబంధం లేదు : పళనీస్వామి

చెన్నై : కొడనాడ్ ఎస్టేట్ కేసుల్లో తనకు సంబంధం లేదని తమిళనాడు ముఖ్యమంత్రి, ఆల్ ఇండియా ద్రవిడ మున్నేట్ర కజగం (ఏఐఏడీఎంకే) జాయింట్ కోఆర్డినేటర్ పళనీస్వామి స్పష్టం చేశారు. తెహల్కా మాజీ ఎడిటర్ సామ్యూల్ మాథ్యూ ఢిల్లీలో విడుదల చేసిన వీడియోల్లో తన ప్రమేయం ఉందనడాన్ని ఆయన ఖండించారు. పోలీసుల దర్యాప్తును కొనసాగిస్తారని, వీడియో విడుదల చేసిన వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. జయలలితకు చెందిన కొడనాడ్ ఎస్టేట్‌లో 2014 ఏప్రిల్ 14న సెక్యూరిటీ గార్డు హత్యకు గురయ్యాడు. దీనిపై దర్యాప్తు చేపడుతుండగా జయలలిత మాజీ కారు డ్రైవర్ సి.కనకరాజ్, కేవీ సయాన్ ఈహత్యకు కుట్ర జరిపారన్న ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఈ కేసులో మొత్తం 10 మందిపై కేసులు నమోదు చేయగా కనకరాజ్, కేవీసయాన్, అతని భార్య, కూతురు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని ఆయన వివరించారు. వీడియోపై కామెంట్లు చేసిన వారిపై పళనీస్వామి మండిపడుతూ ఈ కేసుల్లో 22 సార్లు కోర్టుకు హాజరైనప్పుడు ఎందుకు దీనిని ప్రస్తావించలేదని ప్రశ్నించారు.

నళినికి మద్రాసు హైకోర్టు ఊరట

చెన్నై : శారదా చిట్ ఫండ్ కేసులో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం భార్య నళినికి మద్రాసు హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో సీబీఐ అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణను కోర్టు ఆమెకు కల్పించింది. నళిని ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఇళాంతిరైయన్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమబెంగాల్ పరిధిలోకి వచ్చే కోర్టు నుంచి రెగ్యులర్ ముందస్తు బెయిల్ పొందేంత వరకు ఈ తాత్కాలిక రక్షణ ఉంటుంది. నాలుగు వారాల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన జడ్జి, ఎగ్మోర్‌లోని చీఫ్ జ్యుడిషియల్ కోర్టు ముందు లొంగిపోయి, తగిన ష్యూరిటీలు ఇచ్చిన తర్వాత రెగ్యులర్ యాంటిసిపేటరీ బెయిల్ కోసం బెంగాల్‌కోర్టును సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ

రామేశ్వరం : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయాలని తమిళనాడు గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్ విద్యార్థులను కోరారు. మండపం, పట్టినకకతన్‌ల్లో జరిగిన స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్న ఆయన పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆ మండపం, పట్టినకకతన్‌ల్లో ప్రదర్శనను ప్రారంభించి, జెండా ఆవిష్కరించారు. ప్లాస్టిక్ బ్యాగులతో పర్యావరణానికి నష్టమని తెలుపుతూ, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. రామనాథస్వామి ఆలయంలో మంగళతీర్థాన్ని ఆయన పునరుద్ధరించారు.

కొనసాగుతున్న శీతల గాలులు

చండీగఢ్ : పంజాబ్, హర్యానాల్లో శీతలగాలులు కొనసాగుతున్నాయి. ఆదంపూర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3.9 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది. రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధాని అయిన చండీగఢ్‌లో 7.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని వాతావరణ శాఖ తెలిపింది. పంజాబ్‌లోని అమృత్‌సర్, లూథియాన, పటియాలల్లో అత్యంత శీతల గాలులు కొనసాగుతున్నాయి. పఠాన్‌కోట్, హల్వారా, బఠిండలో వరుసగా 5.9,6.4, 6 గా నమోదు అయ్యాయి. హర్యానాలోని అంబాల, హిసార్, కర్నాల్‌లో వరుసగా 7.2, 7.5, 5.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. లుధియాన, హిసార్‌లో మంచు విపరీతంగా కురుస్తోందని వాతావరణ శాఖ వెల్లడించింది.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా:నలుగురు అరెస్టు

న్యూఢిల్లీ : మాదక ద్రవ్యాల అక్రమరవాణా కేసులో ఒక విదేశీయుడితో సహా నలుగురిని అరెస్టు చేశామని నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) వెల్లడించింది. అనంద్ విహార్ ప్రాంతంలో ఒక వ్యక్తినుంచి రూ. 35 లక్షల ఖరీదు చేసే ఏడు కిలోల హాషిష్‌ను స్వాధీనం చేసుకొని శనివారం అరెస్టు చేశామని, అతడు తరచూ రేవ్ పార్టీల్లో పాల్గొంటాడన్నారు. మరో ఘటనలో జమ్మూ నుంచి వస్తున్న ట్రక్ నుంచి 8 కిలోల హాషిష్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. మూడో ఘటనలో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో జనవరి 10న రూ. 35 లక్షల విలువ చేసే 25 కేజీల సూడో ఎఫిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నామని, దీనిని నిషేధిత ఔషధాల్లో వినియోగిస్తారు.

ఐఎస్ ఉగ్రవాది అరెస్టు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఐఎస్ఐఎస్ ప్రేరేపిత ఉగ్రవాది ముహ్మద్ అబ్సర్‌ను శనివారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. రాజకీయనాయకులు, ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకొని వరుస పేలుళ్లకు కుట్రపన్నారని ఆ సంస్థ తెలిపింది. ఇప్పటివరకు 12 మందిని అరెస్టు చేశామని, ఘజియాబాద్‌కు చెందిన అఫ్సర్ ఇంతకు ముందే అరెస్టయిన వారితో కలసి జమ్ము-కాశ్మీర్‌ల్లో సంచరించాడని అధికారులు వెల్లడించారు. వీరంతా గ్లోబల్ టెర్రరిస్టు హర్కత్ ఉల్ హరబ్ గ్రూపుకు చెందినవారన్నారు. గతనెల్లో నిర్వహించిన తనిఖీల్లో స్థానికంగా తయారు చేసిన రాకెట్ లాంఛర్, పేలుళ్లకు ఉపయోగించే పొటాషియం నైట్రేట్, అమ్మోనియం నైట్రేట్ , సల్ఫర్‌తోపాటు, టైమర్లుగా ఉపయోగించే 112 అలారం గడియారాలు, 91 మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రిక్ వైర్లు, 134 సిమ్ కార్డులు, 3ల్యాప్‌టాప్‌లు, కత్తి, చాకు, ఐఎస్ఐఎస్‌కు చెందిన సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

సెన్సెస్ ప్రకారం రిజర్వేషన్లు పెంచండి

పాట్నా : జనాభా గణాంకాలను బహిర్గతం చేసి, నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని బీహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందుస్థాన్ అవామీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జితిన్ రామ్ మాంజీ శనివారం డిమాండు చేశారు. రిజర్వేషన్లపై సీలింగ్‌ను 90 నుంచి 95కు పెంచాలని, అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడంపై అభ్యంతరం తెలుపబోమన్నారు. ఓబీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్సీ, ఎస్టీలకు కూడా వారి నిష్పత్తిని పెంచాలని అది వారి హక్కన్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించి పెంచరాదనడం సరికాదని తెలిపారు. బీసీలు 54శాతం ఉండగా,24 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించారని, ఎస్సీలు 30 శాతం ఉండగా 15 శాతం మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. జనాభా ప్రకారం ప్రతి ఒక్కరికీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన కోరారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను మినహాయించి ఎస్పీ- బీఎస్పీ పొత్తు పెట్టుకోవడం బీజేపీ కలసి వచ్చే అంశమని జితిన్ వెల్లడించారు.

ఏప్రిల్ 23, 24 తేదీల్లో సెట్

బెంగళూరు : ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్) ఈ ఏడాది ఏప్రిల్ 23, 24 తేదీలలో నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫారంసైన్స్ కోర్సులు, ఇతర కోర్సులలో ప్రవేశానికి ఈ సెట్‌లో అర్హత సాధించాలి. హోర్నాడు, గడినాడు కన్నడిగ అభ్యర్థుల కోసం ఏప్రిల్ 25న కన్నడ టెస్టు నిర్వహిస్తారు. కాగా, రాష్ట్రంలో రెండు ప్రవేశపరీక్షలకు ఒకే తేదీ నిర్ణయించడంతో లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కర్ణాటకలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రైవేట్ కోటా సీట్లలో ప్రవేశం కోసం నిర్వహించే కన్సార్టియం ఆఫ్ మెడికల్, ఇంజినీరింగ్, డెంటల్ కాలేజస్ ఆఫ్ కర్ణాటక (సీఓఎండీకే) టెస్టు, దేశంలోని న్యాయకళాశాలల్లో ప్రవేశం కోసం ఉమ్మడి న్యాయ ప్రవేశపరీక్ష (క్లాట్) ఒకే రోజున మే 12న జరగనున్నది.

నిరాశ చెందకండి : అమిత్‌షా

న్యూఢిల్లీ : ఇటీవల జరిగిన ఐదురాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారం కోల్పోవడంపై నిరాశ చెందవద్దని పార్టీ శ్రేణులకు అమిత్‌షా పిలుపు నిచ్చారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందుకు నడవాలని, పోలింగ్ రోజున 10.30 గంటలకు కుటుంబ సభ్యులు, మిత్రులు, ఓటు వేసే విధంగా చూడాలన్నారు. కులతత్వం, బంధుప్రీతికి కాంగ్రెస్ కేన్సరు లాంటిదన్నారు. ఆపార్టీ ప్రజాస్వామ్యాన్ని కుళ్లబొడిచి, అభివృద్ధిని అడ్డుకుందని ఆయన మండిపడ్డారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌ల్లో ప్రతిపక్షాలు విజయం సాధించినా అయితే బీజేపీ ఓడిపోలేదన్నారు. ప్రతి ఓటరుకు బీజేపీ చేరువ కావాలని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేస్తానని ప్రతి ఒక్కరూ శపథం చేయాలని అమిత్‌షా పార్టీ శ్రేణులను కోరారు.

విశాలాంధ్ర
Regional
ప్రాంతీయం
10
విజయవాడ
ఆదివారం
13 జనవరి 2019

ముచ్చుమర్రి నుంచి కేసీ ఆయకట్టుకు నీరు విడుదల

88 వేల ఎకరాల భూమికి సాగునీరు



విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : కేసీ ఆయకట్టుకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు నుంచి అనుమతి రావడంతో అధికారులు శుక్రవారం రాత్రి రెండు పంపులగుండా నీటిని విడుదల చేశారు. శనివారం మరో రెండు పంపుల ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కేసీ కాలువ కింద 88 వేల ఎకరాల ఆయకట్టు రైతులు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటి విడుదలతో శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల పరిధిలోని రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు అవకాశముంది. ఈ ప్రాంతంలో పసుపు 14 వేల ఎకరాలు, మిరప 10 వేల ఎకరాలు, ప్రొద్దుతిరుగుడు 15 వేల ఎకరాలు, మినుములు 10 వేల ఎకరాలు, మొక్కజొన్న 10 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఇటీవల కేసీ కాలువకు నీటిని నిలుపుదల చేయడంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఎట్టకేలకు నీటిని విడుదల చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

సంగీత కళాశాల
స్వర్ణోత్సవాలకు రూ.2 కోట్లు


విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : వచ్చేనెలలో జరగనున్న విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల స్వర్ణోత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసినట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శనివారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి సంగీత కళాశాల స్వర్ణోత్సవాలపై చర్చించిన వెంటనే నిధులు మంజూరుచేశారని తెలిపారు. విజయనగరం సంగీత కళాశాలకు గొప్ప విశిష్టత ఉందని, అక్కడ సంగీతం నేర్చుకున్న ఘంటసాల, సుశీల లాంటివారు రాష్ట్రానికి ఎంతో పేరుప్రఖ్యాతులు తెచ్చారని గుర్తుచేశారు. స్వర్ణోత్సవాలను పండుగ వాతావరణంలో భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ప్రిన్సిపాల్ అనురాధా పరశురామ్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మరో ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పిడుగురాళ్లలో భూ ప్రకంపనలు



విశాలాంధ్ర - పిడుగురాళ్ళ : గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ పట్టణంలో శనివారం మధ్యాహ్నం భూ ప్రకంపనలతో ప్రజలు బెంబే లెత్తిపోయారు. 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఇళ్ళు కదులుతున్నట్టు భూమి కంపించ డంతో ఇళ్ళ నుంచి జనం రోడ్లపైకి పరు గులు తీశారు. వెంటవెంటనే మూడు, నాలుగుసార్లు భూమి కంపించిందని, స్వల్ప శబ్దంతో గృహాలు అదిరినట్లు స్థానికులు తెలిపారు. వింత కదలికలపై ప్రభుత్వ అధికారులు విచారణ చేపట్టారు. గతంలో సున్నపురాయి క్వారీల్లో పేలుళ్ళ సమయంలో భూ కదలికలు రావడం, పెద్ద శబ్దాలు వినిపించడం లాంటిదేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పిడుగురాళ్ళ పట్టణంలోని లెనిన్‌నగర్ ప్రాంతంలో భూకంపం ప్రభావం ఉన్నట్టు సమాచారం అందుకున్న పట్టణ సీఐ పి. రవీంద్రబాబు, తహశీల్దార్ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ కె. శివరామిరెడ్డి స్థానికులతో చర్చించి వివరాలు సేకరించారు.

శ్రీశైలంలో కూలిన ఆలయ ప్రాకారం



విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహాక్షేత్రంలో ఆలయ ప్రాకారం ఆధునీకరణ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కూలిపోయింది. శ్రీశైల క్షేత్ర అభివృద్ధిలో భాగంగా ప్రాకారాన్ని వాస్తుపరంగా తీర్చిదిద్దేందుకు కొన్ని రోజుల నుంచి అమ్మవారి గర్భాలయం వెనుక భాగంలోని ప్రాకారాన్ని తొలగిస్తున్నారు. ఈ మరమ్మతు పనులు చేస్తుండగా శనివారం రాత్రి ప్రాకారం మొత్తం కుప్పకూలింది. దీని పక్కనే అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులు అక్కడి మండపాల్లో అమ్మవారి నామస్మరణ చేస్తుంటారు. ప్రాకారం ఆలయంవైపు కాకుండా బయటివైపునకు కూలడంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. సంబంధిత అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాత్రి సమయంలో ఆలయాల్లో పనులు చేయడం నిషేధం ఉన్నప్పటికీ చీకటిపడిన తరువాత ఇక్కడ పనులు చేయించడం అధికారుల నిర్లక్ష్యమేననే విమర్శలు ఉన్నాయి. సంక్రాంతి ఉత్సవాల ప్రారంభ రోజు ఇలా జరగడంతో భక్తులు ఆందోళన చెందారు.

అగ్రిగోల్డ్ భూ రగడ

- పోతేపల్లిలో 1.50 ఎకరాల ఆక్రమణకు యత్నం
- అనుచరులతో టీడీపీ నేత భారీ కుట్ర
- ఇరువర్గాల మధ్య వాగ్వివాదం
- పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి..



విశాలాంధ్ర- మచిలీపట్నం : కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రాంతంలో అగ్రిగోల్డ్‌కు చెందిన భూమిని ఓ టీడీపీ నాయకుడి అనుచరులు ఆక్రమించేందుకు ప్రయత్నించడం వివాదాస్పదమైంది. బందరు మండలం పోతేపల్లిలోని 1.50 ఎకరాల భూమి సరిహద్దు రాళ్లు తొలగించి చుట్టూ కంచె వేసేందుకు శనివారం యత్నించడం అలజడి రేపింది. ఈ భూమిలోని ప్లాట్లను గతంలో కొనుగోలు చేసిన కొందరు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్లాట్ల కొనుగోలుదారులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. 2009వ సంవత్సరంలో పోతేపల్లిలో 14 ఎకరాల భూమిని ఉప్పాల రాంప్రసాద్, మరికొందరి నుంచి అగ్రిగోల్డ్ యాజమాన్యం కొనుగోలు చేసింది. ప్లాట్లుగా మార్చి కొంతమందికి విక్రయించిన సంస్థ రిజిస్ట్రేషన్ కూడా చేసింది. ప్లాట్ల యజమానులు తమవేనని తెలిపే బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ బోర్డులను తొలగించి యంత్రాలతో భూమిని చదును చేసేందుకు పూనుకోవడం వివాదాస్పదమైంది.

30 మంది అనుచరులతో స్కెచ్

పోతేపల్లిలో అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన 14 ఎకరాల భూమిలో 1.50 ఎకరాలను ఓ టీడీపీ నాయకుడు విక్రయించారు. గత పదేళ్లుగా మిన్నకుండిపోయిన ఈ టీడీపీ నాయకుడు శనివారం 30 మందికిపైగా అనుచరులను భూమి వద్దకు పంపాడు. ఈ భూమి గొర్రెపాటి గోపీచంద్‌కు చెందినదంటూ ప్లాట్లుగా విభజించిన రాళ్ళను తొలగించారు. 1.50 ఎకరాల భూమి చుట్టూ కంచె వేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు ఘటనా స్థలికి చేరుకుని అగ్రిగోల్డ్ సంస్థ తమకు రిజిస్ట్రేషన్ చేసిందంటూ తమవద్ద ఉన్న పత్రాలను చూపారు. ఈ భూమిని గొర్రెపాటి గోపీచంద్ కుమారుడి పేరున కొనుగోలు చేశారని, అందుకు సంబంధించిన దస్తావేజులు తమ వద్ద ఉన్నాయని వారు పేర్కొనడం గమనార్హం.

అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో అదను చూసి టీడీపీ నాయకుడు అనుచరులతో 1.50 ఎకరాలపై కన్నేయడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అనుచరులు తమ ప్లాట్లను ఆక్రమిస్తున్న సమయంలో తాము అడ్డుకుంటే టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారని అగ్రిగోల్డ్ ఏజెంట్, ప్లాటు యజమాని ఎండీ హఫీజ్ రెహ్మాన్‌తోపాటు పలువురు బాధితులు విలేకరుల వద్ద వాపోయారు. ఈ అంశంపై విచారణ అనంతరం ఇరువర్గాలకు నచ్చచెప్పి పరిస్థితిని చక్కదిద్దామని తాలూకా ఎస్ఐ రంగనాథ్ తెలిపారు. గతంలో మచిలీపట్నంలో అనేక భూములను ఆక్రమించిన అనుభవమున్న ఈ టీడీపీ నాయకుడు మళ్లీ భూ ఆక్రమణలకు దిగడం సంచలనం కలిగిస్తోంది.

విశాఖకు ఈ-వాహనాలు

- తొలివిడత 58 ఎలక్ట్రిక్ బస్సులు
- బీఆర్‌టీఎస్ కారిడార్‌లో రాకపోకలు
- రూ. 299 కోట్ల అంచనాతో ప్రాజెక్టు రూపకల్పన

విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : విశాఖ మహానగరంలో వాహన వినియోగం పెరగడంతో కాలుష్యం అలముకుంటోంది. ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధమవు తున్న తరుణంలో మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) సైతం వినూత్న పద్ధతులతో ముందుకెళ్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలను (ఈ-వెహికల్స్) అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం పలు నగరాల్లో ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు సమాయత్తమవు తోంది. జీవీఎంసీ పరిధిలో 58 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. విశాఖపట్నం అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (వీయూటీసీఎల్)కి ఈ రవాణా బాధ్యత అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలక్ట్రిక్ బస్సులను బీఆర్‌టీఎస్ కారిడార్‌లో తిప్పాలని నిర్ణయించారు.

రెండు కారిడార్లలో ప్రాజెక్టు..

జీవీఎంసీలోని 41.5 కిలోమీటర్ల బీఆర్‌టీఎస్ కారిడార్ ఏర్పాటైంది. జేఎన్ఎన్ యూఆర్ఎం ప్రాజెక్టులో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) రహదారుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ-బస్సులు బీఆర్‌టీఎస్ రహదారుల్లో రయ్‌మని దూసుకెళ్లను న్నాయి. బీఆర్‌టీఎస్‌ను రెండు కారిడార్లుగా విభజించి బస్సులు నడపనున్నారు. పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్‌లో 44 బస్సులు, సింహాచలం ట్రాన్సిట్ కారిడార్‌లో 14 ఎలక్ట్రిక్ బస్సులు నడపనున్నారు. దీనికి తోడు ఫీడర్‌రోడ్డులో ఈ-బైక్స్, ఈ-రిక్షాలు అందుబాటులోకి తీసుకురాను న్నారు. ఎలక్ట్రికల్ బస్సుల కోసం రూ. 150 కోట్లు, డిపో నిర్మాణానికి రూ. 17 కోట్లు, ఈ బస్సుల రాకపోకల అనుసంధానానికి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రూ. 5 కోట్లతో పాటు ల్యాండ్ కాస్ట్ డిజైన్‌తో కలిసి మొత్తం రూ.299 కోట్ల అంచనాతో ప్రాజెక్టు రూపకల్పన చేశారు. 5 ఎకరాల్లో బస్సు డిపో నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. కారిడార్‌ను అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధి చేయడంతో పాటు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, డిపోలో క్లీనింగ్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఫిబ్రవరి మొదటి వారానికి యాక్షన్‌ప్లాన్

పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఎలక్ట్రికల్ బస్సులు నడిపేందుకు సమాయత్తమవుతున్నారు. వీయూటీసీఎల్, అమరావతి మెట్రో రైల్ కారిడార్ లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. గతంలో ఈ ప్రాజెక్టు గ్రేటర్ విశాఖ పట్నం స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీవీఎస్‌సీఎల్) పరిధిలో ఉండటంతో ప్రభుత్వం విడుదల చేసిన రూ.58.50 షేర్లను జీవీఎంసీ పరిధిలోని వీయూటీసీఎల్‌కు బదిలీ చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్‌టీఎస్ రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సుల ట్రయల్ రన్‌కు యాక్షన్ ప్లాన్‌ను ఫిబ్రవరి మొదటి వారంలో అప్పగించాలంటూ జీవీఎస్‌సిఎల్‌కి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల పరిశీలనకు టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు.

ఏడీబీ నిధులతో మరో 4 బస్సులు

ఈ 58 బస్సులతో పాటు ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) ప్రాజెక్టులో భాగంగా మరో నాలుగు బస్సులు నగర ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. దీనికి రూ.6 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్దేశిస్తూ జాతీయ స్థాయి సంస్థల నుంచి జీవీఎంసీ టెండర్లను ఆహ్వానిం చింది. నాలుగు ఈ-బస్సుల్ని పెందుర్తి, హనుమంతువాక, ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెంలోని బీఆర్‌టీఎస్ రహదారుల్లో నడిపేం దుకు జీవీఎంసీ సమాయత్తమవుతోంది. ఒకసారి ఫుల్‌చార్జ్ చేస్తే 90 నుంచి 100 కిలోమీటర్ల ప్రయాణించే సామర్థ్యం ఉన్న బస్సులను తీసుకురావాలని టెండర్లలో సూచించారు. ఈ టెండర్ల పరిశీలన త్వరలోనే పూర్తికానుంది.

ఆగిన తెలుగుగంగ నీరు

విశాలాంధ్ర-తిరుపతి : తెలుగుగంగ నీటిని అధికారులు అర్ధాంతరంగా నిలిపి వేయడంతో రైతుల కొంప మునిగింది. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న వరి పైరు కళ్ల ముందు ఎండిపోవడంతో అన్నదాతలు తల్లడిల్లి పోతున్నారు. చిత్తూరు జిల్లాలోని తొట్టంబేడు మండలంలో పంట చేతికి వచ్చే సమయంలో తెలుగుగంగ నీరు ఆపివేయడంతో తొమ్మిది వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అధికారుల వైఖరితో రైతులు నష్టపోయినట్టు సమాచారం అందుకున్న సీపీఐ, వైసీపీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చిత్తూరు జిల్లా నాయకుల బృందం శనివారం తొట్టంబేడు మండలంలోని లింగమ నాయుడుపల్లి, తాటిపర్తి, నామశంకర మాల గ్రామాల్లో పర్యటించింది. ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. గత ఏడాది నవంబర్‌లో తెలుగుగంగ నీరు రావడంతో తాము వరిపంట వేయాల్సి వచ్చిందని, పంట మార్పిడి సమయంలో గంగ నీరు ఆపివేశారని రైతులు బృందానికి వివరించారు. వరి సాగుకు బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చామని, ప్రస్తుతం పంట పోయిన నేపథ్యంలో రుణం చెల్లించ మంటూ బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తున్నా రని, తమను ఆదుకునేవారెవరని వాపోయారు. తక్షణం తెలుగుగంగ నీరు విడుదల చేసి పంటలను కాపాడకపోతే ఆత్మహత్యలే గత్యంత రమని విన్నవించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లా డుతూ నెల్లూరు నేతలకు భయపడే గంగనీరు నిలిపివేశారన్నారు. సోమశిల ప్రాజెక్టులో 45 టీఎంసీల నీరు నిల్వవున్నా రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి, నారాయణకు భయపడే కండలేరుకు నీటి సరఫరా ఆపివేశారన్నారు. సోమశిల నీటిలో సగం వాటా కింద కనీసం 15 టీఎంసీ లను కండలేరుకు వదిలి తద్వారా తొట్టంబేడు రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని కడగండ్లకు గురిచేస్తే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి. జనార్దన్ మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలో వరిపంట నష్టపోయిన బాధిత రైతాంగానికి ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున నష్టపరి హారం చెల్లించాలన్నారు. పంట కోసం రైతులు చేసిన అప్పులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - కడప (సెవెన్ రోడ్స్) : కార్మికుల సంఘటిత పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. కడపలోని హోచిమిన్ భవన్‌లో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం చెన్నయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య, దళిత హక్కుల పోరాట సమితి కలిసి పోరాటాలను తీవ్రతరం చేయాలన్నారు. సీపీఐ కడప జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం కారణంగా సీమ కరవు గాథలు కొనసాగుతున్నాయన్నారు.



ఒంగోలు జాతి ఎడ్ల పందేల హోరు

విశాలాంధ్ర - గుడివాడ : కృష్ణాజిల్లా గుడివాడ మండలం లింగవరం గ్రామంలోని కె-కన్వెన్షన్ వద్ద జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలు ఉత్సాహంగా కొనసాగు తున్నాయి. ఎన్టీఆర్ టూ వైఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) పర్యవేక్షణలో పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి 100 జతల ఒంగోలు జాతి ఎడ్లు తరలివచ్చారు. సంక్రాంతి పండగ వేళ పోటీలను తిలకిం చేందుకు పెద్దఎత్తున జనం తరలిరావడంతో కోలాహలం నెలకొంది. శనివారం జరిగిన నాలుగు పళ్ళ విభాగం ప్రదర్శనలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాత మల్లాయిపాలేనికి చెందిన సిద్ధంశెట్టి సామ్రాజ్యం ఎడ్ల జత 5485.1 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం మేళ్ళచెరువు మండలం వీరంరెడ్డి మల్లిఖార్జునరెడ్డి మెమోరియల్ వీరంరెడ్డి కార్తీక్‌రెడ్డి, గుంటూరు జిల్లా శావల్యపురం మండలంలోని మయకుమల్లె గ్రామానికి చెందిన ముంద్ర జీవప్రసాద్ ఎడ్ల జతలు 5400 అడుగుల దూరం బండ లాగి సంయుక్తంగా ద్వితీయ స్థానంలో గెలుపొందాయి. గుంటూరు జిల్లా రాజుపాలేనికి చెందిన బండికల్లు రమ్యానాయుడు, ప్రకాశం జిల్లా కురిచేడు మండలంలోని ముష్ట గంగవరానికి చెందిన దేవినేని వెంకటేశ్వర్లు ఎడ్ల జతలు 5390.3 అడుగుల దూరం బండ లాగి తృతీయ స్థానం సాధించాయి. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన సుంకే సురేంద్రరెడ్డి ఎడ్ల జత 5200.2 అడుగుల దూరం బండ లాగి నాల్గవ స్థానం, గుంటూరు జిల్లా ముప్పాళ్ళ మండలంలోని మాదలకు చెందిన మేగనాథ్‌నాయుడు ఎడ్ల జత 5181.6 అడుగుల దూరంతో అయిదవ స్థానం, కృష్ణాజిల్లా పెదపారు పూడి మండలం యలమర్రుకు చెందిన భానుప్రకాశరావు, నాగాయలంకకు చెందిన సత్యనారాయణల ఎడ్ల జతలు 5108.5 అడుగుల దూరంతో ఆరో స్థానంలో నిలిచారు. పిఠాపురం కండ్రికకు చెందిన భాస్కర్ కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన వెంకట య్యల ఎడ్లజతలు 5100 అడుగుల దూరంతో ఏడోవ స్థానంలో నిలిచాయి. ఆయా ఎడ్లజతలకు నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు.

రోహింగ్యాల డ్రగ్స్ దందా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: భారత్‌కు శరణార్థులుగా వచ్చిన రోహింగ్యాలు తమ ఆదాయవనరుగా డ్రగ్స్ దందా చేస్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీ శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు..ఇద్దరు మయన్మార్ దేశస్థులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 133 గ్రాముల డ్రగ్స్ ట్యాబ్లెట్లు, రూ.26 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రాచకొండ సీపీ మహేశ్ భగవత్ వెల్లడించారు. మయన్మార్‌కు చెందిన రెహమాన్ (21), మహ్మద్ రహీమ్(20) హైదరాబాద్‌లోని బాలాపూర్ రాయల్ కాలనీలో ఉంటున్నారు. రహీమ్ హోటల్‌లో, రెహమాన్ సెంట్రింగ్ పని చేస్తున్నారు. ఈజీ మనీ కోసం డ్రగ్స్ సప్లయర్స్‌గా మారారు. మయన్మార్‌కు చెందిన సలీమ్ అనే ఏజెంట్ వద్ద డ్రగ్స్ ట్యాబ్లెట్లను కొంటున్నారు.

సలీమ్ నుంచి ఒక్కో ట్యాబ్లెట్‌కు రూ.50 చొప్పున కొనేవారు. తర్వాత డిమాండుకు తగ్గట్టు ఒక్కో ట్యాబ్లెట్‌ను రూ.200 నుంచి రూ.300 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వారం రోజుల క్రితమే సలీమ్ నుంచి రూ.66,500లతో 1,330 డ్రగ్స్ ట్యాబ్లెట్లను కొన్నారు. రెహమాన్, రహీమ్ తాము సప్లయ్ చేసే డ్రగ్స్‌కు 'వై' 'యాబా' అని కోడ్‌లు పెట్టుకున్నారు. రాయల్ కాలనీలోని ఫాతిమా మజీద్ వద్ద డ్రగ్స్ ట్యాబ్లెట్లు సప్లయ్ చేసేందుకు రెడీ అయ్యారు. సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వి.సైదులు సిబ్బందితో కలిసి రెహమాన్, రహీమ్‌లను అదుపులోకి తీసుకున్నారు. 7 పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసిన 133 గ్రాముల డ్రగ్స్ ట్యాబ్లెట్లను గుర్తించారు. రెండు మొబైల్ ఫోన్లు, రూ.26 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

యువత భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధి

మంత్రి కొల్లు రవీంద్ర



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యువత భాగస్వామ్యం, శక్తి యుక్తులతో రాష్ట్రాభివృద్ధి జరగాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర యువజన సర్వీసులు, న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. విజయవాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనేక సమస్యలతో సతమతమవుతున్న నవ్యాంధ్ర పునర్నిర్మాణంలో యువత పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి యువనేస్తం పథకం ద్వారా యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. యువశక్తిని అద్భుత శక్తిగా మార్చాలనే లక్ష్యంతో 4.36లక్షల మందికి ఉపాధి కల్పించే విధంగా శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. విభజనతో నష్ట పోయిన రాష్ట్రాన్ని తన అనుభవంతో ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షం అడ్డంకులు సృష్టిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి చొరవతో పనిచేస్తున్నారన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు రెట్టింపు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సమావేశంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నాగేంద్రకుమార్, రాష్ట్రకార్యదర్శి వెంకటనారాయణ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు వేణుమాధవ్, తెలుగు యువత నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్ఐఏకు జగన్‌పై దాడి కేసు

మోడీకి చంద్రబాబు నిరసన లేఖ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రధాని నరేంద్ర మోడీకి ఏపీ సీఎం చంద్రబాబు శనివారం లేఖ రాశారు. విశాఖపట్నం విమానాశ్రయంలో వైసీపీ అధినేత జగన్‌పై దాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం వ్యవహరించిన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ చంద్రబాబు 5 పేజీల లేఖ రాశారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారని ఆయన లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌పై దాడి కేసులో ఎన్ఐఏ దర్యాప్తు సరికాదన్నారు.

ఎన్ఐఏ చట్టాన్ని 2008లో మోడీ వ్యతిరేకించిన విషయాన్ని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇప్పుడు అదే చట్టాన్ని అనుసరిస్తూ జగన్‌పై దాడి కేసును ఆ సంస్థకు అప్పగించారన్నారు. ఎన్ఐఏ చట్టంపై మోడీ ద్వంద్వ విధానం అవలంభిస్తున్నారని ఆయన విమర్శించారు. విదేశీ శక్తుల ప్రమేయం ఉండే కేసులను మాత్రమే జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొన్నారు. వ్యక్తిగత దాడి కేసును కూడా ఎన్ఐఏకు అప్పగించడం దారుణమని చంద్రబాబు మండిపడ్డారు. దీనిపై ఏపీ ప్రభుత్వానికి కొన్ని అభ్యంతరాలున్నాయని లేఖలో స్పష్టం చేశారు. దాడి కేసు ఎన్ఐఏకు అప్పగించడం సరికాదని, ఈ కేసు విచారణను రీకాల్ చేయాలని మోడీని కోరారు.

పండుగ పూటా పస్తులే..!

- కొలిక్కి రాని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల జీతాల సమస్య
- రాష్ట్రంలో ఆరువేల మందికి రెండు నెలల జీతాల బకాయిలు



విశాలాంధ్ర-విశాఖసిటీ : రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల జీతాల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. సంక్రాంతి పండుగ కల్లా తమ సమస్య పరిష్కారమవుతోందని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురయ్యింది. మరిన్ని వివరాల్లోకి వెళితే రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అయిన గిరిజన హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలు, పోస్టు మెట్రిక్ కాలేజి హాస్టల్స్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారికి ఆయా పాఠశాలలకు చెందిన హెడ్ మాస్టర్స్‌కు డీడీఓ అధికారాలు ఉండడంతో వీరికి జీతాలు లెక్కలు వేయడం, చెల్లింపులు చేయడం లాంటివి చేసేవారు. గత ఏడాది మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం హెచ్ఎంలు డీడీఓ అధికారాలు కోల్పోయారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెంబర్ 132 ప్రకారం హెచ్ఎంలకు బదులు ఆ ఏరియాలోని అసిస్టెంట్ ట్రైబర్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏటీడబ్ల్యూ)కి డీడీఓ అధికారాలు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ అంశాన్ని తప్పుపడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఉపాధ్యాయుల సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన బాట పట్టారు. తమ జీతాలకు సంబంధించిన జీఓ ను రద్దు చేసి హెచ్ఎంల డీడీఓ అధికారాలను పునరుద్ధరించాలంటూ టీచర్లు ఆందోళన చేశారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ డైరక్టర్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ విధంగా మార్పులు చేయడం, శాఖల మధ్య సమన్వయ లోపంతో గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన రెండు నెలల జీతాలు ఇప్పటి వరకు వారికి అందలేదు. ఫలితంగా రాష్ట్రంలో సీతంపేట, పార్వతీపురం, కేఆర్ పురం, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని 6వేల మంది ఉపాధ్యాయులకు జీతాలు రాక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

ఈ నేపథ్యంలో తమకు జీతాలు అందుతాయన్న ఆశాభావంతో ఉన్న తమకు ఆర్థిక శాఖ అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారని, సంక్రాంతి పండుగ పూట కూడా జీతాలు లేకుండా పండుగ జరుపుకోలేని దీనస్థితిలో తాము ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు, గిరిజన పాఠశాల అధ్యాపకులు దుర్గారావు మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఈ అంశంపై నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా జీతాలు రాలేదన్నారు. సంక్రాంతి పండుగ కూడా జరుపుకోలేని విధంగా తాము ఉన్నామన్నారు. దీనిపై వివిధ ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సామల సింహాచలం మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

వెంటనే ప్రభుత్వం రెండు నెలల జీతాలు విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు.

జగన్ దిగజారుడుతనంపై

అసహ్యించుకుంటున్న ప్రజలు

జన్మభూమిలో 5.65 లక్షల అర్జీలు

రెండు చేతుల్లేని వారికి రూ.10 వేలు పింఛన్ : సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - అమరావతి : వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో రూ.6 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, విచారణ చేసి జైల్లో పెడతామంటూ ఇష్టానుసారంగా మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత జగన్ దిగజారుడుతనాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ప్రజావేదికలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశమంతా ప్రధాని మోడీని ఛీ కొడుతుంటే, జగన్ మాత్రం ఆయన పక్కన చేరటం శోచనీయమన్నారు. టీడీపీకే ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రెండు చేతులు లేని దివ్యాంగులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో జన్మభూమి మా ఊరు గ్రామ సభలు విజయవంతమైనట్లు తెలిపారు. పరిష్కార వేదికలో రెండు వేల మంది ఉద్యోగుల ప్రజా సమస్యల పరిష్కారంలో నిమగ్నమైనట్లు చెప్పారు. జన్మభూమిలో రూపొందించిన జిల్లాల భవిష్యత్ ప్రణాళికలను ఈ నెల 21న విడుదల చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రస్థాయి ప్రణాళికను కూడా వెల్లడిస్తామని తెలిపారు. గ్రామ సభల్లో మొత్తం 5,65,616 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిలో 33,888 అక్కడికక్కడే పరిష్కారమైనట్లు తెలిపారు. పేదరికం నిర్మూలన, పింఛన్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చాయన్నారు. భూ సంబంధిత వ్యవహారాలలో మోసం జరగకుండా ప్రత్యేకంగా కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలను ప్రధాని మోడీ గాలికొదిలేశారని విమర్శించారు. రూ.30 వేల కోట్లను రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నప్పటికీ, మోడీ ఎందుకు అడ్డుపడుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తుండటం రాష్ట్ర విజయానికి నిదర్శనంగా చెప్పారు. అగమ్యగోచరంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను తమ ప్రభుత్వం గాడిలో పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నా, ప్రతిపక్షం మాట్లాడకపోవటం శోచనీయమన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై ఎయిర్‌పోర్టులో హత్యాయత్నం జరిగిందని, అయినప్పటికీ విచారణ జరిపే బాధ్యత రాష్ట్రానిదేనని చంద్రబాబు స్పష్టం చేశారు. కేసును ఎన్ఏఐకు అప్పగించటం సరికాదన్నారు. రాష్ట్ర అధికారాలను కూడా కేంద్రం లాగేసుకునేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌లో పదవుల లొల్లి

- సీఎల్పీ, పీఏసీ పదవుల కోసం పోటీ
- అధిష్టానం మెప్పునకు ప్రయత్నాలు
- ఎంపీ టికెట్లు ఆశిస్తున్న పెద్దలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మళ్లీ రాజకీయ వేడి మొదలైంది. లోక్‌సభ సీట్ల కోసం కొందరు, సీఎల్పీ, పీఏసీ ఛైర్మన్ పదవుల కోసం మరికొందరు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నెల 16న సీఎల్పీ సమావేశం జరగనుండటంతో ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్, సీఎల్పీ నేత పదవులు దక్కించుకోవడానికి ఎవరికి వారు అధిష్టానం ఆశీస్సుల కోసం యత్ని స్తున్నారు. 17వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండటంతో.. ఆ లోపు పీఏసీ ఛైర్మన్, సీఎల్పీ నేతల ఎంపిక ప్రక్రియ పూర్తికి కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు మొదలుపెట్టింది. సీఎల్పీ, పీఏసీ ఛైర్మన్ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్‌కు అప్పగించారు. శాసనసభ సమావే శాలకు ఒక్కరోజు ముందు కాంగ్రెస్ శాసన సభాపక్ష సమావేశం జరగనుంది. ఇందులో అందరికీ ఆమోదయోగ్యమైన నాయకులను ఎంపిక చేయాలని అధిష్ఠానం వేణుగోపాల్‌కు సూచించినట్లు తెలుస్తోంది. టీపీసీసీ పదవి నుంచి తప్పుకుంటే సీఎల్పీ నేతగా ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఎన్నుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలు త్వరలో జరగనున్న దృష్ట్యా పీసీసీ పదవిలో ఉత్తమ్‌నే కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తే సీఎల్పీ, పీఏసీ ఛైర్మన్ పదవులు ఇతరులకు లభిస్తాయి. సీఎల్పీ పదవి కోసం భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు సహా గండ్ర వెంకట రమణారెడ్డి, తూర్పు జయప్రకాశ్‌రెడ్డి గట్టి ప్రయ త్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆ పదవి దక్కకపోయినా ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్ పదవి కోసం శ్రీధర్‌బాబు అధి ష్ఠానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. పీఏసీ ఛైర్మన్ కోసం మాజీమంత్రి సబితా ఇంద్రా రెడ్డి కూడా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్పు కుంటే... ఆ బాధ్యతలు చేపట్టేందుకు కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను ఫిబ్రవరిలోనే కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించే అవకాశం ఉండడంతో పార్టీలోని సీనియర్లు టికెట్లు దక్కించుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్ని కల్లో కాంగ్రెస్ ఘోరపరాభవాన్ని మూటగట్టు కున్నందున లోక్‌సభ ఎన్నికల్లో ఆరేడు స్థానాలు మినహాయిస్తే మిగిలిన స్థానాల్లో పోటీ చేసేందుకు నేతలు చొరవ కనపరచడం లేదని పార్టీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. గెలుపునకు మెరుగైన అవకాశాలు ఉన్నట్లు అంచనా వేసుకుంటున్న ఖమ్మం, మహబూబా బాద్, నల్గొండ, భువనగిరి టికెట్ల కోసం ఎక్కువగా పోటీ నెలకొన్నది. ఖమ్మం ఎంపీ స్థానం కోసం కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి, స్థానిక వ్యాపారవేత్త రాజా ప్రయత్నాలు చేస్తుండగా, పొత్తుల్లో భాగంగా తమకు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ కోరుతున్నట్లు తెలుస్తోంది. ఎస్టీ రిజర్వు నియోజకవర్గం అయిన మహబూబా బాద్ సీటు కోసం ఎక్కువమంది ఆశావహులు పోటీ పడుతున్నారు.

కేంద్ర మాజీమంత్రి రవీంద్రనాయక్, ఎమ్మెల్సీ రాములునాయక్ సహా ద్వితీయ శ్రేణి నేతలు కొందరు ఆ సీటు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. భువనగిరి సీటు కోసం పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ సహా మరో ఇద్దరు, ముగ్గురు కొత్తవాళ్లు పోటీపడు తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. మాజీ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జానారెడ్డి నల్గొండ లోక్‌సభ సీటు కావాలని కోరుతున్నట్లు సమాచారం.

రైల్వే కూలీపై కేసు నమోదు : సస్పెన్షన్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సంక్రాంతి రద్దీని పురస్కరించుకుని రైళ్లలో జనరల్ బోగీల్లో సీట్లను ఆక్రమించి విక్రయిస్తున్న నేరంపై విజయవాడ రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది రైల్వే కూలీ శివకుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 'రైల్వే కూలీల చిలక్కొట్టుడు!' శీర్షికన విశాలాంధ్రలో ఈనెల 11వ తేదీన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నెంబరు 22831 హౌరా-ప్రశాంతినిలయం ఎక్స్‌ప్రెస్‌లో టవల్ ద్వారా సీట్లను ఆక్రమించి ప్రయాణీకులకు అమ్ముతున్న శివకుమార్‌ను అరెస్ట్ చేశారు. ఇతనిపై రైల్వే యాక్ట్ సెక్షన్ 155(2) ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసిన స్టేషన్ మనేజర్ రైల్వే కూలీని నెల రోజులపాటు సస్పెండ్ చేశారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జీవీఆర్ కుమార్ రైల్వే కూలీలకు కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లను అమ్మడం నేరమని తెలిపారు. ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే రైల్వే యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: విద్యార్థులు ఉన్నత చదువు అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నది అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆకాంక్ష అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్గాలను ఎంచుకుని దేశం పట్ల గౌరం, అంకిత భావంతో మెలగాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా విద్యారులు పోరాట పటిమను పెంపొందించు కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.విజేంద్ర, తాలుకా కార్యదర్శి నవీన్, నాయకులు చాంద్, గిరి, శేఖర్, దస్తగిరి, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

బాబు జిమ్మిక్కులు పనిచేయవు

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర-మడకశిర టౌన్: ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధించగలదని పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి చెప్పారు. శనివారం అనంతపురం జిల్లా మడకశిర పట్టణానికి సమీపంలోని సిద్దగిరి గ్రామంలో శనివారం గ్రామ ప్రజలు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వివేకానందుడి గొప్పదనం గురించి రఘువీరారెడ్డి వివరించారు. అనంతరం టీడీపీ, వైఎస్ఆర్‌సీపీలను వీడి 10మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటే ప్రాంతీయ పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక హోదా సాధించకపోతే ఈ రాష్ట్రంలో అడుగు పెట్టనని శపథం చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు వృద్ధులపైన, వితంతువులపైన కపట ప్రేమ చూపుతున్నారని అన్నారు. ఇన్ని రోజులు లేని ప్రేమ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వచ్చిందా అని ప్రశ్నించారు. ఇలాంటి జిమ్మిక్కులను ప్రజలు నమ్మరన్నారు. ప్రజలకు ఎవరిని అధికారంలోకి తేవాలో బాగా తెలుసని, ఇలాంటి మోసపూరిత వాగ్దానాలతో వారిని మోసం చేయడానికి వీలు కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు సుధాకర్, మండల కన్వీనర్లు మంజునాథ్, నాగేంద్ర, హనుమంతరెడ్డి, నాగమ్మ, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

టోల్‌ట్యాక్స్ రద్దు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సంక్రాంతి రద్దీ దృష్ట్యా టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం టోల్‌ట్యాక్స్‌ను రద్దు చేసింది. రెండ్రోజులుగా పలు టోల్‌ప్లాజాల వద్ద వందలాది వాహనాలు నిలిచిపోవడంతో గంటల కొద్దీ సమయం ఆలస్యమై గమ్యానికి చేరుకోవడంలో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గ్రహించిన ప్రభుత్వం శని, ఆదివారాలతోపాటు ఈనెల 16వ తేదీన టోల్‌ట్యాక్స్ వసూలు నిలిపివేయాలని ఆయా ప్లాజాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది.

ఫిబ్రవరి 19న మాదిగల విశ్వరూప మహాసభ

ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ

విశాలాంధ్ర-ఒంగోలు : ఎస్సీ వర్గీకరణ, చట్టసభలలో రాజకీయ ప్రాధాన్యతే లక్ష్యంగా ఫిబ్రవరి 19న అమరావతిలో 10లక్షల మందితో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ తెలిపారు. స్థానిక ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగల పట్ల చిన్న చూపుతో ఉన్నాయన్నారు. ఇటువంటి శక్తులపై ఎదురు పోరాటం చేసేందుకే ఈ విశ్వరూప మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్న రాజకీయ నేతలు, పార్టీలు రాష్ట్ర విభజన అనంతరం కేవలం తెలంగాణలో మాత్రమే ఆ నిర్ణయాలకు కట్టుబడి ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అదే వర్గీకరణ పట్ల రాజకీయ నాయకులు మాదిగలను విస్మరించారన్నారు. చంద్రబాబు నాయుడు, రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలలో తీర్మానం చేసి ప్రధానికి లేఖ రాసినవారే నన్నారు. తెలంగాణ ఎన్నికలలో మహాకూటమి మేని ఫెస్టోలో మాదిగల రిజర్వేషన్‌కు మద్దతు పలికిన టీడీపీ ఆంధ్రరాష్ట్రంలో మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నదన్నారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మద్దతు పలుకుతుంటే ఆంధ్రలోని ఆ పార్టీ అధ్యక్షులు రఘువీరారెడ్డి మాత్రం మౌనంగా ఉన్నారన్నారు. కేవలం వర్గీకరణ వరకే మాదిగల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటమే కాకుండా రాజకీయాలలో కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిత సీమ స్వాప్నికుడు కామ్రేడ్ ఎన్.ఎస్

అభ్యుదయ సాహిత్యానికి వెన్నుదన్నుగా..

నిజ జీవితంలో కమ్యూనిస్టుగా జీవించిన మహోన్నతుడు కామ్రేడ్ ఎన్.ఎస్. సీపీఐ ఉద్యమ ఫలితమే గండికోట ప్రాజెక్టు సాధన. సీమ ప్రజలు ఎన్.ఎస్‌కు రుణపడి ఉన్నారు. ఎన్.ఎస్ రాయలసీమ ఉద్యమం డా. వైఎస్సార్, డా.మైసూరా వంటి నాయకులకు మార్గదర్శకం అయ్యింది.

– ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత

విశాలాంధ్ర బ్యూరో-కడప జిల్లా : రాళ్లసీమగా మారిపోయిన రాయలసీమను హరిత సీమగా మార్చాలని కలలుగన్న సీమ స్వాప్నికుడు కామ్రేడ్ నర్రెడ్డి శివరామిరెడ్డి. ఉమ్మడి కమలాపురం, పులివెందులకు సీపీఐ ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేశారు. రాయలసీమను కరవు రక్కసి నుండి రక్షించడానికి కృష్ణా జలాలు సీమపై కవాతు చేయాలని ఆశించిన కమ్యూనిస్టు యోధుడు ఎన్.ఎస్. గండికోట ప్రాజెక్ట్ సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని ప్రభుత్వం మెడలు వంచి ప్రాజెక్టు స్థాపించేలా చేసిన ఘనత ఎన్.ఎస్‌కే దక్కుతుంది.

ఎన్.ఎస్ ఉద్యమ ఫలితంగా 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గండికోట ప్రాజెక్టుకు శంకు స్థాపన చేసిన చరిత్ర ఇంకా జ్ఞాపకాల్లోనే ఉంది. రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం సీమ ఉద్యమాన్ని లేవదీసిన ఎన్.ఎస్ డా.వైఎస్సార్, డా.మైసూరా లాంటి నాయకులు సీమ ఉద్యమ రాజకీయ గురువుగా ఎన్.ఎస్ పేరు చెప్పుకున్నారంటే ఆయన కార్యశీలత ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. నిజాయితీకి నిలువెత్తు సంతకంలా భాసిల్లే శివరామిరెడ్డి తన పర భేదాలు లేకుండా, తప్పు చేస్తే నిజాయితీగా ఎత్తి చూపడం, కార్యకర్తలను సరైన మార్గంలో నడిపించడం కోసం నిర్మొహమాటంగా మాట్లాడటం, పని చేసిన వారిని భుజం తట్టి ప్రోత్సహించడం ఆయన వ్యక్తిత్వం. ప్రాంతం, రాష్ట్రం కోసం, అణగారిన ప్రజల హక్కుల కోసం, సర్వస్వాన్ని త్యాగం చేసిన సేవాతాత్పరుడు. తనతో నడచిన పాత తరం నాయకులంతా సెలవంటూ వెళ్లిపోయినా, తాను మాత్రం నమ్మిన సిద్ధాంతం కోసం, వయసు భారాన్ని జయించి కష్టపడటానికి ఇష్టపడిన నాయకుడు. కమ్యూనిస్టు సిద్ధాంత ఆచరణ కర్తగా భావితరాలు గుర్తుంచుకొని నడవాల్సిన మార్గాన్ని సృష్టించిన మార్గదర్శకులుగా ఎన్.ఎస్(సీపీఐ) కమ్యూనిస్టు చరిత్రలో చిరంజీవిగా నిలుస్తారు.

నేటి తరానికి ఎన్.ఎస్ స్ఫూర్తిదాయకం

నేటి యువతరానికి కామ్రేడ్ ఎన్.శివరామిరెడ్డి స్ఫూర్తిదాయకం. తన ఆస్తిపాస్తులను పార్టీ కోసం వెచ్చించి కడప జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఉత్తేజం కలిగించిన గొప్ప నాయకుల్లో ఎన్.ఎస్ ఒకరని ఘంటాపథంగా చెప్పవచ్చు. కమ్యూనిస్టు భావజాలం పట్ల ఆకర్షితులైన ఎన్.ఎస్ అంచలంచెలుగా ఎదిగి పార్టీలో రాష్ట్ర స్థాయిలోనూ రాణించారు. అప్పటి ఉమ్మడి కమలాపురం, పులివెందుల ఎమ్మెల్యేగా కడప జిల్లా ప్రజానీకానికి ఎనలేని సేవలందించారు.

– గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి, కడప జిల్లా

ఎన్.ఎస్ మరణం కమ్యూనిజానికి తీరనిలోటు

స్వాతంత్ర సమర యోధునిగా, రచయితగా, కమ్యూనిస్టు నాయకునిగా ఇలా విభిన్న రంగాల్లో ఎన్.ఎస్ ప్రతిభావంతంగా రాణించారు. కడప జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ స్మృతులతో కూడిన అరుణోదయం అనే పుస్తకంలో జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానాన్ని విపులీకరించారు. ఎడిటర్‌గా ఎన్.ఎస్ అనేక పుస్తకాలను క్రోడీకరించి, సంక్షిప్త పరిచి ఆసక్తికరంగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి అద్వితీయం.

– షేక్ హుసేన్, మాజీ ఎమ్మెల్సీ, కడప జిల్లా

రాయలసీమ ఉద్యమ యోధుడు..

భావితరాలకు ఎన్.ఎస్ మార్గదర్శకుడు. రాయలసీమ అభివృద్ధి కోసం ఆయన నిరంతరం పరితపించారు. కరవు రక్కసి కోరల్లో చిక్కుకున్న సీమకు విముక్తి కలగాలంటే సాగునీటి ప్రాజెక్టులే శరణ్యమని భావించి ఉద్యమాలు చేసి విజయం సాధించారు. కడప జిల్లా కమ్యూనిస్టు చరిత్రలో తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

– ఆచార్య ఈశ్వర రెడ్డి, వైవీయూ ప్రొఫెసర్, కడప

కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించిన ఎన్.ఎస్

తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించిన పోరాట యోధుడు ఎన్.ఎస్. పార్టీపై నిషేధం ఉన్న రోజుల్లో కొండల్లో, గుట్టల్లో దాక్కుని సుమారు 4 సంవత్సరాల పాటు అజ్ఞాత వాసాన్ని గడిపారు. పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశారు. జిల్లా చరిత్రలో లిఖించదగ్గ ఉద్యమాలు నిర్వహించి గండికోట ప్రాజెక్టును సాధించడంలో సఫలీకృతులయ్యారు.

– డా.మల్లెమాల వేణుగోపాలరెడ్డి, అభ్యుదయ సాహిత్య వేత్త



రోహిత్, ధోనీ రికార్డులు

సిడ్నీ: తొలి వన్డేలో ఓటమి పాలైనా టీమిండియా బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మ, ధోనీలు పలు రికార్డులు నమోదుచేశారు. రోహిత్ ఈ మ్యాచ్‌లో సెంచరీ చేయడంతో ఆసీస్‌పై అత్యధిక సెంచరీలు చేసిన రెండో బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఆసీస్‌పై రోహిత్‌కు ఇది 7వ శతకం కాగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ 10 సెంచరీలతో తొలి స్థానంలో ఉన్నాడు. అలాగే ఆసిస్ గడ్డపై రోహిత్‌కు ఇది నాలుగవ శతకం, దీంతో విండీస్ దిగ్గజం వీవ్ రిచర్డ్స్ 3 శతకాల రికార్డును అధిగమించాడు. ఇప్పటి వరకూ ఆసీస్ గడ్డపై మూడు కంటే ఎక్కువ వన్డే సెంచరీలు ఎవరూ చేయలేదు. అంతేకాక ఈ సెంచరీతో రోహిత్ భారత మాజీ కెప్టెన్ గంగూలీ(22) సెంచరీల మార్కును సమం చేశాడు. ధోనీ కూడా ఈ వన్డేతో భారత్ తరపున 10,000 పరుగుల మైళు రాయిని అందుకున్నాడు. భారత్ తరపున 10 వేల పరుగుల మార్కును అందుకున్న ఐదో ఆటగాడు ధోనీ.

ఆస్ట్రేలియా అరుదైన విజయం

1000వ విజయం అందుకున్న తొలి జట్టు

సిడ్నీ : ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు అరుదైన మైలురాయిని అందుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో 1000వ విజయాన్ని నమోదు చేసిన తొలి జట్టుగా సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. భారత్‌తో జరిగిన తొలి వన్డేలో ఆసీస్ గెలువడం ద్వారా అంత ర్జాతీయ క్రికెట్‌లో 1000వ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. టెస్టుల్లో 384 విజయాలు సాధించిన ఆసీస్.. వన్డేల్లో 558, టీ20ల్లో 58 విజయాలు అందుకుంది. 1877లో మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా తొలి విజయాన్ని ఆస్ట్రేలియా అందుకుంది. 100వ అంతర్జాతీయ విజయాన్ని 1951లో వెస్టిండీస్‌పై సాధించగా, 500వ విజయాన్ని పాకిస్థాన్‌పై (1999లో) సాధించింది. అంతర్జాతీ క్రికెట్‌లో అత్యధిక అంతర్జాతీయ విజయాలు సాధించిన జట్లలో ఇంగ్లండ్ రెండో స్థానంలో ఉంది. ఇంగ్లండ్ ఇప్పటి వరకూ 774 విజయాలు సాధించింది. ఇక భారత్ 711 విజయాలతో మూడో స్థానంలో ఉంది. వన్డే విజయాల పరంగా చూస్తే భారత్ రెండో స్థానంలో ఉంది. వన్డే ఫార్మాట్‌లో భారత్ సాధించిన విజయాల సంఖ్య 492.





ఆసీస్ బోణీ

- తొలి వన్డే ఆస్ట్రేలియాదే
- 34 పరుగుల తేడాతో విజయం
- రోహిత్ శతకం వృధా

సిడ్నీ: మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఆసీస్ టీమిండియాపై 34 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 289 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ తొమ్మిది వికెట్ల కోల్పోయి 254 పరుగులే చేయగలిగింది. లక్ష్య ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ(133) సెంచరీ సాధించినప్పటికీ జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. రోహిత్‌కు జతగా ఎంఎస్ ధోని(51) మినహా ఎవరూ సహకారం అందించలేకపోయారు.

ఆసీస్ జట్టులో మూడు అర్థ శతకాలు..

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్‌కు మూడో ఓవర్లోనే ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్ ఫించ్‌ను భువి బౌల్డ్ చేశాడు. మరో ఓపెనర్ కారే(24) భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగినా..కుల్దీప్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. మిడిలార్డర్‌లో ఖవాజా(59), షాన్ మార్ష్(54), హ్యాండ్ స్కాంబ్(73)లు అర్థ శతకాలతో రాణించడంతో ఆల్‌రౌండర్ మార్కస్ స్టోనిస్(47) ఆకట్టుకోవడంతో ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. భువనేశ్వర్, కుల్దీప్‌లకు రెండు వికెట్లు దక్కగా జడేజాకు ఒక వికెట్ దక్కింది.

ఆదిలోనే తడబాటు..

289 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన టీమిండియాకు ఆసీస్ పేసర్లు బెహ్రాన్‌డార్ఫ్, రిచర్డ్‌సన్‌లు షాక్ ఇచ్చారు. బెహ్రాన్‌డోర్ఫ్ వేసిన తొలి ఓవర్ ఆఖరు బంతికి శిఖర్ ధావన్ పరుగులేమీ చేయకుండా ఎల్బీగా వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లి సైతం నాలుగో ఓవర్లోనే పెవిలియన్ చేరాడు. నాలుగో ఓవర్లో రిచర్డ్‌సన్ వేసిన మూడో బంతిని ఆడబోయిన కోహ్లి(3) స్టాయినిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. తర్వాత అదే ఓవర్లో రాయుడు సైతం ఎల్బీగా వెనుదిరిగాడు. నాలుగు ఓవర్లు ముగిసే సరికి భారత్ 3 వికెట్లు నష్టపోయి 4 పరుగులు మాత్రమే చేసింది.

రోహిత్‌కు అండగా ధోనీ..

భారత్ మూడు వికెట్లు కోల్పోవడంతో క్రీజులోకి వచ్చిన ధోనీ రోహిత్‌తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆసీస్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ ఇద్దరూ అవకాశం చిక్కినపుడు బౌండరీలు సాధిస్తూ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో వీరిద్దరూ అర్థ శతకాలు పూర్తి చేసుకున్నారు. 137 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేసిన అనంతరం ధోని(51) బెహ్రాన్‌డోర్ఫ్ బవౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. ఆపై రోహిత్‌కు ఏ ఒక్క ఆటగాడి నుంచీ సహకారం లభించలేదు. దినేశ్ కార్తీక్(12), రవీంద్ర జడేజా(8)లు నిరాశపరచారు. వికెట్లు పడుతున్నా రోహిత్ బౌండరీలు సాధిస్తూ సెంచరీ పూర్తి చేశాడు. 45వ ఓవర్లో స్కోరు 221 పరుగుల వద్ద రోహిత్(133పరుగులు 10 ఫోర్లు 6 సిక్స్‌లు) ఏడో వికెట్‌గా వెనుదిరగడంతో భారత ఓటమి ఖాయమైంది. చివర్లో భువనేశ్వర్ కుమార్(29 నాటౌట్) ధాటిగా బ్యాటింగ్ చేసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పూర్తి ఓవర్లు అయే సరికి తొమ్మిది వికెట్లు కోల్పోయి భారత్ 254 పరుగులే చేయగలిగింది. ఆసీస్ బౌలర్లలో యువ పేసర్ రిచర్డ్‌సన్ నాలుగు వికెట్లు సాధించగా, బెహ్రాన్‌డార్ఫ్, మార్కస్ స్టోనిస్ తలో రెండు వికెట్లు తీశారు. పీటర్ సిడెల్‌కు వికెట్ దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే మంగళవారం జరుగనుంది.

టాప్ వైఫల్యం వల్లే ఓడిపోయాం : కోహ్లి



సిడ్నీ: ఆరంభంలో వరుసగా వికెట్లు కోల్పో వడం.. చివర్లో రోహిత్‌కు అండ దొరక కపోవడంతోనే ఓటమి చవిచూశామని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అభిప్రాయపడ్డాడు. తొలి వన్డేలో భారత్ ఓటమి పాలైన అనంతరం కోహ్లి మీడియాతో మాట్లా డుతూ.. 'ఈ రకమైన ఆటను మేం సమర్థించుకోం. ఈ మ్యాచ్‌లో బంతితో బాగానే రాణించామని అనుకుం టున్నా. ఎందుకంటే 300పైగా పరుగులు వచ్చే ఈ పిచ్‌లో ప్రత్యర్థిని 288కే పరిమితం చేశాం. కానీ ఆరంభంలోనే వరుసగా మూడు వికెట్లు కోల్పోవడం ఎప్పటికీ మంచిది కాదు. రోహిత్ అద్భుత ఆటకు ధోని మద్దతివ్వడంతో మాకు విజయావకాశాలపై ఆశలు చిగురించాయి. కానీ ధోని ఔట్ అవ్వడంతో రోహిత్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. రోహిత్‌కు అండగా మరో మంచి భాగస్వామ్యం నమోదైతే విజయం దక్కేది. కానీ ఆరంభంలోనే వరుసగా వికెట్లు కోల్పోవడం ఓటమికి కారణమైంది. ఆసీస్ మా కంటే బాగా ఆడి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఫలితంతో మేం ఎలాంటి ఒత్తిడికి లోనవ్వడం లేదు. ఇలాంటి ఫలితాలు జట్టుగా ఇంకా మెరుగవ్వాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తాయి' అని చెప్పుకొచ్చాడు.



సెపక్‌తక్రా చాంపియన్‌షిప్

ఫైనల్స్‌లో ఆంధ్ర, ఒడిశా జట్లు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: స్థానిక ఎస్‌కెపివి.హిందూ హైస్కూల్‌లో జరుగుతున్న 64వ జాతీయ స్కూల్‌గేమ్స్ బాలబాలకల సెపెక్‌తక్రా చాంపియప్‌షిప్‌లో బాలుర విభాగంలో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ జట్లు, బాలికల విభాగంలో ఒడిశా, మహారాష్ట్ర జట్లు ఫైనల్స్‌కు చేరకున్నాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి బాలబాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. శనివారం జరిగిన సెమీఫైనల్ పోటీలు ఉత్కంఠబరింతగా సాగాయి. బాలుర సెమీఫైనల్స్‌లో తెలంగాణాజట్టుపై ఒడిశా జట్టు 21-15, 21-18 స్కోర్ తేడాతో విజయం సాధించగా, ఆంధ్రప్రదేశ్ జట్టు మహారాష్ట్ర జట్టుపై 21-9, 21-11 స్కోర్ తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలికల సెమీఫైనల్స్‌లో ఒడిశా జట్టు ఢిల్లీపై 21-16, 21-16 స్కోర్ తేడాతో, మరో సెమీస్‌లో మహారాష్ట్ర జట్టు తెలంగాణా జట్టుపై 13-21, 21-14, 21-15 స్కోర్ తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

సందడే సందడి..

- ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు
- కృష్ణాతీరాన సాంప్రదాయ కళా ప్రదర్శనలు
- నవలంకలో పర్యాటక గ్రామం ఆరంభం

విశాలాంధ్ర - నాగాయలంక: ఎటు చూసినా కోలాహలం.. ఎవరిని కదిపినా ఉరిమే ఉత్సాహం.. గ్రామం మొత్తం సాంప్రదాయ కళాకారుల కళా ప్రదర్శనలు, కళాకారుల విన్యాసాలు, గుర్రాలు, లొట్టెపిట్టల సవారీలు.. ఇవి నాగాయలంకలో కనిపించిన దృశ్యాలు. దివిసీమ సాంప్రదాయ పడవల పోటీల సందర్భంగా సంక్రాంతి సంబరాలను డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఒకవైపు పిల్లల కేరింతలు, మరోవైపు నదిలో జలక్రీడాకారుల విన్యాసాలు, కళాకారుల కళాప్రదర్శనలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగగా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వీక్షకులు ఆద్యంతం ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత నాగాయలంక సాయిబాబా గుడిదగ్గర నుంచి శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్ వరకు వందలాది మంది ప్రజలు, జానపద కళాకారులు, విచిత్ర వేషధారణతో శోభాయాత్ర వైభవంగా జరిగింది. డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అగ్నిమాపక శాఖ డీజీ కె సత్యన్నారాయణ, ఎన్‌ఆర్‌ఐ లక్కిరెడ్డి హనిమిరెడ్డి ఎడ్లబండిపై ఊరేగుతూ పుష్కరఘాట్‌కు చేరుకున్నారు. గరగ నృత్యాలతోపాటు ప్రమాదభరితమైన బ్లేడ్‌ల కట్టను మింగి బయటకు తీసే విన్యాసం, తప్పెట్ట గుళ్ల కళాకారుల ప్రదర్శనలు, కథాకళి నృత్యాలు, బుట్టబొమ్మల వేషధారణల ప్రదర్శనలు నిర్వహించారు. రాజస్థానీ లొట్టెపిట్టలపై ఊరేగుతూ చిన్నారులు కేరింతలు కొట్టారు.



శోభాయాత్రలో కళాకారుల సందడి



ఏటీవి రైడింగ్ చేస్తున్న బుద్ధప్రసాద్

ఆకట్టుకున్న నవలంక

సంక్రాంతి సంబరాలలో భాగంగా నవలంక కార్యక్రమం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. నవలంకలో ఎడ్వెంచర్ ఆటలు, జంగిల్ హంట్, పారా గ్లైడింగ్, ఏటివి బైక్ రేస్, వాటర్ సైకిల్స్, వాటర్ బెలూన్స్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాగాయలంక నుంచి నవలంకకు పర్యాటకులను ఉచితంగా చేరవేసేందుకు నిర్వాహక కమిటీ స్వచ్ఛ నాగాయలంక, గ్రామాభివృద్ధి కమిటీ ప్రత్యేకంగా జెట్టీలను ఏర్పాటు చేశాయి. సందర్శకుల కోసం ఆట పాటలతోపాటు దివిసీమ ప్రత్యేక రుచులను, సీ ఫుడ్స్‌ను అందుబాటులో ఉంచారు. డిప్యూటీ స్పీకర్ బుద్ధప్రసాద్, ఫైర్ డిజి సత్యన్నారాయణ, ఎన్‌ఆర్‌ఐ హనిమీరెడ్డిసైతం చిన్న పిల్లలుగా మారిపోయారు. పర్యాటకులతో కలిసి పతంగులను ఎగురవేస్తూ, పారా గ్లైడింగ్ చేస్తూ సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. అనంతరం భవిరి రవి బృందం ప్రదర్శించిన మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది.



ఆకట్టుకుంటున్న బాలు సైకతశిల్పం (శాండ్ ఆర్ట్)

నేటి నుంచి పోటీలు

దివిసీమ సాంప్రదాయ పడవ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు సాంప్రదాయ పడవ పోటపీలు, జల క్రీడల అకాడమీ విద్యార్థుల కాయకింగ్, కనోయింగ్ ప్రదర్శనలు జరగనున్నాయి. 14న డ్రాగన్ బోట్ రేస్‌ను నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

నదిలో తేలియాడుతూ..

నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లో పదుల సంఖ్యలో ప్రజలు నీటిపై తేలుతూ శవాసనాలు వేసి వీక్షకులను అబ్బురపరిచారు. ఇప్పటి వరకు నదిలో నీటిపై తేలుతూ ఆసనాలు వేయటంలో ప్రపంచ రికార్డు ఏదీ లేకపోవటంతో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలువురు గ్రామస్తులు నీటిపై శవాసనం వేసి రాబోయే రోజుల్లో రికార్డు దిశగా అడుగులు వేస్తున్నారు. దాదాపు 50 మంది స్థానికులు నీటిపై తేలుతూ ఆసనాలు వేశారు. రానున్న రోజులలో వందలాది మంది ఆసనాలు వేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదు చేయాలని భావిస్తున్నారు. పదేళ్ల పిల్లల నుంచి వృద్ధుల వరకు ఈ ఆసనాలు వేస్తుండటం విశేషం. రెండు కాళ్లులేని యువకుడు తలశిల రాము తానుసైతం నదిలో తేలుతూ ఆసనం వేయటం అందరినీ ఆకట్టుకుంది. నదిలో ఆసనాలను డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, ఫైర్ డీజీ కె సత్యనారాయణ, ఎన్‌ఆర్‌ఐ లక్కిరెడ్డి హనిమిరెడ్డి తదితరులు వీక్షించారు.



కృష్ణానదిలో నీటిపై తేలుతూ శవాసనాలు వేస్తున్న నాగాయలంక వాసులు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.